


RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326



రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | వెల : 4/-


## ఈ నెల 14 నుంచి

# భూభారతి అమలు!




- భూభారతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష
- పైలట్ ప్రాజెక్టు కోసం మూడు మండలాలను ఎంపిక చేసినట్లు వెల్లడి
- ప్రజల నుంచి సలహాలు,సూచనలు

# కాంగ్రెస్‌పై మండిపడ్డ కేటీఆర్



- రజతోత్సవ సభకు అనుమతివ్వలేదని ఆరోపణ
- మార్చి 28న అనుమతికి అప్లై చేసినప్పటికీ ఇంకా ప్రతిస్పందన లేదు

2025 సంవత్సరం బీఆర్ఎస్ పార్టీకి కీలకమని పేర్కొన్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కరీంనగర్ ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభకు ఇప్పటివరకు పోలీసులు అనుమతులు ఇవ్వలేదని ఆరోపించారు.మార్చి 28న అనుమతికి అప్లై చేసినప్పటికీ ఇంకా ప్రతిస్పందన లేదని తెలిపారు.


- మిగతా 2 లో


## యాపిల్‌కు

# ట్రంప్ గుడ్‌న్యూస్




- సుంకాల నుంచి ఫోన్లు, కంప్యూటర్లకు మినహాయింపు
- అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తాజాగా మార్గదర్శకాలను జారీ
- చైనా మినహా మిగిలిన దేశాలపై వేసిన సుంకాలను ఇటీవల ట్రంప్ వాయిదా వెల్లాయ్

# బీజేపీపై కుట్రలు..




- ★ పురందేశ్వరి షాకింగ్ కామెంట్స్
- ★ అంబేద్కర్ రాజ్యాంగం మారుస్తారని మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం
- ★ మోదీ ప్రధానమంత్రి అయిన నాటి నుంచే అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లారు
- ★ విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు
- ★ 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా బూత్ లెవల్‌లో





## సోనియా, రాహుల్ గాంధీకి ఈడీ బిగ్ షాక్..

- కేసు దర్యాప్తులో జప్తు చేసిన రూ.661 కోట్ల స్థిరాస్తులను స్వాధీనం చేసుకునేందుకు తాజాగా నోటీసులు జారీ
- ఢిల్లీ, ముంబయి, లక్నోలోని ఆస్తులపై ఈ మేరకు నోటీసులు అతికించినట్లు ఓ ప్రకటన

## తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా నాగేంద్రన్

- ఎన్నికలో అమిత్ షా మార్క్?!
- నాగేంద్రన్ పేరును ప్రతిపాదించిన అన్నామలై- ఒక్కరే నామినేషన్ దాఖలు
- అన్నాడీఎంకే, బీజేపీ మధ్య కుదిరిన పొత్తు
- అంతకుముందు రాష్ట్ర అధ్యక్ష పదవికి నాగేంద్రన్ పేరును కె.అన్నామలై, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, కేంద్ర మాజీ మంత్రి పోన్ రాధాకృష్ణన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ ప్రతిపాదన




## ఇంటర్ ఫలితాల్లో

# ప్రభుత్వ కాలేజీలు సత్తా

- నేడు ఇంటర్ ఫలితాలు విడుదల చేసిన మంత్రి నారా లోకేశ్
- ఫస్టియర్ లో 70 శాతం ఉత్తీర్ణత
- సెకండియర్ లో 83 శాతం ఉత్తీర్ణత
- ప్రభుత్వ కాలేజీల్లో మంచి ఫలితాలు వచ్చాయన్న సీఎం



ఏపీలో ఇవాళ ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఎంతో నిరాడంబరంగా, చెప్పిన సమయానికే ఇంటర్ ఫలితాలను వెలువరించారు. ఫస్టియర్ విద్యార్థుల్లో 70 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా, సెకండియర్ విద్యార్థుల్లో 83 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు.ఈసారి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణులందరికీ హార్దిక శుభాభినందనలు తెలుపుతున్నానని వెల్లడించారు."ప్రభుత్వ జూనియర్


- మిగతా 2 లో


## నాడు కోవిడ్-19..

# నేడు ట్రంప్ సుంకాలు

- సంక్షోభాలే భారత్‌కు కొత్త అవకాశాలు
- ప్రతి సంక్షోభంలో ఒక గొప్ప అవకాశం దాగుంటుంది
- అతికొద్ది కాలంలోనే భారత్ స్వయంసమృద్ధిని సాధించడంతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి




ప్రతి సంక్షోభంలో ఒక గొప్ప అవకాశం దాగుంటుంది అని. ప్రఖ్యాత శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పిన సూక్తిగా ప్రపంచవ్యాప్తంగా ఈ మాట ప్రసిద్ధి చెందింది.దీన్ని ఆచరణలో నిజం చేసి చూపిస్తోంది నేటి నవ భారతదేశం. సాధారణంగా ఏదైనా సంక్షోభం తలెత్తిందంటే చాలు.. వ్యవస్థలు, దేశాలు


- మిగతా 2 లో

## మొదటిపేజీ తరువాయి

## ఇంటర్ ఫలితాల్లో ప్రభుత్వ కాలేజీలు సత్తా



కళాశాలల్లో గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఉత్తీర్ణత శాతం పెరిగింది. ప్రభుత్వ కాలేజీల విద్యార్థులు ఫస్టియర్ లో 47 శాతం, సెకండియర్ లో 69 శాతం ఉత్తీర్ణత సాధించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఫస్టియర్ లో 11 శాతం, సెకండియర్ లో 9 శాతం పెరుగుదల నమోదైంది. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌ల పంపిణీ, మధ్యాహ్న భోజన పథకం, కేంద్రీకృత మూల్యాంకనం, పర్యవేక్షణ, నూతన సమయపాలన, 100 రోజుల సక్సెస్ కార్యక్రమం, తరగతుల వారీగా వాట్సాప్ గ్రూపులు, సంరక్షకుల వ్యవస్థ... ఇలా విద్యా రంగంలో మేము ప్రవేశపెట్టిన సంస్కరణలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడ్డాయి" అని చంద్రబాబు వివరించారు.

## సోనియా, రాహుల్ గాంధీకి ఈడీ బిగ్ షాక్..



నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి ఈడీ షాకిచ్చింది. ఈ కేసు దర్యాప్తులో జప్తు చేసిన రూ.661 కోట్ల స్థిరాస్తులను స్వాధీనం చేసుకునేందుకు తాజాగా నోటీసులు జారీ చేసింది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో బిగ్ ట్విస్ట్ చోటుచేసుకుంది. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ షాకిచ్చింది. ఈ కేసు దర్యాప్తులో జప్తు చేసిన రూ.661 కోట్ల స్థిరాస్తులను స్వాధీనం చేసుకునేందుకు తాజాగా నోటీసులు జారీ చేసినట్లు పేర్కొంది. ఢిల్లీ, ముంబయి, లక్నోలోని ఆస్తులపై ఈ మేరకు నోటీసులు అతికించినట్లు ఓ ప్రకటనలో చెప్పింది. సంబధిత ఆస్తులను ఖాళీ చేయాలని.. లేదా వాటికి వచ్చే అద్దెలను బదిలీ చేయాలని చెప్పింది. చట్టం కింద ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. అయితే నేషనల్ హెరాల్డ్ పత్రికకు అసోసియేటెడ్ జర్నర్స్ (%ూజీ%) ప్రచురణకర్తగా ఉంది. దీనికి 'యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్' యాజమాన్య సంస్థ. సోనియా, రాగుల్ గాంధీలతో పాటు మరికొందరు పార్టీ నేతలు ఇందులో ప్రమోటర్లుగా ఉన్నారు. కాంగ్రెస్‌కు ఏజేఎల్ బకాయి పడ్డ రూ.90.21 కోట్లను వసూలు చేసుకునే అంశంలో యంగ్ ఇండియన్‌లో ఆర్థిక అవకతవకలు జరిగాయనే ఆరోపణలున్నాయి. దీనిపైనే ఈడీ దర్యాప్తు చేస్తోంది. అయితే 2023 నవంబర్‌లో సంబంధిత స్థిరాస్తులతో పాటు ఏజేఎల్‌లో ఈక్విటీ షేర్ల రూపంలో ఉన్న యంగ్ ఇండియన్‌కు చెందిన రూ.90.21 కోట్లు జప్తు చేసింది. ఈ కేసులో సోనియా, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సీనియర్ నేత పవన్ కుమార్ బన్సల్‌ను ఇప్పటికే ఈడీ విచారణ చేసింది. వాళ్ల స్టేట్‌మెంట్లు కూడా రికార్డ్ చేసింది. తాజాగా దానికి సంబంధించిన స్థిరాస్తులు స్వాధీనం చేసుకునేందుకు నోటీసులు పంపించింది.

## నాడు కోవిడ్-19.. నేడు ట్రంప్ సుంకాలు

కుదేలైపోతుంటాయి. కానీ భారత్ మాత్రం సంక్షోభాల నుంచి సరికొత్త అవకాశాలను సృష్టించుకుని పైకి ఎదుగుతోంది. ఇందుకు ఉదాహరణ కోవిడ్-19 సంక్షోభమే. కరోనా మహమ్మారి చైనా నుంచి విస్తరించి యావత్ ప్రపంచాన్ని చుట్టేసి ఉక్కిరిబిక్కిరి చేసిన సమయానికి భారత్ సర్జికల్ మాస్కులు, గ్లౌజులు సహా అనేక మెడికల్ పరికరాల కోసం దిగుమతులపైనే ఆధారపడాల్సిన స్థితిలో ఉంది. కానీ అతికొద్ది కాలంలోనే భారత్ స్వయంసమృద్ధిని సాధించడంతో పాటు ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి చేరుకుంది. ఆ తర్వాత యావత్ ప్రపంచానికే కోవిడ్-19 వ్యాక్సిన్లు అందజేసిన విషయం అందరికీ తెలిసిందే. ఆ తర్వాత కూడా ఉక్రెయిన్-రష్యా యుద్ధం రూపంలో మరో సంక్షోభం తలెత్తినప్పుడు.. ప్రపంచం రెండుగా చీలిపోయింది. అయితే ఆ వర్గం లేదంటే ఈ వర్గం అన్నట్టుగా మిగతా దేశాలన్నీ వ్యవహరిస్తే.. భారత్ మాత్రం ధైర్యంగా తటస్థ వైఖరిని అవలంబించింది. అంతేకాదు.. రష్యాను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశంతో ఆ దేశ ఉత్పత్తులపై నాటూ దేశాలు ఆంక్షలు పెట్టినప్పుడు.. రష్యా చమురును అతి తక్కువ ధరలకు కొనుగోలు చేసి భారత్ తన అవసరాలు తీర్చుకుంది. గత పదేళ్లకాలంలో ఇలాంటి విజయగాథలు ఎన్నో కనిపిస్తాయి. అయితే ఇప్పుడు తాజాగా మరో సంక్షోభం తలెత్తింది. అది అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వివిధ దేశాలపై విధించిన సుంకాల రూపంలో ఎదురైంది. అయితే.. 90రోజులు సుంకాలకు బ్రేక్ వేసినా.. మున్ముందు ఈ సంక్షోభాన్ని భారత్ ఎలా ఎదుర్కోబోతుంది అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న.

**అమెరికా సుంకాలు: భారత్‌కు సంక్షోభమా, వరమా?**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ వాణిజ్యంలో కొత్త అలజడిని సృష్టించారు. చైనాతో సహా వివిధ దేశాలపై దిగుమతి సుంకాలను భారీగా పెంచడం ద్వారా ఆర్థిక ఒత్తిడిని కలిగిస్తున్నారు. ఈ ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టాక్ మార్కెట్లు భారీ కుదుపునకు గురయ్యాయి. రక్తమోడేలా నష్టాలబాట పట్టాయి. దీంతో తాత్కాలికంగా తన నిర్ణయంపై 90 రోజుల 'స్టే' విధించుకున్న ట్రంప్ చైనాపై మాత్రం వెనకడుగు వేయలేదు. ఆ దేశంపై మొదట ప్రకటించిన 54% సుంకాన్ని ఏకంగా 125%కి పెంచినట్లు ప్రకటించారు. ఇతర దేశాలపై 90 రోజుల విరామంతో 10% బేస్‌లైన్ సుంకాన్ని కొనసాగించారు. ఈ పరిణామాలు భారత్‌కు సవాళ్లను, అవకాశాలను రెండింటినీ తెచ్చిపెడుతున్నాయి. కోవిడ్-19 సంక్షోభ సమయంలో భారత్ తనను తాను ఉత్పత్తి కేంద్రంగా మలచుకున్న విధానంతో పోల్చితే, ఈ సుంకాలు భారత్‌కు ఎలాంటి ఫలితాలను ఇస్తాయో విశ్లేషిద్దాం.

**కోవిడ్-19 సంక్షోభం అమెరికా సుంకాలు: సారూప్యతలు, వ్యత్యాసాలు**

2020లో కోవిడ్-19 మహమ్మారి సరఫరా గొలుసులను ఛిన్నాభిన్నం చేసినప్పుడు, చైనాపై ఆధారపడిన అనేక అంతర్జాతీయ సంస్థలు ప్రత్యామ్నాయ గమ్యస్థానాల కోసం చూశాయి. భారత్ ఈ సంక్షోభాన్ని వరంగా మలచుకుంది. "మేక్ ఇన్ ఇండియా" మరియు "ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్" (%ూ×%) పథకాల ద్వారా ఎలక్ట్రానిక్స్, ఫార్మా, టెక్స్‌టైల్స్ వంటి రంగాల్లో ఉత్పత్తిని పెంచింది. ఫాక్స్‌కాన్, శామ్‌సంగ్ వంటి సంస్థలు చైనా నుంచి భారత్‌కు తమ యూనిట్లను తరలించాయి. దీని ఫలితంగా, 2023 నాటికి భారత్ మొబైల్ ఫోన్ ఎగుమతులు %వి%20 బిలియన్లకు చేరాయి, ఐఫోన్ తయారీలో 25% వాటాను లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పుడు, అమెరికా సుంకాలు కూడా చైనాపై ఒత్తిడిని పెంచుతున్నాయి. 125% సుంకాలతో చైనా ఉత్పత్తులు అమెరికా మార్కెట్‌లో ఖరీదైనవిగా మారాయి. దీంతో సంస్థలు భారత్, వియాత్నాం వైపు చూస్తున్నాయి. కోవిడ్ సమయంలో సరఫరా సమస్యలు వస్తు రవాణాపై ప్రభావం చూపితే, ఇప్పుడు సుంకాలు ఆర్థిక ఒత్తిడి ద్వారా అదే ఫలితాన్ని సాధిస్తున్నాయి. అయితే, కోవిడ్ సంక్షోభం ఒక అత్యవసర పరిస్థితి కాగా, సుంకాలు ఒక దీర్ఘకాల వాణిజ్య విధానం. ఇది భారత్‌కు స్థిరమైన ప్రయోజనాలను అందించే అవకాశం ఉంది. అలాగని సవాళ్లు కూడా లేకపోలేదు.

**భారత్‌పై ప్రభావం - ప్రయోజనాలు**

తయారీ కేంద్రంగా అవకాశం: చైనాపై 125% సుంకాలు, వియాత్నాంపై 46%, బంగ్లాదేశ్‌పై 37% సుంకాలతో భారత్ (26%) సాపేక్షంగా తక్కువ సుంకాలతో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. టెక్స్‌టైల్స్, ఎలక్ట్రానిక్స్, మెషినరీ రంగాల్లో భారత్ ఎగుమతులు పెరిగే అవకాశం ఉంది. గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనిషియేటివ్ (%+ు=×%) ప్రకారం, చైనా, తైవాన్ నుంచి సప్లై చైన్ తెగిపోయి, భారత్‌కు లబ్ధి చేకూర్చే అవకాశం ఉంది. ఎగుమతి పోటీతత్వం: అమెరికా మార్కెట్‌లో చైనా ఉత్పత్తులు ఖరీదైనవిగా మారడంతో, భారత టెక్స్‌టైల్స్, ఫార్మా ఉత్పత్తులు పోటీపడే అవకాశం పెరుగుతుంది. కోవిడ్ సమయంలో ఫార్మా ఎగుమతులు పెరిగినట్లే, ఇప్పుడు కూడా ఈ రంగం లబ్ధి పొందవచ్చు. ఆర్థిక వృద్ధి: ఎగుమతులు పెరిగితే, భారత్ జీడీపీలో సానుకూల మార్పు కనిపిస్తుంది. కోవిడ్ తర్వాత డిజిటల్ ఎకానమీ %వి%1 ట్రిలియన్ వృద్ధికి దోహదపడినట్లే, సుంకాలు కూడా "ఆత్మనిర్భర్ భారత్" లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడవచ్చు.

# కాంగ్రెస్‌పై మండిపడ్డ కేటీఆర్

### మొదటిపేజీ తరువాయి



తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవానికి ప్రతీకగా బీఆర్ఎస్ పార్టీ నిలిచిందని, రాష్ట్రం రూపుదిద్దుకునే దశలో పుట్టిన ఈ పార్టీ ఇప్పటికి అరవై లక్షల సభ్యులను కలిగి ఉందన్నారు. "రజతోత్సవం ప్రభుత్వానికి విరుద్ధంగా నిర్వహించే సభ కాదు, ఇది మేం ప్రతి సంవత్సరం జరుపుకునే వార్షికోత్సవ సభ మాత్రమే," అని స్పష్టం చేశారు. బస్సుల కోసం ఇప్పటికే 10 కోట్లను చెల్లించామని, ఈ సభ అనంతరం ఏడాది పాటు రజతోత్సవ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. కంచె గచ్చిబౌలి భూముల వివాదాన్ని ప్రస్తావించిన కేటీఆర్, "ఆ భూములను ఎవరైనా కొనుగోలు చేస్తే మేము అధికారంలోకి వచ్చాక తిరిగి రికవరీ చేస్తాం" అని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని "పెద్ద ఫేక్"గా అభివర్ణించిన కేటీఆర్, ఆయన బదులుగా "అపరిచితుడు" అని ఆదేశించండి," అంటూ సవాల్ విసిరారు. విమర్శించారు. తమ హయంలో ప్రభుత్వ సంస్థలు భూములు అమ్మాయని అంగీకరించిన కేటీఆర్, ప్రస్తుతం బ్రోకర్ల చేతిలో భూములు అమ్ముబడుతున్నాయంటూ ఆరోపించారు. పదివేల కోట్ల రుణం కోసం రూ.170 కోట్లు బ్రోకర్ కమిషన్ చెల్లించారని, బీజేపీ ఎంపీ , బొంబాయి బ్రోకర్ కలిసి తాకట్టు పెట్టారని ఆరోపించారు. మూసీ నదిపై జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకునేలా ప్రజలను దారి తప్పిస్తున్నారని, ఈ ప్రాజెక్టు వెనక లక్షా 50 వేల కోట్ల అవినీతి దాగి ఉందని ఆరోపించారు. కేటీఆర్ వ్యాఖ్యల ప్రకారం, కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతికి కళ్లెం వేసే శక్తి బీఆర్ఎస్‌కే ఉందని స్పష్టం చేశారు. "బీజేపీ, కాంగ్రెస్ వేరేవేరు అని అనుకుంటే విచారణకు

# యాపిల్‌కు ట్రంప్ గుడ్‌న్యూస్



### మొదటిపేజీ తరువాయి

టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రతీకార సుంకాల నుంచి స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, సెమీ కండక్టర్లను మినహాయించారు. ఈ మేరకు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తాజాగా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ నిర్ణయం ద్వారా యాపిల్, శాంసంగ్ వంటి పెద్ద పెద్ద కంపెనీలతో పాటు అమెరికాలోని వినియోగదారులకూ ఊరట లభించనట్లయ్యింది. చైనా మినహా మిగిలిన దేశాలపై వేసిన సుంకాలను ఇటీవల ట్రంప్ వాయిదా వేసిన సంగతి తెలిసిందే. అయితే, చైనాపై మాత్రం 145 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిగా చైనా కూడా అమెరికా ఉత్పత్తులపై 125 శాతం సుంకం వేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ఇరు దేశాల మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అమెరికాకు చెందిన యాపిల్ వంటి సంస్థలు చైనాలో ఐఫోన్లు, ఇతర యాపిల్ ప్రొడక్టులను అధికంగా ఉత్పత్తి చేస్తున్నాయి. ట్రంప్ చర్యల మూలంగా అమెరికాలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయన్న ఆందోళన ప్రజల్లో నెలకొంది. దీంతో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కొనుగోలుకు స్థానికంగా ఎగబడిన ఘటనలూ వెలుగులోకి వచ్చాయి.

**3 రోజుల్లో 5 విమానాల ఐఫోన్లు ఎగిరి వెళ్లాయ్**

స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, హార్డ్ డ్రైవ్‌లు, కంప్యూటర్ ప్రాసెసర్లు, మెమొరీ చిప్‌లు, సెమీ కండక్టర్లు, సోలార్ సెల్స్, ఫ్లాట్ టీవీ డిస్‌ప్లేలు వంటి వాటిని ఈ ప్రతీకార సుంకాల నుంచి మినహాయింపు పొందిన జాబితాలో ఉన్నాయి. అంటే చైనాపై విధించిన 145 శాతం సుంకం వీటికి వర్తించదు. వీటికి వేర్వేరు సుంకాలు వర్తిస్తాయని కస్టమ్స్ విభాగం పేర్కొంది. వాస్తవానికి ఈ ప్రతీకార సుంకాల నుంచి మినహాయింపు పొందాలంటే ఆయా ఉత్పత్తులను అమెరికాలోనే తయారు చేయాల్సి ఉంటుంది. దీనికి కొన్నేళ్ల సమయం పడుతుంది. ఈ క్రమంలోనే వాటిని మినహాయిస్తూ ట్రంప్ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మరోవైపు ప్రతీకార సుంకాల ప్రకటన అనంతరం అత్యధికంగా నష్టపోయిన కంపెనీ ఏదైనా ఉందీ అంటే అది యాపిలే. తాజా నిర్ణయం ఆ కంపెనీకి గుడ్‌న్యూస్ అనే చెప్పాలి.

# బీజేపీపై కుట్రలు..




### మొదటిపేజీ తరువాయి

మోదీ ప్రధానమంత్రి అయిన నాటి నుంచే అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లారని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి వ్యాఖ్యానించారు. ఈనెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా బూత్ లెవల్‌లో కార్యక్రమాలు చేపట్టామని దగ్గుబాటి పురంధేశ్వరి పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం మారుస్తారని మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేశారని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ హయాంలోనే రాజ్యాంగంలో ఎక్కువసార్లు సవరణలు జరిగాయని చెప్పారు. ముస్లింల ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని స్వార్థంతో కాంగ్రెస్ నేతలు మోదీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. బీజేపీ రాజ్యాంగంలో 22 సవరణలు చేసినా అది వివిధ వర్గాల అభ్యున్నతికి చేసినవేనని తెలిపారు. సామాజిక న్యాయం కోసం ఈ నిర్ణయాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీసుకున్నారని చెప్పారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో ఇవాళ (శనివారం) అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే. అరుణ, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి, సోమువీర్రాజు, దయాకర్ రెడ్డి, గుడిసె దేవానంద్, విల్సన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దగ్గుబాటి పురంధేశ్వరి మీడియాతో మాట్లాడారు. ఈనెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా బూత్ లెవల్‌లో కార్యక్రమాలు చేపట్టామని దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. సమసమాజ స్థాపన కోసం అంబేద్కర్ కృషి చేశారని చెప్పారు. అన్ని వర్గాల వారికి సమాన న్యాయం అందించడం అంబేద్కర్ లక్ష్యమని చెప్పారు. అదే ఆదర్శంగా బీజేపీ ప్రజల కోసం పని చేస్తోందని అన్నారు. 2014లో బీజేపీపై కాంగ్రెస్ నేతలు విష ప్రచారం చేశారని మండిపడ్డారు. నిజానికి అంబేద్కర్‌కు గౌరవించి సమున్నత స్థానం కల్పించింది బీజేపీనేనని ఉద్ఘాటించారు. ఆయనను గతంలో అవమానించి, రాజీనామా చేసేలా చేసిన చరిత్ర ఎవరిదో అందరికీ తెలుసునని చెప్పారు. భారతరత్న ఇచ్చినా, పార్లమెంటులో అంబేద్కర్ చిత్ర పటం పెట్టినా, ఐదు ప్రాంతాలను పంచ్ తీర్థగా , ఆయన నివాసాన్ని బీజేపీ అభివృద్ధి చేసిందని అన్నారు. ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కోసం రాజ్యాంగం మారుస్తామని డీకే శివకుమార్ చెప్పడం సరికాదని అన్నారు. భారత రాజ్యాంగం వల్లే బీసీగా ఉన్న తాను ప్రధానిగా అయ్యానని మోదీ చెప్పారని గుర్తుచేశారు. ఈ అంశాలను ప్రజలకు వివరించేందుకు తమ సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు విషయ పరిజ్ఞానం పెంచుకుని ప్రజలకు వివరించాలని దగ్గుబాటి పురంధేశ్వరి విజ్ఞప్తి చేశారు.

**అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజలకు వివరిస్తాం: డీకే అరుణ**

అంబేద్కర్ జయంతి వేడుకలను ఈనెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించామని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ తెలిపారు. అంబేద్కర్ జయంతి వేడుకలను గ్రామగ్రామాన నిర్వహిస్తామని తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని తాము ప్రజలకు వివరిస్తామని అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చేస్తామని కాంగ్రెస్ నేతలు అసత్యాలు ప్రచారం చేశారని మండిపడ్డారు. కానీ అంబేద్కర్‌ను, ఆయన రాజ్యాంగాన్ని అవమానించిన చరిత్ర కాంగ్రెస్‌దేనని విమర్శించారు. నెహ్రూ అయితే అంబేద్కర్‌ను ఓడించడనికి చాలా కుట్రలు చేశారని ఆరోపించారు. అధికారమే లక్ష్యంగా, ఓట్ల రాజకీయం కోసం రాజ్యాంగానికి కాంగ్రెస్ సవరణలు చేసిందని డీకే అరుణ విమర్శించారు. మోదీ ప్రధానమంత్రి అయిన నాటి నుంచే అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లారని డీకే అరుణ చెప్పారు. మోదీ చేసిన సవరణలు దేశం హితం, ప్రజా హితం గురించే చేశారని తెలిపారు. కాంగ్రెస్ అబద్దాలు ప్రచారం చేసింది కాబట్టే...ప్రజలు వారికి గుణపాఠం చెప్పారని అన్నారు. దేశం అభివృద్ధి, అన్నివర్గాలు, అన్నిప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా మోదీ పాలన చేస్తున్నారని ఉద్ఘాటించారు. సమాజంలో అన్ని వర్గాల వారికి న్యాయం చేసేలా బీజేపీ ప్రభుత్వం ఆలోచనలు చేస్తుందని తెలిపారు. బీజేపీ కార్యశాల ద్వారా పార్టీ లక్ష్యాలు, అంబేద్కర్ ఆశయాలను ప్రజలకు వివరించేలా శిక్షణ ఇస్తామని అన్నారు. రేపు సాయంత్రం అంబేద్కర్ విగ్రహాలను శుద్ధి చేసి దీపాలు పెడతామని చెప్పారు. 14వ తేదీన అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహిస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌ను ఏ విధంగా అవమానించి, పార్టీ నుంచి బయటకు పంపారనే విషయాలను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. బీజేపీ ఏ విధంగా అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తుందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని డీకే అరుణ పేర్కొన్నారు.

# తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా నాగేంద్రన్



### మొదటిపేజీ తరువాయి

తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా పార్టీ నేత, తిరునల్వేలి ఎమ్మెల్యే నైనార్ నాగేంద్రన్ ఎన్నికయ్యారు. చెన్నైలో నిర్వహించిన పార్టీ సమావేశంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్‌లు ఈ మేరకు ప్రకటించారు. నాగేంద్రన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడం వల్ల ఆయనకే ఈ పదవి ఖరారైంది. కాగా, అంతకుముందు రాష్ట్ర అధ్యక్ష పదవికి నాగేంద్రన్ పేరును కె.అన్నామలై, కేంద్రమంత్రి ఎల్.మురుగన్, కేంద్ర మాజీ మంత్రి పోన్ రాధాకృష్ణన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ ప్రతిపాదించారు. ఈ ఎన్నిక వెనక కేంద్ర మంత్రి అమిత్ షా నిర్ణయాలు కీలకంగా పనిచేసినట్లుగా తెలుస్తోంది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, అన్నాడీఎంకేలు జట్టుకట్టిన వేళ ఈ పరిణామం జరిగింది. 1960లో కన్యాకుమారి జిల్లా నాగర్‌కొయిల్ సమీపంలోని వడివీశ్వరంలో నాగేంద్రన్ జన్మించారు. ముందు అన్నాడీఎంకేలో కీలకంగా ఉన్న ఆయన అనంతరం బీజేపీలో చేరారు. 2020 జులై నుంచి కమలం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జయలలిత, పన్నీరుసెల్వం ప్రభుత్వాల్లో పలు శాఖలకు మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయన సొంతం. ప్రభుత్వ పాలన, ప్రజలతో మేమకం, రాజకీయాల్లో వ్యూహాలపై పట్టు ఉండటం వల్ల అధిష్ఠానం ఆయన వైపు మొగ్గుచూపినట్లు విశ్లేషకుల అంచనా వేస్తున్నారు. దీంతో పాటు అన్నాడీఎంకే, బీజేపీలను సమన్వయం చేసుకోవడంలో కీలకంగా వ్యవహరిస్తారని భావిస్తున్నారు.

**అన్నాడీఎంకే, బీజేపీ మధ్య కుదిరిన పొత్తు**

శుక్రవారం తమిళనాడులో పర్యటించిన బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పొత్తుపై కీలక ప్రకటన చేశారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని ఇరు పార్టీలు నిర్ణయించినట్లు షా ప్రకటించారు. వచ్చే ఏడాది తమిళనాడులో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే అధ్యక్షుడు పళనిస్వామి నేతృత్వంలో పనిచేస్తామని స్పష్టం చేశారు. కొన్ని అంశాల్లో అన్నాడీఎంకే వైఖరి భిన్నంగా ఉన్నా, చర్చల ద్వారా కనీస ఉమ్మడి ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళ్తామని వెల్లడించారు. అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో తాము తలదూర్చబోమని చెప్పారు. అధికారం, సీట్ల పంపకాలపై తర్వాత నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## ఈ నెల 14 నుంచి భూభారతి అమలు!

### మొదటిపేజీ తరువాయి

ఈ నెల 14వ తేదీ నుంచి భూభారతిని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేయనున్నట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో భూభారతిపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మొదట పైలట్ ప్రాజెక్టుగా భూభారతిని అమలు చేయనున్నట్లు తెలిపారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే మూడు మండలాలను ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ప్రజల సలహాలు, సూచనలను స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా భూభారతిని రూపొందించినట్లు చెప్పారు. ఈ పోర్టల్‌పై ప్రతి మండలంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, ఈ బాధ్యతలను కలెక్టర్లకు



అప్పగించనున్నట్లు తెలిపారు.

# ఉపాధి కూలీగా మారిన జిల్లా కలెక్టర్

పర్వతాపూర్ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్..






**రామాయంపేట,ఏప్రిల్ 12 (సూర్యరేఖ):** రామాయంపేట మండలం పర్వతాపూర్ గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపాధి కూలీగా మారి గడ్డపారతో కందకాలు తవ్వే పనులను చేశారు. అనంతరం ఆయనే స్వయంగా కందకాల కొలతలు చూశారు.ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు సూచించారు.ఒక్కో గ్రామంలో 50 మందికి పైగా వెళ్తున్నారని,వారి సంఖ్య 100కు పెరిగేలా చూడాలని అన్నారు. ఉపాధికూలీలకు వేసవికాలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు.ఓ రైతు వేసిన వరి పొలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అక్కడినుండి కాత్రియాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలలో భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులను ఎంతో ఆప్యాయంగా పలకరించి వారితో మాట్లాడారు.నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు,భోజనం నిర్వాహకులకు సూచించారు.ఆయన వెంట ఎంపీడీవో షాజలుద్దీన్,టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

# ఇంటర్నేషనల్ డ్రాయింగ్ ఒలంపియాడ్
# స్టేట్ లో గోల్డ్ మోడల్ సాధించిన గీతాన్విత..





**రామాయంపేట,ఏప్రిల్ 12 (సూర్యరేఖ):** రామాయంపేట పట్టణానికి చెందిన చింతల ఉష శ్రీనివాస్ దంపతుల కూతురు గీతాన్విత రామాయంపేట పట్టణంలోని వివేకనంద విద్యాలయంలో 5వ తరగతి చదువుతున్నది. ఇంటర్నేషనల్ డ్రాయింగ్ ఒలంపియాడ్ పోటీలు నిర్వహించారు.రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించడం జరిగింది.ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు సాధించినందుకు గోల్డ్ మెడల్ అందజేయడం జరిగింది.రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించిన విద్యార్థిని గీతాన్వితను పాఠశాల ఉపాధ్యాయ బృందం,పట్టణవాసులు అభినందించారు.

# బిజెపి డివిజన్ సెక్రెటరీ ఆడెపు
# రమేష్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి,రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ శిల్పారెడ్డి






**ఉప్పల్,ఏప్రిల్ 12(సూర్యరేఖ):** హనుమాన్ జయంతి సందర్భంగా ఉప్పల్ బస్టాప్ ఆవరణలో ఉప్పల్ డివిజన్ బీజేపీ కార్యదర్శి ఆడెపు రమేష్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది.ముఖ్య అతిథిలుగా మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి,రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు డాక్టర్ మేకల శిల్పారెడ్డి,లు హాజరై లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మజ్జిగ,చల్లని మంచినీళ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆడెపు రమేష్ మాట్లాడుతూ...వేసవికాలం ముగిసే వరకు ప్రతి ఏడు లాగే ఈసారి కూడా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మార్నేని ఫణీందర్,బిజెపి నాయకులు రావుల బాలకృష్ణ ,తీగ విఠల్ రావు ముదిరాజ్,పద్మ,దువ్వల రమేశ్,రెడ్డిగారి దేవేందర్ రెడ్డి,రాజేందర్,సింగారం కార్తీక్,శ్రీధర్ గుప్తా,భాగ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి పూజలో పాల్గొన్న
# కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్




**చిలుకానగర్,ఏప్రిల్ 12(సూర్యరేఖ):** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని చిల్కానగర్ డివిజన్ లోని ఎన్జిఆర్ఐ అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో కార్పొరేటర్ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మాజీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ప్రతినిధులు కార్పొరేటర్ బండాల గీతా ప్రవీణ్ ను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ సీనియర్ నాయకులు కొక్కొండ జగన్,ముద్దం శ్రీనివాస్ యాదవ్,బాలకృష్ణగౌడ్ ( ఫోటో బాలు) రాజుగౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# నేడు గొర్రెల కాపరుల ఆవిర్భావ
# మహాసభను విజయవంతం చేయండి


మెదక్ జిల్లా అధ్యక్షుడు ఉడెం దేవరాజు యాదవ్



**రామయంపేట,ఏప్రిల్ 12(సూర్యరేఖ):** యాదగిరిగుట్ట లక్కీ గార్డెన్ లో ఆదివారం నిర్వహించ తలపెట్టిన గొర్రెల కాపర్ల సంక్షేమ సంఘం నాల్గవ ఆవిర్భావ మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు ఊడెం దేవరాజు యాదవ్ పిలుపునిచ్చారు.శనివారం రామాయంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.మండల కమిషన్ సిఫారసులను అమలు చేయాలని,కోరుకునే ప్రతి ఒక్కరు బీపీ మండల ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు.పశు పాలకులు ప్రజాపాలకులుగా మారాలనే లక్ష్యంతో జికేఎస్ఎస్ ఆవిర్భవించిందని గుర్తు చేశారు.గొర్రెల కాపరులకు రావలసిన హక్కులను ప్రతిఘటించి,పోరాడి సాధించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు పోచబోయిన శ్రీహరి యాదవ్,యాదవ సంఘం ముఖ్య నాయకులు హాజరవుతారని తెలిపారు.ఆవిర్భావ మహాసభకు పెద్ద ఎత్తున యాదవ బంధుమిత్రులు సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పరిగి తహసిల్దార్ కార్యాలయం బేష్..

సర్టిఫికెట్లు జారీ చేయడంలో నెంబర్ జిల్లాలోనే మొదటి స్థానం..



| S.no. | Mandal/S.R.O | Income Certificate Within SLA | Income Certificate Beyond SLA | C&D Within SLA | C&D Beyond SLA | TOTAL |
|---|---|---|---|---|---|---|
| 1 | Marpalle | 394 | 533 | 466 | 45 | 1438 |
| 2 | Vikarabad | 353 | 549 | 379 | 49 | 1330 |
| 3 | Yelal | 347 | 612 | 220 | 75 | 1254 |
| 4 | Dharur | 130 | 269 | 184 | 141 | 724 |
| 5 | Mominpet | 240 | 81 | 259 | 143 | 723 |
| 6 | Peddemul | 162 | 137 | 263 | 8 | 570 |
| 7 | Doulthabad | 290 | 20 | 158 | 77 | 545 |
| 8 | Kodangal | 278 | 39 | 198 | 2 | 517 |
| 9 | Tandur | 343 | 22 | 87 | 1 | 453 |
| 10 | Chowdapur | 114 | 109 | 219 | 10 | 452 |
| 11 | Pudur | 141 | 73 | 67 | 68 | 349 |
| 12 | Bommaraspet | 146 | 50 | 103 | 0 | 299 |
| 13 | Dudyal | 123 | 44 | 75 | 40 | 282 |
| 14 | Nawabpet | 36 | 71 | 78 | 69 | 254 |
| 15 | Kotepally | 79 | 26 | 116 | 23 | 244 |
| 16 | Kulkacherla | 90 | 3 | 112 | 0 | 205 |
| 17 | Bantwaram | 1 | 0 | 133 | 4 | 138 |
| 18 | Basheerabad | 7 | 11 | 91 | 1 | 110 |
| 19 | Doma | 0 | 62 | 11 | 25 | 98 |
| 20 | Pargi | 1 | 0 | 14 | 12 | 27 |
| | TOTAL | 3275 | 2711 | 3233 | 793 | 10012 |



**పరిగి,ఏప్రిల్11(సూర్యరేఖ):** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా కులం,ఆదాయం ధృవీకరణ పత్రాలు తప్పనిసరి కావడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు వికారాబాద్ జిల్లాలో నిరుద్యోగులకు అవసరమే కులం ఆదాయం సర్టిఫికెట్లు పెండింగ్లో ఉండకూడదని దేశంతో వికారాబాద్ జిల్లాలో సర్టిఫికెట్లు జారీ చేయడంలో పరిగి తహశీల్దార్ కార్యాలయం జిల్లాలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని పరిగి తహశీల్దార్ ఆనంద్ రావు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ప్రభుత్వం ఇచ్చిన ఏ ఆదేశాలైన అమలు చేయుటలో పరిగి కార్యాలయం ముందుంటుందని,రైతులు ఏదైనా సమస్యపై కార్యాలయానికి వచ్చిన వారికి తక్షణమే పరిష్కారం చేసి పంపుతున్నామని ఆయన అన్నారు .

# బెల్లంపల్లి 13వ వార్డులో సీసీ డ్రెయిన్ పనులను పరిశీలించిన

ఓబిసి వైస్ ప్రెసిడెంట్ బండి ప్రభాకర్ యాదవ్



**బెల్లంపల్లి,ఏప్రిల్ 12 (సూర్యరేఖ):** బెల్లంపల్లి 13వ వార్డు కాల్ టాక్స్ ఏరియాలో సెంట్ మేరీ పాఠశాల నుండి భూమయ్య ఇంటి బ్రిడ్జి వరకు సిసి రోడ్డు,డ్రైనేజీ పనులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామితో మాట్లాడి రూ.20 లక్షలు ఓబిసి వైస్ ప్రెసిడెంట్ బండి ప్రభాకర్ యాదవ్ మంజూరు చేయించడం జరిగింది.సంబంధిత కాంట్రాక్టర్ ని పిలిచి సైట్ విజిట్ చేసి త్వరలోనే సిసి రోడ్డు,డ్రైన్ పనులు ప్రారంభించాలని బండి ప్రభాకర్ యాదవ్ కాంట్రాక్టర్ ని ఆదేశించారు.ఈ సందర్భంగా కాంట్రాక్టర్ మాట్లాడుతూ..రెండు,మూడు రోజుల్లోనే పనిని ప్రారంభిస్తారని తెలపడం జరిగింది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిఈ,ఏఈ సానిటరీ ఇన్స్పెక్టర్,కాంగ్రెస్ నాయకులు ఏంఏ సలీం,13వ వార్డు కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు..



**నిజాంపేట,ఏప్రిల్12(సూర్యరేఖ):** మండల కేంద్రంలో శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని స్థానిక హనుమాన్ దేవాలయంలో శ్రీరామ్ దళ్ యూత్ ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి జయంతి వేడుకలను ఘనంగా చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...హిందువుల ఆరాధ్య దైవమైనటువంటి హనుమాన్ జయంతిని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.గ్రామంలో భక్తి పార్వశం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని,శుక్రవారం అయ్యప్ప స్వామి జన్మదినం సందర్భంగా స్వామివారికి అభిషేక కార్యక్రమాలు చేపట్టామన్నారు.ఆ స్వామివారి కృపా కటాక్షాలతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని పాడిపంటలు సుభిక్షంగా పండాలని వేడుకున్నామన్నారు.గ్రామ ప్రజలందరికీ హనుమాన్ జయం శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీరామ్ దళ్ యూత్ సభ్యులు రంజిత్ గౌడ్,వెల్దుర్తి వెంకటేష్ గౌడ్,చెర్వి రాల చంద్రశేఖర్,వినయ్ గౌడ్, మనోహర్,స్వామి,వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్,పన్యాల వెంకట్ రెడ్డి,చంద్రకాంత్ గౌడ్,బజార్ ప్రశాంత్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.


# కాలభైరవ బుగ్గ లింగేశ్వర స్వామి
# దర్శించుకున్న గ్రామ యువకులు




**నిజాంపేట,ఏప్రిల్12(సూర్యరేఖ):** హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా రామారెడ్డి గ్రామంలో వెలసిన కాలభైరవ స్వామి,మద్దికుంట బుగ్గ రామలింగేశ్వర స్వామిని శనివారం నిజాంపేట గ్రామ యువకులు దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...హనుమాన్ జయంతి సందర్భంగా కాలభైరవ స్వామితో పాటు బుగ్గ లింగేశ్వర స్వామిని దర్శించుకోవడం జరిగిందని,ఆ స్వామివారి కృపతో గ్రామ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని వేడుకున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పన్యాల వెంకటరెడ్డి,రంజిత్ గౌడ్ వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్,వెంకటేష్ గౌడ్,వినయ్ గౌడ్,చంద్రకాంత్ గౌడ్,ఉన్నారు.

# సెలవు రోజులో సైతం రాజీవ్
# యువ వికాసం దరఖాస్తుల స్వీకరణ

అందుబాటులో మండల పరిషత్,మున్సిపల్ శాఖల అధికారులు..




**పరిగి,ఏప్రిల్ 12 (సూర్యరేఖ):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యువవ్ వికాసం పథకంలో భాగంగా ఈనెల 14వ తేదీ గడువు ముగియడంతో వరుసగా 12 రెండవ శనివారం,13 ఆదివారం,14 అంబేద్కర్ జయంతి కావడంతో వరుసగా మూడు సెలవు దినాలు కావడంతో రాజువ్ యువ వికాసం అప్లికేషన్ల స్వీకరణ నిమిత్తం మండల పరిషత్ కార్యాలయాలు పురపాలక సంఘం కార్యాలయాలు సెలవు దినాల్లో సైతం అందుబాటులో ఉండడం జరిగింది.ఇంతవరకు ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకొని వారికి సైతం మాన్యువల్ గా ఆఫ్లైన్లో దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు కల్పించింది ఇంకా ఎవరైనా నిరుద్యోగులు రాజు యువ వికాసం పథకానికి అప్లికేషన్ చేసుకొని వారు ఉంటే అప్లికేషన్ చేసుకొని సంబంధిత శాఖలో దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు.

# గర్భిణీ స్త్రీలు పిల్లల పోషణ ఆహారంపై అవగాహన



**నిజాంపేట,ఏప్రిల్12(సూర్యరేఖ):** మండల కేంద్రంలోని పల్లె దావఖానలో శనివారం గర్భిణీ స్త్రీలు పిల్లల పోషణ ఆహారంపై తల్లులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు.గర్భిణీ స్త్రీలు పోషక ఆహారము తీసుకోవాలని,చిన్నపిల్లలకు తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించామన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు బాలమణి,అనురాధ,అంగన్వాడి టీచర్లు అరుణ,రేణుక,దుర్గేశ్వరి, మణెమ్మ,ఆశా వర్కర్లుబండారి అనిత,కొమ్మాట బాలమణి,బండారి లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

# చలో వరంగల్ బీఆర్ఎస్ రజితోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయండి

ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ స్థాయి సన్నాక సమావేశం..

పార్టీ శ్రేణులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పిలుపు..

బీఆర్ఎస్ రజితోత్సవ మహాసభ పోస్టర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





**ఉప్పల్,ఏప్రిల్12(సూర్యరేఖ):** బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్ పిలుపుమేరకు చలో వరంగల్ బహిరంగ సభ విజయవంతం చేయాలని ఉప్పల్ నియోజకవర్గం స్థాయి సన్నాక సమావేశం శనివారం మల్లాపూర్ డివిజన్ వివిఎన్ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు.ఈ సమావేశానికి ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.సభను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఈనెల 27వ తేదీన చలో వరంగల్ బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు అధినేత కేసిఆర్ పిలుపుమేరకు నియోజకవర్గం నుండి పెద్ద సంఖ్యలో నాయకులు కార్యకర్తలు చలో వరంగల్ సభను విజయవంతం చేయాలని వారు దశా నిర్దేశం చేశారు. నియోజకవర్గంలోని 10 డివిజన్లో నుంచి పెద్ద ఎత్తున నాయకులు కార్యకర్తలు తరలివచ్చి సభను జయప్రదం చేయడంతో పాటు అందరి నాయకులతో కలిసి తిరిగి క్షేమంగా తిరిగి రావాలని, ఎప్పటికప్పుడు తనకు సమాచారం అందించాలని నాయకులు కార్యకర్తలకు సూచించారు. సమావేశానికి మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్ అధ్యక్షత వహించారు.ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి రాగిడి లక్ష్మారెడ్డి,చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్,నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్,మీర్పేట్ ఎస్ బికాలనీ కార్పొరేటర్ జేరిపోతుల ప్రభుదాస్,మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు శ్రీనివాస్ రెడ్డి,రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి,పసుల ప్రభాకర్ రెడ్డి,బన్నాల ప్రవీణ్ ముదిరాజ్,సాయి జన్ శేఖర్,నాయకులు డాక్టర్ బి.వి చారి,కాలేరు జై.నవీన్ పిల్లి నాగరాజు,జెట్టా కిషోర్,ఉద్యమకారులు షేర్ మణెమ్మ,మేకల ముత్యంరెడ్డి,నేర్గం భాస్కర్ గౌడ్, ఉప్పల్ నియోజకవర్గం అన్ని డివిజన్లో నుండి ఉద్యమ నాయకులు,సీనియర్ నాయకులు,డివిజన్ మాజీ అధ్యక్షులు,కంటెస్టెడ్ కార్పొరేటర్లు,డివిజన్ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు,మహిళా అధ్యక్షురాలు మహిళ నాయకురాలు, కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉప్పల్ డివిజన్ లో రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో పాల్గొన్న




ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి,పరమేశ్వర్ రెడ్డి




**ఉప్పల్,ఏప్రిల్ 12 (సూర్యరేఖ):** ఉప్పల్ డివిజన్ పరిధిలోని శాంతినగర్,న్యూ శాంతినగర్ కాలనీలో జై బాపు..జై భీమ్..జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి,ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ...బీజేపీ పార్టీ మహాత్మగాంధీ వారసత్వాన్ని,డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ని అవమానపరచడం అంటే యావత్ మన దేశాన్ని అవమానపరిచినట్లే అన్నారు. బీజేపీ పార్టీ రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ, ప్రజాసౌమ్య విలువలను కాలరాస్తూ రాజకీయ మనుగడ కోసం విద్వేషాలను రెచ్చగొడుతుందాన్నారు.డివిజన్ స్థాయి,బూత్ స్థాయి పార్టీ నాయకులు,కార్యకర్తలు జై బాపు..జై భీమ్..జై సంవిధాన్ కార్యక్రమంలో పాల్గోని విజయవంతం చెయ్యాలని కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్,లింగంపల్లి రామకృష్ణ,కోర్డినేటర్ బజారు జగన్నాథ్ గౌడ్,లూకాస్,తుమ్మల దేవిరెడ్డి,సల్ల ప్రభాకర్ రెడ్డి,సుంకు శేఖర్ రెడ్డి,అలీం,కాజా మౌలానా,సుధాకర్ పోలిశెట్టి,నవీన్ యాదవ్,గోవింద్ కుమార్,రాజేందర్ రెడ్డి,వర్కాల మదన్ గౌడ్,కడప నర్సింగ్,వెంకటేష్ సెట్,గొరిగే జంగీర్,గొరిగే మహేష్, మా శెట్టి రాఘవేంద్ర,పూజారి హనుమంతు,నాగారం వెంకటేష్,విజయ్ కుమార్,సతీష్ ముదిరాజ్,సత్తి సత్యనారాయణ,అలుగుల భాస్కర్,బాకారం అరుణ్,అనిల్ కుమార్,జనగాం రామకృష్ణ,చిట్టపు రాంరెడ్డి,తుమ్మల రాజేందర్ రెడీ,బొడిగె మల్లేష్, అన్వర్ పాషా,అఫ్జల్,వహీద్, సుబ్బారెడ్డి,భీమయ్య, వెంకటేష్,తిరుపతి,రేణుక, అనిత,మమత, ఇందిరా రాణి,విజయలక్ష్మి, అశ్విని,కవిత, కళ్యాణి,శోభ, పిరాంబి,మల్లికార్జున్,మధుసూదన్ రెడ్డి,మస్తాన్, వాజిత్,రాంరెడ్డి,సల్ల రాజిరెడ్డి,ఉప్పల్ డివిజన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు,ప్రశాంత్ రెడ్డి,బజార్ నవీన్ గౌడ్,బచ్చు రామ్,చంద్రశేఖర్ రెడ్డి,మీనంపెల్లి కిషోర్,శివాజీ,జెన్ని రవి,మహేందర్ రెడ్డి,సాయి,వంశి గౌడ్,మోహన్,తీగ గిరి ఇతర కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న
# కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎమ్మెల్యే జలీల్ పాషా




**రామంతాపూర్,ఏప్రిల్ 12 (సూర్యరేఖ):** రామంతపూర్ శ్రీనగర్ కాలనీలోని హనుమాన్ దేవాలయంలో ఘనంగా హనుమాన్ జయంతి జరిగింది.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.హనుమాన్ జయంతి కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎంఎ జలీల్ పాషా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులను హనుమాన్ జయంతి సందర్భంగా ఘనంగా సత్కరించారు.అనంతరం ఎంఏ జలీల్ పాషా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు,చెంచుల్,వినోద్,మల్లేష్ తదితరులు పాల్గొనగా,హనుమాన్ జయంతిని పురస్కరించుకొని యువజన సభ్యులు మధు, రఘు, శేఖర్,ప్రవీణ్,శీను,సురేష్, శ్రీనివాస్,కృష్ణా,బాలరాజు, సంతోష్,శివ,వినయ్,శివ,రవి,వెంకటేష్,రాఖీ తదితరులను ఎంఏ జలీల్ పాషా ఘనంగా సత్కరించారు.

# దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ జిఎమ్
# అండ్ హెచ్ ఆర్ ను కలిసిన ఉస్మాన్ పాషా



**బెల్లంపల్లి,ఏప్రిల్ 12 (సూర్యరేఖ):** తాజ్ బాబా సేవాసమితి వ్యవస్థాపకులు ఉస్మాన్ పాషా దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్,హెచ్ఆర్ ఆనంద్ కులకర్ ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.పరిశ్రమ అభివృద్ధి,కార్మికుల కష్ట సుఖాల్లో పాల్గొంటున్న ఆనంద్ కులకర్ సోషల్ మీడియా ద్వారా పరిచయమై స్వయంగా వెళ్లి ఆయనను కలవడం చాలా ఆనందంగా ఉందని ఉస్మాన్ పాషా తెలిపారు. అదేవిధంగా త్వరలోనే కంపెనీలో పనిచేసే కార్మికులకు తాజ్ బాబా సేవ సమితి ఆధ్వర్యంలో దేవాపూర్ సిమెంట్ ఫ్యాక్టరీ హెచ్ఆర్ ఆనంద్ సహాయ సహకారాలతో మెగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాజ్ బాబా సేవాసమితి సభ్యులు ఉమెర్ నవాజ్,తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పల్ మినీ శిల్పారామంలో అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన





**ఉప్పల్,ఏప్రిల్ 12 (సూర్యరేఖ):** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సాయంత్రం శ్రీ గురు నృత్యాలయం నాట్య గురువులు నల్లమోలు శ్రీలక్ష్మి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది.వినాయక కౌతం,పుష్పాంజలి, నటేశకౌతం,తరంగం,అన్నమాచార్య కీర్తనలు, కాలభైరవాష్టకం,తిల్లాన అంశాలను పుష్ప,ఆరోహి, అద్విక,హరిణి,హవ్య,జోషిత,కాశ్వీ,కుందన, మధులిక,రియా,సంహిత,సంవిక,శ్రేయ,తన్మయి మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.కళారత్న నాట్యగురువులు డాక్టర్ ఎస్పి భారతి,టీవీ ఆక్టర్ రాగిణి,వీరభద్ర రావు,లు ముఖ్య అతిధులుగా విచ్చేసి కళాకారులూ అభినందించారు.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

**శివ్వంపేట,ఏప్రిల్ 12 (సూర్యరేఖ):** పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు.మండల కేంద్రమైన శివ్వంపేటలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా నివాసంలో శనివారం 23 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు.అదేవిధంగా మండల పరిధిలోని లచ్చిరెడ్డిగూడెంలో హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమానికి హాజరై పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఫ్యాక్స్ చైర్మన్ వెంకటరామిరెడ్డి,వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, చింతల కర్ణాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ నర్సాపూర్ మండల అధ్యక్షుడు మల్లేష్,భవనగారి శ్రీనివాస్, మహేందర్,వారాల గణేష్,బిస్కుందు అంజయ్య, దావూద్,బిజిలిపురం సత్తయ్య,షేక్ అలీ,ప్రభు లింగం,శ్రీనివాస్,తదితరులు ఉన్నారు.




## హనుమాన్ ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలి..


మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ



**రాజేంద్రనగర్,ఏప్రిల్ 12:** ఆ హనుమాన్ కరుణ కటాక్షాలు ప్రజలపై ఉండి సంతోషంగా ఉండాలని మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ కురుమ అన్నారు.శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవ్ పల్లి డివిజన్ లోని పలు కాలనీలలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ఎస్.వెంకటేష్ కురుమ పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం డివిజన్ పరిధిలోని పద్మశాలిపురంలో నిర్వహించిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ కురుమ మాట్లాడుతూ...స్వామివారి జయంతి వేడుకల్లో పాల్గొని ఆశీస్సులు తీసుకోవడం జరిగిందన్నారు.ప్రతి యేడాది నిర్వహించే వేడుకల్లో పాల్గొని ఆధ్యాత్మిక సంతృప్తిని పొందినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాము యాదవ్,అక్కెం రఘు యాదవ్,అరుణ్ ముదిరాజ్,క్రాంతి,ఈశ్వర్,వెంకటేష్,పొన్న యాదయ్య,ప్రవీణ్,కే.కిరణ్,కే.జగన్,డి.అనిల్,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానంలో ఘనంగా వసంతోత్సవం,పవళింపు సేవ

పాల్గొన్న మల్కాజ్ గిరి డిసిపి పద్మజారెడ్డి



**ఉప్పల్,ఏప్రిల్12(సూర్య రేఖ):** ఉప్పల్లోని శ్రీ రామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీ సీతారామ కళ్యాణ వార్షిక రథోత్సవ బ్రహ్మోత్సవాలలో భాగంగా సీతారామచంద్ర స్వామి వారి చక్రతీర్థం,వసంతోత్సవం,పవళింపు సేవ(ఊంజల్ సేవ) కార్యక్రమాలు శనివారం సాయంత్రం ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో డీసీపీ పద్మజ రెడ్డి పాల్గొన్నారు.ఆలయ వ్యవస్థాపక అనువంశిక ధర్మకర్తలు మోత్కూరి రాఘవదాసు,మోత్కూరి కృష్ణ శర్మ(దేవి ప్రసన్న శర్మ),ఎంవి శర్మ,అక్షయ్ శర్మ(దివంగత రాంమోహన్ శర్మ కుమారుడు) నిర్వహించారు.పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



**మందమర్రి,ఏప్రిల్12(సూర్య రేఖ):** మందమర్రి పట్టణంలోని శ్రీశ్రీశ్రీ భక్త ఆంజనేయ దేవాలయంలో,పంచముఖి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం పూజలతో పాటు పంచకుండాత్మక హనుమత్ కవచవనం,అభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు.పాలచెట్టు ఏరియాలోని పంచముఖి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణకాంతచార్యులు,మార్కెట్ ప్రాంతంలోని శ్రీశ్రీశ్రీ భక్త ఆంజనేయ దేవాలయంలో ఆలయ అర్చకులు సోనాల్ శర్మల ఆధ్వర్యంలో స్వామి వారికి పూజలు జరిగాయి.ఈ సందర్భంగా ఉదయం నుంచి భక్తులు,హనుమాన్ దీక్షా స్వాములు ఆలయాలకు చేరుకొని స్వామిని దర్శించుకోవడంతో ఆలయాలు జైశ్రీరామ్ నినాదాలతో మార్మోగాయి.ఈ సందర్భంగా పట్టణ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు,ప్రముఖ వ్యాపారి బండారు సూరిబాబు,జయరాణి దంపతుల ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ భక్త ఆంజనేయ దేవాలయంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్షా స్వాములు,భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## డ్రగ్స్ నిర్మూలలో బాగంగా అవగాహన పోస్టర్ ఆవిష్కరణ

డ్రగ్స్ నిర్మూల అందరి సామాజిక బాధ్యత

జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి




**మెదక్,ఏప్రిల్12(సూర్య రేఖ):** డ్రగ్స్ నిర్మూళనకు పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా పని చేస్తుందని మెదక్ జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు.మెదక్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో శనివారం డ్రగ్స్ నిర్మూళనలో భాగంగా అవగాహన పోస్టర్ ను ఆవిష్కరణ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ..డ్రగ్స్ వల్ల సమాజంలో యువ శక్తి విచ్ఛిన్నం అవుతుందన్నారు.డ్రగ్స్ మత్తులో దాడులు,నేరాలు పెరుగుతున్నాయన్నారు.పోలీసు శాఖ డ్రగ్స్ నిర్మూళనలో పని చేస్తుందని,పౌరులు,ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు.యువత,విద్యార్థులు దేశ సంపద,దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్నది కావున విద్యార్థుల్లో,యువతలో మార్పు రావాలి,డ్రగ్స్ నిర్మూలన కోసం బాధ్యతగా ఉండాలని కోరారు.డ్రగ్స్ వినియోగం వల్ల శరీరంలో శక్తి తగ్గుతుందని,మంచి భవిష్యత్తును కోల్పోతారని అన్నారు.సమాజంలో చెడ్డపేరు వస్తుందని అన్నారు.గంజాయి,కొకైన్,హెరాయిన్ లాంటి మాదకద్రవ్యాల వల్ల అన్ని కోల్పోతారన్నారు.ఇది మన దేశ యువ శక్తిని నిర్వీర్యం చేస్తుందన్నారు.డ్రగ్స్ వినియోగం,రవాణా,సరఫరా చేయడం తీవ్రమైన నేరమన్నారు.డ్రగ్స్ కు అలవాటు పడిన వారి గురించి సమాచారం ఇవ్వండి,వీరికి కౌన్సిలింగ్ ఇస్తాము,వీరిలో మార్పునకు కృషి చేస్తామని అన్నారు.మన సమాజంలో డ్రగ్స్ లేకుండా నిర్మూలించడం మన అందరి బాధ్యత అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్,మెదక్ రూరల్ సిఐ రాజశేఖర్ రెడ్డి,పాపన్నపేట్ ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కబ్జా చేసి చెట్లను నరికిన ఏడుగురి అరెస్ట్




**బెల్లంపల్లి,ఏప్రిల్12(సూర్య రేఖ):** ప్రభుత్వ భూమిని కబ్జా చేసి చెట్లను నరికిన ఏడుగురిని ఎస్సై గంగారం అరెస్ట్ చేశారు.వివరాల ప్రకారం..కన్నెపల్లి తహశీల్దార్ ఫిర్యాదు మేరకు రెబ్బల గ్రామ శివారు సర్వే నంబర్ 248 లో గల ప్రభుత్వ భూమిని ఏడుగురు వ్యక్తులు అక్రమంగా,ఎలాంటి అనుమతులు లేకుండా ప్రవేశించి ఆ భూమిలోని చెట్లను నరికి వేశారు.ఈ మేరకు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ మేరకు ఏడుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై గంగారం తెలిపారు.ఏడుగురు నేరస్తులను పట్టుకొని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు వారు ఈ సందర్భంగా వివరించారు.

# గంజాయి మొక్కలను పెంచుతున్న వ్యక్తి అరెస్టు




**మందమర్రి,ఏప్రిల్12(సూర్య రేఖ):** ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు పెంచుతున్న ఓ వ్యక్తిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై శివనీతి రాజశేఖర్ తెలిపారు.రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా,మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ ఉత్తర్వుల మేరకు బెల్లంపల్లి ఏసిపి రవికుమార్,మందమర్రి సిఐ శశిధర్ రెడ్డి ఆదేశాలతో శనివారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని దీపక్ నగర్ లోని ఒక ఇంట్లో గంజాయి మొక్కలను పెంచుతున్న యువకుడిని పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు.పట్టణం దీపక్ నగర్ కు చెందిన ఓ మైనర్ యువకుడు తన ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలను పెంచుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసు సిబ్బందితో కలిసి ఇంటి వెనుకాల తనిఖీ చేయగా 12 గంజాయి మొక్కలు లభ్యమయ్యాయని,ఆ మొక్కలను పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకొని ఆ బాలుడిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.మందమర్రి సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడైనా,ఎవరైనా గంజాయి అమ్మకం జరిపినా,గంజాయి మొక్కలు సాగు చేసినా,సేవించినట్లు తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని,సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతర పర్యవేక్షిస్తూ వారి కదలికలను చెడు అలవాట్లు గుర్తించాలని సందర్భంగా ఎస్సై కోరారు.అలాగే గంజాయి సేవించే వారిపై,గంజాయి పెంచే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమాచార సేకరణలో చురుకుగా వ్యవహరించిన పోలీస్ సిబ్బందిని బెల్లంపల్లి ఏసిపి రవికుమార్ అభినందించి రివార్డు అందజేశారు.



# కనుల పండుగ గరుడసేవ కార్యక్రమం

**శివంపేట,మార్చి12(సూర్య రేఖ):** శివంపేట మండల కేంద్రంలో కోదండరామ స్వామి ఆలయంలో గరుడ సేవా కార్యక్రమాన్ని గ్రామ పురోహితులు శాస్త్రుల వామనసేవ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.గరుడసేవను గ్రామంలోని వీధుల గుండా ఊరేగిస్తూ మహిళలు మంగళహారతులు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామంలోని నాయకులు,గ్రామ పెద్దలు,యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పేద,మధ్య తరగతి ప్రజలకు వరంగా మారిన సీఎంఆర్ఎఫ్ ప్రభుత్వ పథకం



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,ఏప్రిల్12(సూర్య రేఖ):** పేద ప్రజల కోసం పేద,మధ్య తరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ లు వరమని జన్నారం మండలం రాంపూర్ గ్రామ గ్రామ మాజీ సర్పంచులు పద్మారావు,రామయ్యలు అన్నారు.గ్రామానికి చెందిన కొంద్ర కుమారికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరైన రూ.34 వేల చెక్కును ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు అందించారు.అనంతరం గ్రామ మాజీ సర్పంచులు పద్మారావు,రామయ్య మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యతరగతి కుటుంబానికి చెందిన సీఎం ఆర్య పథకం కింద లబ్ధిదారులకు సరైన సమయంలో ఆర్థిక సహాయం అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు మొదటి స్థానంలో ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంధ్య వేణి,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూధర్మ పరిరక్షణ కోసం కృషి చేయాలి..

హనుమాన్ కరుణా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి..

రాజేంద్రనగర్ బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి





**రాజేంద్రనగర్,ఏప్రిల్12:** అయోధ్య శ్రీరాముల వారి ఆశీస్సులతో భవిష్యత్తులో బలమైన రామరాజ్య స్థాపన ఏర్పాటు కావాలని నియోజకవర్గం బీజేపీ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మైలార్ దేవ్ పల్లి డివిజన్ ఆరాంఘర్,కాటేదాన్,బంజారాకాలనీ పలు కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.హెూమం,పూజా కార్యక్రమాలలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.స్వామివారి పూజల అనంతరం తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్క హిందువు తమ వంతు కృషి చేయాలని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలు హనుమాన్ ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.నియోజకవర్గంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు.వాడవాడలా ఓ ఉత్సవంలా హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించుకోవడం ఆనందాన్ని ఇస్తుందన్నారు.స్వామివారి కరుణ కటాక్షాలు అందరిపై ఉండాలని కోరుకున్నట్లు వివరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు చెన్ రెడ్డి బుచ్చిరెడ్డి,లిక్కి వెంకటేశ్వర్ రెడ్డి,శంకర్ నాయక్,బిత్యా నాయక్,జొన్న నాయక్,కృష్ణ రెడ్డి,ఆర్.భూపతిరెడ్డి,సుభాష్,శ్రీనివాస్,శంకర్ రెడ్డి,మధు,స్థానిక యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాణానికి రక్షణగా నిలిచిన రక్షకభటులను సన్మానించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**శివంపేట,మార్చి12(సూర్య రేఖ):** శివంపేట మండలం దేవమ్మగూడెం తాండకు చెందిన లుంసావత్ రాజు ఆత్మహత్యకు ప్రయత్నించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న సమయంలో సిపిఆర్ చేసి ప్రాణాపాయం నుంచి రక్షించిన శివంపేట పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ మహేందర్,విష్ణువర్ధన్ లను మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతల కరుణాకర్ రెడ్డి,పులిమామిడి నవీన్ గుప్తాలు అభినందించి శాలువాతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో శివంపేట సబ్ ఇన్స్పెక్టర్ మధుకర్ రెడ్డి,ఏఎస్సై శ్రీనివాస్,కాంగ్రెస్ పార్టీ నాయకులు వారాల గణేష్,మాజీ కోఆప్షన్ నెంబర్ దావూద్,కమలయ్య గారి వెంకటేష్,ప్రభు లింగం గౌడ్,షేక్ అలీ,ఇసుగారి అరుణ్ కుమార్,ఈసారపు రాజు గౌడ్,సరిగారి హరికృష్ణ,కమలయ్య గారి సురేష్,వర్రీ మహేష్ యాదవ్,మహమ్మద్ షబ్బీర్ పాషా,జీడిపల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కెప్టెన్ రాజారెడ్డి ఉద్యానవనం 10 వ వార్షికోత్సవం

మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్,హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్






**హబ్సిగూడ,ఏప్రిల్ 12(సూర్యరేఖ):** హబ్సిగూడ డివిజన్ రవీంద్రనగర్ లోని కెప్టెన్ రాజారెడ్డి ఉద్యానవనం 10 వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్,హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేని చేతన హరీష్, ఉప్పల్ మాజీ శాసనసభ్యులు బేతి సుభాష్ రెడ్డి,కెప్టెన్ కల్నల్,రఘుప్రసాద్,లు హాజరయ్యారు.ఈ వార్షికోత్సవం సందర్భంగా నిర్వాహకులు ఏర్పాటు చేసిన పలు ఆటల పోటీలలో విజయం సాధించిన వారికి బహుమతులు ప్రధానం చేశారు.అనంతరం ఉద్యానవనం అభివృద్ధికి తగిన సహా సహకార అందిస్తామని ఎంపీ ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. ఉద్యానవనాన్ని చాలా చక్కగా నిర్వహిస్తున్న నిర్వాహకులు ప్రత్యేక శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవనం అధ్యక్షులు రుద్రశేఖర్,ప్రధాన కార్యదర్శి అన్నెం రాఘవరెడ్డి,జైపాల్ రెడ్డి,పార్క్ కార్యవర్గ సభ్యులు బిజెపి నాయకులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాబు జగ్జీవన్ రామ్,అంబేడ్కర్,ల స్ఫూర్తి ఆదర్శనీయం

మణికొండ మున్సిపాలిటీ నాయకులు కస్తూరి నరేందర్,నరేందర్ రెడ్డిలు




**మణికొండ,ఏప్రిల్12:** డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్,డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ల స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శమని మణికొండ మున్సిపాలిటీ నాయకులు కస్తూరి నరేందర్,నరేందర్ రెడ్డి,లు అన్నారు.శనివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శివాజీనగర్ కాలనీలోని అంబేద్కర్ భవనం వద్ద కోడిచెర్ల భారతమ్మ రాములుల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు కోడిచెర్ల నరేందర్,దేవేందర్,అఖిల్,నిఖిల్,దేవాంశ్,ల ఆధ్వర్యంలో స్థానిక కమిటీ అధ్యక్షుడు రమేష్,సభ్యుల నేతృత్వంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్,డాక్టర్ బాబు జాగ్జీవన్ రామ్,ల విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ. ..అంబేడ్కర్,జగ్జీవన్‌రామ్,లు బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని శ్రమ చేశారని గుర్తు చేశారు.అలాంటి మహనీయులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సీతారం ధూళిపాళ,యాలాల నరేష్,సంగం కిరణ్,పురుషోత్తం,లక్ష్మి నారాయణ,ముత్యాలు, రవీందర్ రెడ్డి,తాజ్,గుట్టమీది నరేందర్,అందె లక్ష్మణ్ రావు,ఏర్పుల శ్రీకాంత్,యాలాల కిరణ్,కీర్తిలత గౌడ్,జై రామ్,సుమనళిని,బొడ్డు శ్రీధర్,బీరప్ప, రాఘవ రెడ్డి,ప్రభావతి,తదితరులు పాల్గొన్నారు.

## ధర్మానికి,ఐక్యతకు ప్రతీక హనుమాన్ శోభాయాత్ర

ఘనంగా హనుమాన్ జయంతి..

శోభాయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..






**శంషాబాద్,ఏప్రిల్12:** హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొని విజయోత్సవ ర్యాలీలో తాను భాగస్వామి అయినందుకు సంతోషంగా ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు.శనివారం హనుమాన్ జయంతి వేడుకలను పురస్కరించుకొని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని జెండా చౌరస్తాలో హనుమాన్ దేవాలయం వద్ద హనుమాన్ విజయోత్సవ ర్యాలీని ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు.అంజన్న నామస్మరణతో శంషాబాద్ మార్మోగింది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఆరాధన సేవకు నిలువెత్తు సాక్ష్యం హనుమంతుడు అని కొనియాడారు.సకల పీడలను తొలగించే ఆ అభయాంజనేయుడు సమస్త భూ ప్రపంచానికి ఎదురైన విపత్తును పాలద్రోలాలని ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.ధర్మానికి,ఐక్యతకు ప్రతీక హనుమాన్ శోభాయాత్ర అని తెలిపారు.హనుమంతుడి ధైర్యం, వీరత్వం,మానవత్వం,బలం,జ్ఞానం,భక్తి వంటి లక్షణాలు నేటి యువతరానికి ఆదర్శనీయం అన్నారు.నేటి యువత హనుమంతుడి లక్ష్యంతో ధర్మాన్ని కాపాడాలని ఎమ్మెల్యే సూచించారు. నియోజకవర్గం ప్రజలకు ఎలాంటి సమస్యను అయినా ఎదుర్కొనే మానసిక ధైర్యాన్ని ఇవ్వాలని కోరుకున్నట్లు తెలిపారు.అనంతరం రాష్ట్ర ప్రజలందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు.శోభయాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,యువకులు,పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నల్లంపల్లి గ్రామంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు




**అందోల్,ఏప్రిల్12(సూర్య రేఖ):** సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గం రాయికోడ్ మండలం నల్లంపల్లి గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.అందులో భాగంగా వైభవోపేతంగా హనుమాన్ శోభయాత్రను నిర్వహించారు.కులామతాలకు అతీతంగా భారీ సంఖ్యలో ప్రజలు,యువకులు పాల్గొని జై శ్రీరామ్ జైజై శ్రీరామ్ అంటూ నినాదాలతో ఘనంగా పండగ నిర్వహించారు.అనంతరం చిన్న బగిలి బస్వరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హనుమాన్ జయంతి సందర్భంగా తనకు ఈ అన్నదానం చేసే అవకాశం ఆ దేవుడు కల్పించినందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో చిన్న బగిలి బస్వరాజ్ పాటిల్,సొసైటీ చైర్మన్ బగిలి నాగిశెట్టి పాటిల్,ఉమ్మడి మెదక్ జిల్లా డిసియంయస్ మాజీ చైర్మన్ సిద్దప్ప పాటిల్,పట్లోలా సుదర్శన్ రెడ్డి,పట్లోలా అంజిరెడ్డి,తాజా మాజీ ఉపసర్పంచ్ కృష్ణ,బగిలి జగదీశ్వర్ పటిల్,గొల్ల బసంతి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు కల్గోండ,బర్దిపురం మాణిక్యం,కృష్ణ,విట్టల్,రవి బోయిని శ్రీను,రాజు,మనయ్య,గొల్ల శేఖర్,హనుమాన్ యూత్ గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

### పేదల భూములకు రక్షణ కరువు అనే శీర్షికతో వచ్చిన వార్తకు స్పందన




**అందోల్,ఏప్రిల్12(సూర్య రేఖ):** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం ఇటికెపల్లి శివారులో సర్వే నెంబర్ 130 లో గల సీలింగ్ పట్టా భూమి పట్టాదారుకు జర్నలిస్టు శేఖర్ వివరణ కోరగా నేను అమ్ముకోలేదు,మా తాత ఆస్తి మ నాన్న పేరు పైన చేయించుకున్నాం,ఉన్న 23 గుంటల భూమిలో సగభాగం రోడ్డులో పోయినందువల్ల అక్కడ పక్కన వున్నా రైతు కిష్టారెడ్డికి వాటర్ సదుపాయం ఉన్నందువల్ల మేము అతని కలిసి బర్ల డైరీ ఫామ్ వేసుకొని జీవనం కొనసాగిస్తున్నామని బదులిచ్చాడు.మాకు మేము భూమి అమ్మలేదు మా నాన్న ఆరోగ్యం బాగా లేనపుడు కొన్ని డబ్బులు తీసుకొని వున్న ఒకే ఒక ఆస్తి అదే భూమి కాబట్టి దానిని మా కుటుంబ సభ్యులమందరం అంగీకారంతో బాండ్ పేపర్ పై రాసుకొని లీజు కింద ఇద్దరం కలిసి ఒకరినొకరు స్నేహపూర్వకంగా డైరీ ఫామ్ నిర్వహించుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామన్నారు.ఇందులో ఎలాంటి సందేహం లేదని,అతని ఆరోజు మా నాన్నకు సహాయం చేయడం వల్ల మా తండ్రి ఇప్పటివరకు మాకు ప్రాణలతో మిగిలి ఉన్నాడని తెలిపారు.అతను చేసిన మేలు మా కుటుంబం ఎప్పుడు కూడా రుణపడి ఉంటామని సీలింగ్ పట్టాదారైనా భోజయ్య తెలిపారు.కావున నాకు ఉన్న భూమి అదే ఆధారం కాబట్టి మేము లీజు లెక్కన ఒప్పందం కుదుర్చుకొని ఇద్దరం కలిసి మెలిసి షెడ్డు నిర్మించుకొని అతని వాటర్ ద్వారా మేము షెడ్డు నిర్మించుకొని అతని మాకు రోడ్డు ఇవ్వడం జరిగిందన్నారు.డైరీ ఫామ్ పై వచ్చే ఆదాయం ద్వారా మేము జీవనం సాగిస్తున్నామని ముక్తకంఠంగా పట్టాదారు తెలిపారు.

## రమాయణం %-% కోతి మూక



మా బడిలో ఓ కోతి మూక ఉండేది. టీచర్లంటే భయం ఉన్నా.. వాళ్లనుకూడా అప్పుడప్పుడూ ఆట పట్టించేది. అలా.. మా లడ్డు సారును కుర్చీలో ఇరుక్కునేలా చేశారు. దూర్వాసుడనే పేరున్న సింహాచారి సారును కూడా ఇలాగే ఇబ్బంది పెట్టారు. సింహాచారి సారు ధోతి కట్టుకునేవాడు. సన్నగా, పొడుగ్గా పొగచూరిన కర్రకు బట్టలు తొడిగినట్టు ఉండేవాడు. మా ఎనిమిదో తరగతి గది ఓ పెద్ద పొడవాటి గుడిసె. దాంట్లో ఒకపక్క ఎయిత్ ఏ, మరోపక్కన ఎయిత్ బీ క్లాసులు ఉండేవి. మధ్యలో అబ్బాయిలు సైకిల్స్ పెట్టేవాళ్లు. సింహాచారి సారు పాఠం చదువుతూ పోయేవాడు తప్ప అర్థమయ్యేలా, సొగసుగా తెలుగు పాఠం చెప్పడం ఆయనకు వచ్చేది కాదు. ముఖ్యంగా పద్యభాగం బోధించేటప్పుడు పద్యం రాగయుక్తంగా కాకుండా గడగడా చదివి ప్రతిపదార్థం చెప్పి.. "ఆఁ.. ఇగ చదువుకోండి" అనేవాడు. తొమ్మిది, పదో తరగతుల వారికి నరసింహమూర్తి సారు రసరమ్యంగా పద్యాలు పాడుతూ, కథలు చెబుతూ ఎంతో ఆసక్తిగా పాఠం చెబితే.. ఈయనేమో తెలుగు భాషంటేనే ఉత్సాహం పోయేలా చెప్పేవాడు. ఓరోజు సింహాచారి సారు మా క్లాసుకు వచ్చాడు. "ఆఁ.. పుస్తకాలు తియ్యండి" అంటూనే కుర్చీలో కూర్చున్నాడు. అంతే.. దభాల్న వెనక్కు పడిపోయాడు. "అయ్యో.. సారు పడ్డడు" అంటూ ఒకల్లిద్దరు మగపిల్లలు పరిగెత్తి లేవదీశారు. ఆయన దిగ్భ్రాంతి నుండి తేరుకుని విపరీతమైన కోపంతో ఊగిపోయాడు. ముక్కుపుటాలు అదురుతున్నాయి. "ఎవడ్ర వాడు?! తన్నేను గాడిదను! బయిటికి రా!" అని అరిచాడు.. బుస్సుబుస్సుమని గాలి వదులుతూ. అంతా నిశ్శబ్దం.. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. కుర్చీకి మూడే కాళ్లున్నాయి. నాలుగో కాలుండే చోట పైకి తెలియకుండా ఉండేలా టెంపరరీగా ఓ వెదురు కర్ర ఆనించినట్టు ఉన్నారు. ఆయన కూచోగానే కుర్చీ బ్యాలెన్స్ లేక పడిపోయింది. "సరే! మీకందరికీ తెలుసు గానీ చెప్పరు గద! మంచిది.. నేనే తెలుసుకుంట! ఎవ్వరు జేసిన్రో తెలుసుకొని, వాణ్ని ప్రేయర్ల అందరు జూడంగ తన్నియ్యకుంటే జూడండి! నేను మాటంటె మాటే!" అన్నాడు. అయినా.. ఒక్కలు కూడా లేచి నిలబడలేదు. ! ఎవ్వడో తెలిసి వాణికి శిక్ష పడేదాకా నేను మీ క్లాసుకు రాను. మీకు పాఠం చెప్పను" అని పంచభూతాల సాక్షిగా భీషణ ప్రతిజ్ఞ చేశాడు. ఆ తరువాత విసవిసా నడుచుకుంటూ వెళ్లిపోయాడు. సరాసరి హెడ్‌మాస్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఆయన మాటలు మాకేమీ షాక్ కలిగించలేదు. మామూలుగానే విన్నాం. 'ఇస్కా అంజామ్ దేఖ్‌తే రహెూ' అన్నా కూడా.. మాకు భయం కలుగలేదు. వెనుకనుంచి ఓ అబ్బాయి మాత్రం.. "ఆఁ.. మంచిగయింది. ఇగ ఈయినె మన క్లాసుకు రాకుంటె మనకే మంచిది" అన్నాడు గట్టిగా. అందరం నవ్వాం. కానీ, ఐదు నిమిషాల్లో నాకు హెడ్‌మాస్టర్ నుండి పిలుపు వచ్చింది. వెళ్లాను. హెచ్‌ఎం సార్, వరదా రెడ్డి సారు, ఇంకా బుసలు కొడుతూనే సింహాచారి సారూ ఉన్నారు. "రమా! నువ్వు నిజం చెప్తవ్! నీకు అబద్ధమాడుడు రాదు. కుర్చీ కర్ర ఇరగ్గొట్టి ఎదటి పుల్ల ఆనిచ్చి పెట్టింది ఎవరమ్మా?!" అని నిజనిర్ధారణ కమిటీ తరఫున వరదారెడ్డి సారు అడిగాడు. నేను సత్య హరిశ్చంద్రుడి చెల్లెల్ని మరి! "నాకు తెల్వదు సార్! కుర్చీ అట్లనే ఉన్నదనుకున్న! అసల్కు ఎవరైనా కుర్చీ కాలెట్ల తీస్తరు సార్?!" అని అడిగాను. సింహాచారి సారు మరొక్కసారి బుస్సుమన్నాడు. నన్ను రెండుమూడు సార్లు అడిగి.. నాకు తెలియదన్నాక.. "ఈ అమ్మాయికి తెల్వదు సార్! తను చూస్తె చెప్పేదే! అయినా ఏదో కోతి పోరగాళ్లు! ఒదిలి పెట్టండి సార్! నేను ఆ క్లాసుకు పొయ్యి మగ పోరగాండ్లనందర్ని ఇయ్యర మయ్యర జోపుత.. సరేనా! ఇగ నువ్వు పోమ్మా!" అన్నాడు వరదారెడ్డి సారు. "నేను ఒదుల సార్! వాడెవ్వడో తెలువాలె! అంతదనుక నేను వాండ్ల క్లాసుకు పోను" అన్నాడు భీష్మప్రతిజ్ఞ చేసినాయన. "రమా! నువ్వు నిజం చెప్తవ్! నీకు అబద్ధమాడుడు రాదు. కుర్చీ కర్ర ఇరగ్గొట్టి ఎదటి పుల్ల ఆనిచ్చి పెట్టింది ఎవరమ్మా?!" "ఈ అమ్మాయికి తెల్వదు సార్! తను చూస్తె చెప్పేదే! అయినా ఏదో కోతి పోరగాళ్లు! ఒదిలి పెట్టండి సార్! నేను ఆ క్లాసుకు పొయ్యి మగ పోరగాండ్లనందర్ని ఇయ్యర మయ్యర జోపుత.. సరేనా! ఇగ నువ్వు పోమ్మా!" మొత్తానికి నెల రోజులపాటు మాకు నరసింహమూర్తి సారు వచ్చి వినసొంపుగా పాఠాలు చెప్పాడు. ఇక సింహాచారి సారు రాడని నిర్ధారించుకున్నాక మా ఆనందం ఎక్కువకాలం ఉంచకుండా.. ఏం నచ్చచెప్పారో ఏమో, మళ్లీ మా క్లాసుకు వచ్చాడు. పిల్లలందరూ ఉసూరుమన్నారు. అయితే.. అప్పటికీ, ఇప్పటికీ ఆ కుర్చీ కాలు విరగ్గొట్టిన శూరుడెవరో ఎవరికీ తెలియలేదు.

## రోజుకు గుప్పెడు కాలిఫోర్నియా బాదం పప్పులు.. మెరుగైన ఆరోగ్యం కోసం సహజమైన విధానం



కాలిఫోర్నియాలోని బాదం పప్పు బోర్డు నేడు వివాంటా హెూటల్లో 'రోజుకు ఒక గుప్పెడు బాదం పప్పులు: నేటి వేగవంతమైన జీవనశైలిలో ఆరోగ్యానికి తోడ్పడటానికి సహజ విధానం' అనే శీర్షికతో విశిష్ట పరిజ్ఞానంతో కూడిన సెషన్‌ను నిర్వహించింది. ఈ సెషన్‌లో న్యూట్రిషన్ అండ్ వెల్నెస్ కన్సల్టెంట, శీలా కృష్ణ స్వామి, ప్రముఖ భారతీయ మోడల్, అందాల పోటీ టైటిల్ విజేత, వ్యవస్థాపకురాలు ప్రజ్ఞా అయ్యగారి సహా ప్యానెలిస్టులు పాల్గొన్నారు. వారు ఆహార సమతుల్య ఆహారం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. భారతదేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన కాలిఫోర్నియా బాదం పప్పులను రోజువారీ ఆహారంలో చేర్చడం, నేటి వేగవంతమైన జీవితంలో మొత్తం ఆరోగ్యానికి ఎలా తోడ్పడుతుందో ప్యానెలిస్టులు వెల్లడించారు. ఈ సెషన్‌కు ఆర్ జె సౌజన్య సంధానకర్త గా వ్యవహరించారు. నేటి వేగవంతమైన ప్రపంచంలో సమతుల్య, ఆరోగ్యకరమైన జీవనశైలిని సాధించడం చాలా కష్టంగా మారింది. దీనివల్ల మధుమేహం, గుండె జబ్బులు, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయని తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (%ఔనూ%) అంచనా ప్రకారం ఈ జీవనశైలి వ్యాధులు భారతదేశంలో ఏటా ఆరు మిలియన్ల మంది ప్రాణాలను బలిగొంటున్నాయి. దీర్ఘకాలిక అనారోగ్యాలు 2030 నాటికి దేశానికి %వి%6 ట్రిలియన్ల నష్టం కలిగిస్తాయని అంచనా వేశారు. ఈ ఆరోగ్య సంక్షోభానికి పౌష్టికాహారం తీసుకోవడమేనని ప్రధాన కారణమని తెలిపారు. డ్రై ఫ్రూట్స్‌లో రారాజు అయిన కాలిఫోర్నియా బాదంలు ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, కాల్షియం, డైటరీ ఫైబర్, జింక్ వంటి 15 ముఖ్యమైన పోషకాలతో సమృద్ధిగా ఉన్నాయని, రక్తంలో చక్కెర నియంత్రణ, బరువు నిర్వహణ, రోగనిరోధక శక్తిని పెంచడం, చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడం వంటి అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయని వెల్లడించారు. అదనంగా అత్యంత కష్టతరమైన తన షెడ్యూల్‌ను నిర్వహించడానికి ప్రజ్ఞా తాను అనుసరించే విధానాన్ని పంచుకున్నారు. పోషకాలు అధికంగా ఉండే బాదం వంటి ఆహారాలకు ప్రాధాన్యత ఇవ్వడం, భోజన ప్రణాళిక, క్రమం తప్పకుండా యోగా, వ్యాయామం, ధ్యానం వంటివి చేస్తానని వెల్లడించారు. కాలిఫోర్నియాలోని ఆల్మండ్ బోర్డ్‌తో కలిసి ఇటీవల నిర్వహించిన యు గవ్ సర్వేను కూడా ఈ చర్చలో ప్రస్తావించారు, భారతదేశంలోని అగ్రగామి 5 శాఖాహార ప్రోటీన్ వనరులలో బాదం స్థానం పొందిందని వెల్లడించింది. ఈ సర్వే ప్రకారం అన్ని ప్రాంతాలలో 10 మందిలో 6 గురు కంటే ఎక్కువ మంది బాదంను అధిక ప్రోటీన్ వనరుగా గుర్తిస్తున్నారు. అలాగే 10 మందిలో 8 మంది తాము ప్రతిరోజూ బాదంను తీసుకుంటామని చెప్పారు, ఇది భారతదేశంలో పోషకమైన చిరుతిండిగా ప్రజాదరణను బలోపేతం వెల్లడిస్తుంది. న్యూట్రిషన్ వెల్నెస్ కన్సల్టెంట్ శీలా కృష్ణస్వామి మాట్లాడుతూ "మన బిజీ జీవనశైలి తరచుగా అనారోగ్యకరమైన ఆహార ఎంపికలకు దారితీస్తుంది. చిన్న మార్పులు పెద్ద తేడాను కలిగిస్తాయని నేను నమ్ముతున్నాను. అల్ట్రా-ప్రాసెస్డ్ స్నాక్స్ కు బదులుగా బాదం వంటి సహజ ఎంపికలను చేసుకోవటం వంటివి దీనిలో ఉన్నాయని తెలిపారు. ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్‌తో సహా 15 ముఖ్యమైన పోషకాలతో నిండిన బాదం మీరు సంతృప్తి చెందడానికి, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి , గుండె ఆరోగ్యం, రక్తంలో చక్కెర నిర్వహణ , మెరుగైన చర్మానికి మద్దతు ఇస్తుందని పేర్కొన్నారు. వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితంలో బహుళ బాధ్యతలను నిర్వహించేటప్పుడు వీటిని తీసుకుంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో శక్తివంతమైన మిత్రులుగా మారతాయి" అని అన్నారు. భారతీయ మోడల్, అందాల పోటీ టైటిల్ విజేత మరియు వ్యవస్థాపకురాలు, ప్రజ్ఞ అయ్యగారి మాట్లాడుతూ "మోడలింగ్ పరిశ్రమలో ఉండటం వల్ల, ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించడానికి ప్రయత్నిస్తూనే నేను తరచుగా షూట్‌లలో పాల్గొంటుంటాను. నా బిజీ షెడ్యూల్‌కు సరిపోయే పోషకమైన, సహజమైన , అనుకూలమైన స్నాక్స్ కోసం నేను ఎల్లప్పుడూ వెతుకుతుంటాను. బాదం పప్పులు చిన్నప్పటి నుండి నాకు ఇష్టమైనవని తెలిపారు. అవి ఎక్కువసేపు కడుపు నిండుగా ఉందనే భావన కలిగిస్తాయి. అనారోగ్యకరమైన చిరుతిండిని నివారించడానికి నాకు సహాయపడతాయి. నా దినచర్యలో బాదం పప్పును చేర్చుకోవడం వల్ల నా చర్మంతో సహా నా మొత్తం ఆరోగ్యంలో స్పష్టమైన తేడా వచ్చిందన్నారు. నేను వాటిని వాటి సహజ రూపంలో తినడానికి ఇష్టపడతాను. నేను ఎక్కడికి వెళ్లినా ఎల్లప్పుడూ నాతో ఒక పెట్టెను తీసుకెళ్లడం మాత్రం మరువను " అని అన్నారు. మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి బాదం వంటి పోషకాలు అధికంగా ఉండే ఆహారాన్ని రోజువారీ దినచర్యలలో చేర్చడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. నేటి వేగవంతమైన ప్రపంచంలో ఆరోగ్యకరమైన జీవనానికి బాదం ఎంతో ఉపయోగడుతుందని ప్యానెలిస్టులు తెలిపారు.

# అంతగా ఆశించడం కూడా అత్యాశే!



రాష్ట్రంలో ఇటీవల జరుగుతున్న కొన్ని ఘటనలను చూస్తుంటే మహాకవి వేమన శతకంలోని 'అల్పుడెపుడు పల్కు నాడంబరముగాను..' అనే పద్యం పదే పదే గుర్తుకువస్తున్నది. అటు అల్పుడు ఇటు శాంతమూర్తి బుద్ధిని పోల్చిన తీరును బేరీజు వేసుకోవాలి. ఇదే పద్యంలో 'కంచుమ్రోగునట్లు కనకంబు' అనే వ్యాఖ్యానాలను కూడా గుర్తుచేసుకోవాలి. కంచు శబ్దం చేసినట్టుగా, బంగారం శబ్దం చేయదు! అలాగే అల్పబుద్ధి కలిగినవాడిని కంచుతోనూ, శాంతమూర్తిని బంగారంతో పోల్చాడు వేమన. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అల్పబుద్ధి కలిగినవాడు కాబట్టే ఎప్పుడూ.. దాంబికాలు పోతూ, ఆడంబరంగా, తుపాకీ రాముడి వలె మాటలు చెప్తుంటడు. శాంతమూర్తి అయిన కేసీఆర్ ఎల్లప్పుడూ శాంతంగా ఉంటాడు. ఓటుకు నోటు కేసు లో నిందితుడైన రేవంత్‌ను, ఒంటి చేత్తో రాష్ట్రాన్ని సాధించి తెచ్చుకొని తెలంగాణను అన్నిరంగాల్లో నంబర్ వన్‌గా నిలిపిన కేసీఆర్‌తో పోల్చడమే సరికాదు. సీఎం రేవంత్ వ్యవహారశైలిపై కాంగ్రెస్ పార్టీలో నే విపరీతమైన చర్చ జరుగుతున్నది. ఓ మరుగుజ్జుకు కాంగ్రెస్ అవకాశం ఇచ్చినందుకు ఆ పార్టీ హైకమాండ్ సిగ్గుతో తలదించుకుంటున్నట్టుగా జరుగుతున్న రాజకీయ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. పద్నాలుగేండ్ల ఉద్యమ పార్టీ, పదేండ్ల అధికార పార్టీ అయిన బీఆర్ఎస్‌ను కాదని, అబద్ధపు ప్రచారాలు నమ్మి ప్రజ లు కాంగ్రెస్ పారీకి ఓ అవకాశం ఇచ్చారు. బీఆర్ఎస్ కంటే, కేసీఆర్ పాలనను మరిపించే విధంగా రేవంత్ పాలన ఉంటుందని తెలంగాణ ప్రజలు ఆశించారు. అందుకనుగుణంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఐదేండ్లు సుభిక్ష పాలన అందించాలని, బీఆర్ఎస్ కంటే రెట్టిం పు పాలన సాగించాలని నిండైన ఆశీర్వచనం ఇచ్చారు. గాడి తప్పుతున్న పాలన పట్ల విమర్శలు గుప్పించరాదని, ఏడాది సమయం ఇవ్వాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు హితవు పలికారు. తెచ్చుకున్న తెలంగాణ తెర్లవుతున్నా, తన పథకాలన్నింటినీ రద్దు చేస్తున్నా, కార్యకర్తలు, నేతలపై కేసులు పెడుతున్నా మౌనంగా ఉన్నారే తప్ప, రేవంత్‌ను విమర్శించలేదు. కానీ, సీఎం రేవంత్ రెడ్డి పాలన గాలికివొదిలి పదే పదే కేసీఆర్‌ను, ఆయన కుటుంబాన్ని తిట్ల దండకం తో మాట్లాడుతున్నారు. రేవంత్ వ్యాఖ్యల పట్ల మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ అసెంబ్లీకి రావాలన్నా, మాట్లాడాలన్నా ఆయన స్థాయికి తగ్గవారెవరున్నారని ప్రశ్నించడం తప్పా? కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడమే మంచిదని ఓ కొడుకుగా ఆయన తలపోయడంలో తప్పేమిటి? నిజంగా కూడా కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావాలి? ఎవరితో చర్చించాలి? ఓ పక్క ఏడాదిన్నర ఏడుపుగొట్టు పాలన చూసి ప్రజల పక్షాన అసెంబ్లీకి కేసీఆర్ రావాలని, ఆయన సలహాలు కావాలని ఓ పక్క కాంగ్రెస్ సీనియర్లు అంటుంటే సారొస్తే ఏం జరుగుతుందో ముందే ఊహించి ఆయన్ను కట్టడి చేసే చర్యలకు సీఎం రేవంత్ రెడ్డి ఒడిగట్టినట్టు స్పష్టమవుతున్నది. అంటే అన్నంపెట్టిన వాడికి సున్నం పెట్టేవిధంగా ఆశీర్వచనాలందించిన కేసీఆర్‌నే తరచూ తూలనాడటం, ఆయన కుటుంబాన్ని లక్ష్యం చేయ దం ఓ అడుగు ముందుకేసి ఆయన మరణాన్ని కోరుకోవడం అంటే ముఖ్యమంత్రి తన స్థాయిని తానే దిగజార్చుకోవడం. ఆరోగ్యంగా , ఆపద్బాంధవుడిలా ఉం డే కేసీఆర్ మార్చురీకి పోవాలని నీచ బుద్ధితో సీఎం రేవంత్ ఎందుకు కోరుకుంటున్నరు? ఎంత శత్రువై నా, పగ, ప్రతీకారం ఉన్నా ఎదుటి వ్యక్తి మరణాన్ని ఎలా కోరుకుంటారు? అసలు రేవంత్ ఉద్దేశమేమిటన్న చర్చ జోరుగా సాగుతున్నది. ఓ పక్క కేసీఆర్ అసెంబ్లీకి రావాలని, ఆయన విలువైన సూచనలు పాలన అనుభవాలు తెలంగాణ కు అనివార్యమని స్పీకర్, మంత్రులు సహా కాంగ్రెస్ పార్టీ సీనియర్లు నేరుగా వెళ్లి బతిమిలాడుతుంటే ఇం కోపక్క సీఎం రేవంత్ కేసీఆర్‌ను కేంద్రంగా చేసుకుని 15 నెలల నుంచి చేస్తున్న విమర్శలను చూస్తుంటే నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరిస్తూ కడుపులో విషపు కత్తులు పెట్టుకు తిరుగుతున్నట్టుగానే కనిపిస్తున్నాయి. రాష్ట్రాన్ని తెచ్చిన పెద్దాయన మరణశాసనా న్ని స్వయంగా సీఎం లిఖించడాన్ని తెలంగాణ సమా జం నిశితంగా గమనిస్తున్నది. కేసీఆర్ స్ట్రెచ్చర్ మీద ఉన్న తెలంగాణ వాదానికి ఊపిరిపోసి రాష్ట్రాన్ని సాధించినవారు. మార్చురీకి మర్లుతున్న రైతుల జీవితాలను మార్చడానికి భగీరథ తపస్సు చేసినవారు. వలస పాలకుల చేతిలో జీవచ్ఛవంలా ఉన్న తెలంగాణకు జీవం పోసినవారు. నీళ్లు లేక నెర్రలు బారిన ఈ నేలకు కృష్ణా, గోదావరి జలాలతో దూప తీర్చినవారు. అన్నం మెతుకు దొరకని తెలంగాణను అన్నపూర్ణగా మార్చినవారు. షాక్‌లు ఇచ్చే కరెంటును సరిచేసి 24 గంటల వెలుగులు విరజిమ్మేలా చేసినవారు. తెర్లయిన తెలంగాణ బతుకుల కు తెరచాపై గమ్యం చూపినవారు కేసీఆర్. బక్క పలుచని మనిషైనా ఉక్కు గుండె గలవాడు కేసీఆర్. గడ్డి పోచ లెక్క పదవులను విసిరేసి తెలంగాణను సాధించి ప్రజల హృదయాలను గెలుచుకున్నవారు కేసీఆర్. అలాంటి ధీశాలిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అత్యంత జుగుప్సాకరమైన వ్యాఖ్యల పట్ల యావత్తు తెలంగాణ సమాజం తీవ్ర అభ్యంతరం, నిరసన వ్యక్తం చేస్తున్నది. హెూదా, వయస్సు, యశస్సు గుర్తెరుగకుండా ఉచ్ఛం, నీచం తేడా తెలియని సభా నాయకుడి మధ్య కూర్చుంటే సభకే అవమానం. కేసీఆర్ ఇవాళ అధికారంలో లేకపోవడం వల్ల ఆయన లోటు స్పష్టంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. నిర్బంధకాండ, అక్రమ కేసులు, అరెస్టులు నిత్యకృత్యమయ్యాయి. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో తెలంగాణ ప్రజలు వ్యవసాయానికి జీవనాడిగా నిలిచిన రైతు బంధును కోల్పోయారు. మత్స్యకారులు చేప పిల్లల పంపిణీ కోల్పోయారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన దళిత బంధును కోల్పోయారు. బీసీలకు బాసటగా నిలిచిన బీసీ బంధును కోల్పోయారు. ఇలా ఎన్నో సంక్షేమ పథకాలకు కేవలం వ్యక్తిగత కక్షతోనే చరమగీతం పాడాడు. గుర్రానికి వేగం ఉండాలి. ఏనుగుకు బలం ఉండా లి. రాజుకు పాలనాదక్షత ఉండాలి. మంత్రికి తెలివి ఉండాలి. బంటుకు భక్తి ఉండాలి. సేనాధిపతికి వ్యూహం ఉండాలి. సైనికుడికి తెగింపు ఉండాలి. ఇవన్నీ కలగలిపే రాజ్యం, ఆ రాజ్యం సుభిక్షం. పై లక్షణాల్లో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవ్వరికీ ఏ ఒక్క లక్ష ణం లేదన్నది సుస్పష్టం. అసమర్థుడి చేతిలో రాష్ట్రాన్ని పెట్టి ఫలితాలు ఆశించడం వృథా ప్రయాస. అబద్ధాలు, మోసాల్లో రాటుదేలిన ముఖ్యమంత్రి రేవంత్ నుంచి తెలంగాణ సమాజం ఇంతకన్న ఎక్కువగా ఆశించడం కూడా దండుగే.

# షాకింగ్ రేటింగ్స్



సినిమా విడుదల కాగానే, రేటింగ్స్ కోసం వెతికేస్తున్నారా? ఐఎండీబీ, బుక్ మై షో, రాటెన్ టొమాటోస్ తదితర సంస్థలు ఇచ్చే రేటింగ్స్ ఆధారంగా సినిమా చూడాలా వద్దా అని నిర్ణయించుకుంటున్నారా? అయితే, మీరు మోసపోవచ్చు! 'బుజ్జితల్లీ వచ్చేత్తన్నానే.. !!' అన్న మాటల్లో ఏమోషన్ చూడాలి గానీ.. రేటింగ్ కాదు! ఎందుకంటే.. సినిమా రేటింగ్స్ వెనుక ఓ పెద్ద మాఫియానే నడుస్తున్నదని మీకు తెలుసా? ఈ మాఫియా ఎలా పనిచేస్తుందో, ప్రేక్షకులను ఎలా మోసం చేస్తున్నారో తెలిస్తే షాక్ అవుతారు. సినిమా విడుదలవుతూనే పలు రేటింగ్ వెబ్‌సైట్లలో పాజిటివ్ లేదా నెగటివ్ రేటింగ్స్ పుంజుకోవడం మీరు గమనించే ఉంటారు. మరైతే, ఈ రేటింగ్స్ నిజమేనా? లేక డబ్బుతో నడిచే గేమా? చాలా సినిమాల రేటింగ్స్ వెనుక పెయిడ్ రివ్యూస్ ఓ పెద్ద బిజినెస్‌గా మారింది. ఓ భారీ బడ్జెట్ మూవీని ప్రమోట్ చేయాలంటే డిజిటల్ మార్కెటింగ్ టీమ్‌లు ముందుగా హై రేటింగ్స్ అందజేస్తాయి. ఈ రేటింగ్స్ చూసి ప్రేక్షకులు థియేటర్‌కి పరుగులు పెడతారు. కానీ, కొన్ని రోజుల్లో అసలు నిజం బయటపడుతుంది! సినిమా విడుదల కాగానే, కొన్ని నిర్మాణ సంస్థలు, పీఆర్ ఏజెన్సీలు డబ్బులు ఇచ్చి మరీ రేటింగ్స్ పెంచేస్తున్నాయి. సినీ జర్నలిస్టులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, బోట్స్.. ఇలా చాలామంది రేటింగ్ మాఫియాలో భాగస్వాములే అనేది కాదనలేని సత్యం. ఉదాహరణకు, ఒక పెద్ద సినిమా విడుదల కాగానే పేరొందిన సైట్ లో 5/5 రేటింగ్స్‌తో సమీక్షలు వెల్లువెత్తుతాయి. మరోవైపు ప్రత్యర్థి నిర్మాణ సంస్థలు.. ఫ్యాన్ గ్రూపులు నెగెటివ్ రేటింగ్స్ ఇచ్చి సినిమాను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తాయి. ఇంకా చెప్పాలంటే.. యూట్యూబర్లు, ఇన్‌స్టాగ్రామ్, ఎక్స్ లాంటి సోషల్ మీడియా వేదికలపై తప్పుడు ప్రచారం చేస్తారు. బాక్సాఫీస్ కలెక్షన్లు రాకముందే సినిమా ఫ్లాప్ అని కన్‌ఫర్మ్ చేసేస్తున్నారు.

### ప్రేక్షకులు బకరాలు.. ప్రొడ్యూసర్లకు నష్టాలు..

రేటింగ్ మాఫియా వెనుక ఫేక్ నెగెటివ్ క్యాంపెయిన్లు కూడా ఉంటున్నాయి. కొన్ని సినిమాలు విడుదలకు ముందే ఐదు పాయింట్లకుగాను ఒకటో, రెండో రేటింగ్ ఇచ్చి ముంచేస్తున్న ఫేక్ రాయుళ్లు. ఒకే వ్యక్తి వందల అకౌంట్లతో నెగెటివ్ రివ్యూస్ ఇవ్వగలడు. ఇది టికెట్ కొనాలనుకున్న ప్రేక్షకుడిపై చాలా ప్రభావం చూపుతున్నది. దీంతో మంచి సినిమాలు కూడా ప్రేక్షకుల ఆదరణ లేక డిజాస్టర్స్‌గా మిగిలిపోతున్నాయి. ఈ రేటింగ్స్ మాఫియా వల్ల ప్రేక్షకులు బకరాలైతే, నిజాయతీగా సినిమాలు తీసే దర్శకనిర్మాతలూ మునిగిపోతున్నారు. నానాటికీ థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గి, డిజిటల్ పైరసీ పెరుగుతున్నది. ఈ రేటింగ్ వెబ్‌సైట్‌లో బోట్ అకౌంట్స్ హవా పెరిగింది. ఇటీవల కొన్ని పెద్ద సినిమాలు విడుదల రోజు 4.5 రేటింగ్‌తో మొదలై, నాలుగు రోజుల్లో 2కి పడిపోయాయి.



నిజమైన ప్రేక్షకుల కంటే, బోట్ అకౌంట్స్ ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్నది. సైబర్ సెక్యూరిటీ నిపుణుల ప్రకారం.. వీటిని పూర్తిగా నిలువరించడం అసాధ్యమే! అయితే వాస్తవమైన యూజర్ రివ్యూలను గుర్తించేందుకు కొన్ని కొత్త టెక్నిక్స్‌ను వెబ్‌సైట్లు అమలు చేయాల్సిన అవసరమైతే ఉంది.

### అభిమానులేం చె బుతున్నారు?

'ఆన్‌లైన్ రేటింగ్స్ సినిమాలకు చక్కని ప్రామాణికంగా నిలవాలి గానీ, ఆడియెన్స్‌ను తప్పుదోవ పట్టించేలా ఉండకూడదు! ఒకరిపై ఒకరు రివ్యూస్‌తో దాడి చేసుకుంటే, నాణ్యమైన సినిమాలకు నష్టం!! రేటింగ్స్ కాకుండా, ట్రైలర్, మౌత్ టాక్, ఫిల్మ్ క్రిటిక్స్ అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి' అని సూచిస్తున్నారు విశ్లేషకులు. ఫేక్ హైప్, నెగెటివ్ క్యాంపెయిన్ల వల్ల నిజమైన టాలెంట్ వెలుగులోకి రాకుండా పోయే ప్రమాదం ఉంది. ప్రేక్షకులు సినిమా థియేటర్లో చూడాలా? వద్దా? అనేది ఆన్‌లైన్ రేటింగ్స్ మీద ఆధారపడి నిర్ణయించడం కరెక్టు కాదు. థియేటర్‌కు వెళ్లి సినిమా టికెట్ కొనకముందే, ఆన్‌లైన్ రేటింగ్ చూసి సినిమాను అంచనా వేయడం ఎంత వరకు సబబు అని ప్రేక్షకులు వేసుకోవాల్సిన ప్రశ్న! నటీనటులు నచ్చి, సంగీతం మెప్పించి, దర్శకుడి ప్రతిభపై నమ్మకం ఉండి, ట్రైలర్ ఆసక్తికరంగా ఉందనిపిస్తే.. సినిమా చూడాలన్న నిర్ణయానికి రావాలి! అప్పుడు కూడా ఎందుకులే అనిపిస్తే%ూ% చూడకపోవడం మీ ఇష్టం. అంతేకానీ, రేటింగ్స్ ఆధారంగా నిర్ణయానికి రావొద్దు.

### రేటింగ్స్ ఎలా గుర్తించాలి?

రేటింగ్స్ చూసినప్పుడు.. ఎక్కువ శాతం 1 ఇచ్చి, ఆ వెంటనే దానికి విరుద్ధంగా 5 స్టార్ రేటింగ్స్ కనిపిస్తే అది మానిప్యులేట్ బాపతు అని గుర్తించాలి. కొన్ని సమీక్షల్లో సహజత్వం ఉండదు. సన్నివేశాలు, వాటి తాలుకూ భావోద్వేగాల గురించి వీటిలో ప్రస్తావించరు. సాధారణ పదజాలంతో ఏదేదో రాసేస్తారు. ఇలాంటి రివ్యూలను బోట్స్ లేదా డబ్బులు తీసుకుని రాసినవిగా అనుమానించాలి. సినిమా విడుదలైన కొన్ని గంటల్లోనూ రివ్యూ స్కోర్‌లో ఊహించని హెచ్చుతగ్గులు గమనిస్తే కచ్చితంగా ఫేక్ అని నిర్ణయానికి రావాలి. కామెంట్స్ వికృతంగా కనిపిస్తే.. నెగెటివ్ పబ్లిసిటీ చేస్తున్నారని గుర్తించాలి. నకిలీ సమీక్షలు రాసిన వ్యక్తులు, సంబంధిత సంస్థలపై చర్యలు తీసుకోవాలి. రివ్యూలను నమ్మి సినిమా చూడాలా? వద్దా? అనే నిర్ణయానికి రావడం సరైన విధానం కాదని ప్రేక్షకులకు అవగాహన కల్పించాలి. సినిమా విడుదలైన మొదటి మూడు రోజులు రేటింగ్స్‌ను నిషేధించాలి. గతంలో సినిమా విడుదలైన రెండు వారాల తర్వాతే రివ్యూలు ఇచ్చేవారు! అప్పటికి సినిమా భవిష్యత్తును ప్రేక్షకులు తేల్చేసే వారు కూడా!

## ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌పై చట్టాల బాధ్యత రాష్ట్రాలదే లోక్‌సభలో కేంద్రమంత్రి ప్రకటన





ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు సంబంధించిన చట్టాలను రూపొందించడం రాష్ట్రాల బాధ్యతని కేంద్రం లోక్‌సభలో స్పష్టం చేసింది. లోక్‌సభలో ఈ అంశంపై డీఎంకే ఎంపీ దయానిధి మారన్ అడిగిన ప్రశ్నలకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం.. ఇది రాష్ట్రాలకు సంబంధించిన అంశమని తెలిపారు. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో డీఎంకే ఎంపీ దయానిధి మారన్ ఆన్‌లైన్ గేమింగ్ సైట్‌లను నిషేధించడానికి ఎందుకు నిర్దిష్ట చర్యలు తీసుకోవడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమిళనాడు ప్రభుత్వం ఇప్పటికే ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించిందని, ఈ విషయంలో కేంద్రం సైతం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనికి ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందిస్తూ.. రాజ్యాంగం ప్రకారం.. బెట్టింగ్, గ్యాంబ్లింగ్ రాష్ట్రాల జాబితా కిందకు వస్తాయని, ఈ క్రమంలో చట్టాలు చేసే హక్కు రాష్ట్రాలకు ఉందన్నారు. 'రాజ్యాంగాన్ని అధ్యయనం చేసి, దేశ సమాఖ్య నిర్మాణాన్ని గౌరవించండి' కేంద్ర మంత్రి స్పందించారు. ఇప్పటి వరకు 1,410 ఆన్‌లైన్ గేమింగ్ సైట్‌లపై చర్యలు తీసుకున్నామని, వాటిని నిషేధించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఈ దిశగా చర్యలు తీసుకుంటోందని, అయితే చట్టపరంగా తమ ప్రాంతాల్లో వాటిని నియంత్రించడం రాష్ట్రాల బాధ్యత అని పేర్కొన్నారు. 'ఇండియన్ జస్టిస్ కోడ్' సెక్షన్ 112 కింద ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌పై చర్యలు తీసుకోవచ్చని మంత్రి స్పష్టం చేశారు.

# మిత్ర సమ్మేళనం

ఘోటకముఖుడు తన కథ చెబుతున్నాడు. ..అలా తన భార్య అయిన మిత్రవింద చేత ప్రబోధింపబడిన చక్రధర నాయకుడు.. భోజనం తరువాత నన్ను కచేరీ చావిడికి తీసుకువెళ్లాడు. అక్కడ విపులుని నగరం నుంచి చక్రధరుడు వెంటబెట్టుకుని తెచ్చిన వేశ్యాపుత్రికలు ఉన్నారు. మమ్మల్ని చూడటంతోనే లేచి నిలబడ్డారు. ఘోటకముఖుడు తన కథ చెబుతున్నాడు. ..అలా తన భార్య అయిన మిత్రవింద చేత ప్రబోధింపబడిన చక్రధర నాయకుడు.. భోజనం తరువాత నన్ను కచేరీ చావిడికి తీసుకువెళ్లాడు. అక్కడ విపులుని నగరం నుంచి చక్రధరుడు వెంటబెట్టుకుని తెచ్చిన వేశ్యాపుత్రికలు ఉన్నారు. మమ్మల్ని చూడటంతోనే లేచి నిలబడ్డారు. "అమ్మాయిలూ! మీరెవరో, ఎక్కడినుంచి వచ్చారో వివరంగా చెప్పండి. మీ స్వస్థానానికి మిమ్మల్ని చేర్చే పూచీ నాది" అన్నాడు చక్రధర నాయకుడు."మహారాజా! మాది పాటలీపుత్రం. మేము రతినూపుర అనే వేశ్యపుత్రికలం. నా పేరు చిత్రసేన, దీనిపేరు రతిమంజరి. నా భర్త దత్తుడనే విద్వాంసుడు. దీని భర్త గోణికాపుత్రుడు. మేము తల్లి సంపదలను, గుణాన్నీ వదిలేశాం. మగనాలులుగా మారిపోయాం. గోణికాపుత్రుని వెంట దత్తుణ్ని కలుసుకోవడానికి ధారానగరం వెళ్తుండగా.. ఒక మతంగ యోగిని మా వెంట పడింది. 'మేం వేశ్యాధర్మాలను విడిచిపెట్టాం' అని ఎంత చెప్పినా వినలేదు. చివరికి ధారానగరం నుంచి ఒక బండిలో మమ్మల్ని బలవంతంగా తీసుకుపోయి, విపులుడనే మహారాజు చెంతకు చేరింది. వెలయాలికి నీతి ఎక్కడిదని ఆ మహారాజు మమ్మల్ని ఈసడించాడు. అయినా మేము మా వ్రతాన్ని విడిచిపెట్టలేదు. ఇంతలో అతగాడు మిమ్మల్ని ఎందుకో పిలిపించాడు. మీవెంట పంపాడు. ఇదీ జరిగింది" అని చిత్రసేన చెప్పడం పూర్తి చేసింది. మాటతో నాకు మేను ఉప్పొంగింది.

## నేను చక్రధర నాయకుడితో..

"రాజా! ఈ గణికల భర్తలు నాకు ప్రాణస్నేహితులు. ప్రస్తుతానికి వారు ధారానగరంలో ఉన్నారు. వీళ్లను తమ భర్తలతో కలిపే బాధ్యత నాకు అప్పగించండి. నేను తీసుకువెళ్తాను" అని కోరాను. "అంతకంటే కావాల్సింది ఏముంది? మీకు కావాల్సినన్ని రోజులు ఇక్కడ విశ్రాంతి తీసుకుని బయల్దేరవచ్చు" అని సెలవిచ్చాడు చక్రధరుడు. నేను ఒకనాడు చక్రధరుని ఇల్లాలు మిత్రవిందతో.. ఆమెను పరమ పతివ్రత, దత్తభాగవతంలో గొప్ప వైరాగ్యబోధ చేసిన మహాతల్లి అయిన మదాలసతో పోల్చాను. మదాలస చరితాన్ని ఆమె మనసుకు ఆనందం కలిగేలా చెప్పాను. దాంతో పరోక్షంగా త్వరలో నీకు పుత్రసంతానం కలగాలి! అని కథాశ్రవణ ఫలరూపంగా ఆశీర్వదించినట్లయింది.వారు ఆ కథ విని ఆనందిస్తున్న సమయంలో.. ముసలావిడతో నా మనోభీష్టాన్ని తెలియచేశాను. దానికి చక్రధర నాయకుడు, మిత్రవింద సైతం ఆమోదించారు. సుముహూర్తం చూసి, వారి కుమార్తె అయిన



జాంబవతిని నాకిచ్చి పెళ్లి చేశారు. కొంతకాలం ఆమెతో సుఖించిన తరువాత, నాకు మిమ్మల్ని కలుసుకోవాలనే సంగతి జ్ఞాపకం వచ్చింది. చిత్రసేనను, రతిమంజరిని వెంటబెట్టుకుని ఇలా వచ్చేశాను. మీరున్న చోటు తేలికగానే తెలుసుకోగలిగాను. ఇదీ జరిగింది...అని ఘోటకముఖుడు తన కథను పూర్తి చేశాడు."మిత్రమా! నీకొక సంగతి చెప్పనా?" అని అడిగాడు గోణికాపుత్రుడు. "ఏమిటీ!?" అని ఘోటకముఖుడు ఆశ్చర్యంగా చూస్తుండగానే.. "ఇంతకాలం నుంచి ఏ మహాసాధ్విని రక్షించడానికి నువ్వు ప్రయత్నించావో ఆ లీలావతి.. ఇప్పుడిక్కడే ఉంది" అని పూర్తి చేశాడు. "మిత్రమా! ఇంకో ఆశ్చర్యం కలిగించే సంగతి చెప్పనా?" అన్నాడు సువర్ణనాభుడు. మధ్యలోనే గోణికాపుత్రుడు అందుకుని.. "నువ్వు ఇంతకాలం ఏ పెద్దమనిషికి సహకరించి, ఈ లీలావతిని ఆయనతో కలపాలని ప్రయత్నించావో.. ఆ పెద్దాయన మరెవరో కాదు.. సాక్షాత్తూ భోజ మహారాజు" అని చెప్పాడు. ఘోటకముఖుడికి మరింత ఆనందం కలిగింది.చారాయణుడు కొనసాగిస్తూ.. "నన్ను గాడిదగా చేసిన భైరవుడే భోజ మహారాజును, ఆయన భార్య లీలావతిని కూడా జంతువులుగా మార్చాడు. భోజులవారు వాడి బారినుంచి కాళిదాసు చాతుర్యంతో తప్పించుకున్నారు. మహారాణి లీలావతి కూడా ఇదిగో.. ఈ సువర్ణపదిక వల్ల తన పూర్వరూపానికి రాగలిగారు" అని చెప్పాడు.మిత్రుల మధ్య ఆ మాటలు జరుగుతుండగా, మేలిముసుగు మాటున లీలావతి వారి వద్దకు వచ్చింది. ఘోటకముఖునికి నమస్కరించింది.అతడు సంతోషించాడు. "ఇంతకూ మన దత్తకుడేమయ్యాడు?" అనిప్రశ్నించాడు. ఆ ప్రశ్నకు సువర్ణనాభుడు సమాధానమిచ్చాడు. "ఒక యక్షుని శాపం వల్ల మన దత్తకుడు స్త్రీగా మారాడు. ఏడాది తరువాత తన పూర్వరూపానికి వచ్చాడు. కానీ, శాపావశాన్ని చెబుతూ యక్షుడు పెట్టిన నియమాన్ని మరిచిపోయి, మళ్లీ స్త్రీరూపానికి మారిపోయాడు. నిజానికి వాడెక్కడున్నాడో తెలియదు. కానీ, యువరాజు చిత్రసేనుల వారి ప్రియురాలిగా ఉన్నది వాడేనని కొందరు చెవులు కొరుక్కుంటున్నారు!". "ఏమిటీ గందరగోళమంతా.. వాడే అని మనకు తెలిసి ఉంటే మనమే వెళ్లి, గతాన్ని గుర్తుచేద్దాం. ఆ యక్షుడు ఎక్కడున్నాడో తెలుసుకుని, మన్నించమని కోరుదాం" అన్నాడు ఘోటకముఖుడు సాలోచనగా. "ఆ అవకాశమే లేదు. భైరవుడు ఆ యక్షుణ్ని కూడా ఏదో జంతువుగా మార్చాడు. ముందు వాడి భరతం పడితే తప్ప, మనం దత్తకుణ్ని రక్షించుకోలేం" అని చెప్పాడు సువర్ణనాభుడు."మరో రెండురోజుల్లో ఆ భైరవుడి జంతుప్రదర్శన జరగబోతున్నది. అప్పుడు నా సిద్ధులతో వాణ్ని భయపెడతాను. లొంగివచ్చేలా చేస్తాను. వాడు జంతువులుగా మార్చిన వారందరినీ విడిపిస్తాను" అని కుచుమారుడు ప్రతిజ్ఞ చేశాడు. ప్రదర్శన రోజు రానేవచ్చింది. పురమందిరంలో అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. దాదాపు వెయ్యిమంది ప్రేక్షకులు వచ్చారు. స్త్రీలకు, పురుషులకు ప్రత్యేకంగా ఆసనాలు సమకూర్చారు. లీలావతి, రుక్మిణి మొదలుగా గల స్త్రీలందరూ ఒకపక్క కూర్చున్నారు. చారుమతి వేషంలో ఉన్న దత్తకుడు కూడా.. ప్రదర్శన చూసివద్దామని యువరాజు చిత్రసేనుణ్ని తెగ బతిమాలాడు. దాంతో చిత్రసేనుడు ఒక ఆలోచన చేశాడు. చారుమతికి పురుష వేషం వేయించాడు. వారిద్దరూ ఎవరికంటా పడకుండా ఒకమూలగా కూర్చున్నారు. కుచుమారుడు మొదలైన ఆరుగురు మిత్రులూ ఒక దగ్గర కూర్చున్నారు. కాళిదాసుతోసహా భోజరాజు సమయానికి విచ్చేశాడు. ఘోటకముఖుడు ఆయనను సందర్శించాడు. భోజరాజు తనకు ఎంతో సాయం చేసిన ఘోటకముఖుణ్ని ఆలింగనం చేసుకుని, సన్మానించాడు. "ఆహా! నా లీలావతి కూడా లభిస్తే నా జీవితంలో ఇదే సుదినం అవుతుంది" అన్నాడు ఆనందబాష్పాలు రాల్చుతూ. "మహారాణిగారు కూడా ఇక్కడే ఉన్నారు ప్రభూ!" అని ఘోటకముఖుడు విన్నవించాడు. "ఈ ప్రదర్శన పూర్తయిన తరువాత ఆమెను కలుసుకోవచ్చు" అని చెప్పాడు. భైరవుడి జంతు ప్రదర్శన మొదలైంది.క్రూర జంతువులు, అడవి జంతువులు, పెంపుడు జంతువులు అనేకం బోనులలో వేదిక మీదికి తీసుకువస్తున్నారు. ఒక్కొక్క జంతువు చేత ఒక్కొక్క విన్యాసం చేయించసాగాడు భైరవుడు.కొద్దిసేపటి తరువాత కుచుమారుడు పైకిలేచాడు. వేదికను సమీపించాడు. తన మెడలోని అస్థిమాలను చేత పట్టుకుని, మృగాలనే చూస్తూ హుంకారహేల చేశాడు. అంతే.. వెనువెంటనే మృగాలన్నీ వచ్చి కుచుమారుని పాదాలవద్ద వినయం చూపుతూ నిలిచిపోయాయి. భైరవుడు తన చేతనున్న బెత్తాన్ని చూపిస్తూ వెనక్కు రమ్మని ఒక ఎలుగుబంటిని పిలిచినా, వెనక్కి పోలేదు. బెత్తంతో కొట్టబోయేసరికి బొబ్బపెడుతూ భైరవుణ్ని రక్కింది. మరో పులిని బెదిరించేసరికి, కరవబోయింది. భైరవుడు ఎంతగా ప్రయత్నించినా ఏ మృగమూ వెనుతిరిగి రాలేదు. అప్పుడు వాడు చెయ్యెత్తి కుచుమారుడి వైపు చూపిస్తూ.."వీడెవడో ప్రయోగం చేశాడు మహారాజా! ఇలా అయితే నా ప్రదర్శన జరిగేట్లు లేదు. వీణ్ని ప్రయోగం ఉపసంహరించమని ఆజ్ఞాపించండి" అని భోజరాజును ప్రార్థించాడు. వెనువెంటనే చారాయణుడు పైకి లేచాడు. "ఓరీ! నన్నెప్పుడైనా చూశావా? నా ముఖం చూసి చెప్పు" అని గద్దించాడు. భైరవుడు గుటకలు మింగాడు. "గురువును చంపిన మహాపాతకుడా! నీ పాపం నేటికి పండింది" అన్నాడు చారాయణుడు. "ఆడవారిని చెరపట్టిన నీకు ఏ శిక్ష విధించినా తక్కువే!" అని ఘోటకముఖుడు గద్దించాడు. ఇంతలో వేదికమీద నుంచి భైరవుడు పారిపోతుండగా కోతులు ఆటంక పరిచాయి. కుక్కలు తరిమాయి. గుర్రాలు తన్నాయి. వాడు వేదికపైనే అటూఇటూ పరుగెడుతుండగా.. ప్రేక్షకులు గొల్లున నవ్వసాగారు.కుచుమారుడు మరోసారి హుంకారం చేశాడు. ఒక ఎలుగుబంటి వెళ్లి, భైరవుణ్ని చాచి లెంపకాయ కొట్టింది. వాణ్ని లాక్కువచ్చి, కుచుమారుని పాదాలమీద పడేసింది. కుచుమారుడు అప్పుడు భైరవుడి తలను పాదాలతో తన్నుతూ.. "గురుద్రోహీ! పరమ తపోనిధి అయిన ఆ సిద్ధుని పరిమార్చి ఏం గొప్ప సంపదలు మూట కట్టుకున్నావు? యముడు నీ నిమిత్తమై కొత్త నరకాన్ని కట్టిస్తున్నాడు. పదపద. నీవింక ఈ భూమిలో ఉండదగినవాడవు కావు" అని పలికాడు.భైరవుని కాళ్లకు, చేతులకు సంకెళ్లు తగిలించారు.

ఆరుగురు మిత్రులూ కలిసి, జంతువులన్నిటినీ పరీక్షించ సాగారు. వాటి మెడల్లోని తాయెత్తులను లాగివేయసాగారు. ప్రతిఒక్క జంతువు నుంచీ ఒక్కొక్కరు చొప్పున మనుషులే వస్తున్నారు. వారిలో యక్షుడు కూడా ఉన్నాడు.సువర్ణనాభుడు తన తోడల్లుడైన యక్షుని వద్దకు వెళ్లి.. "మహాభాగా! రండి. మేమంతా మీకోసమే చూస్తున్నాం!" అంటూ తనతో తీసుకువెళ్లాడు. భోజమహారాజుకు ఆ యక్షుణ్ని చూపించాడు. "మహాత్మా! నువ్వు మానవాతీతుడివి. అయినా మాతోపాటు కలిసిమెలిసి తిరుగుతూ మహోపకారాలు చేశావు. నీ దయ లేకపోతే ఆ భైరవుని వల్ల చారాయణుడు ఈపాటికి పిండివంటగా మారి ఉండేవాడు. నా భార్యను రక్షించడం కోసం కూడా మీరెంతో శ్రమ తీసుకున్నారని తెలిసింది. మీకెలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియడం లేదు" అని యథోచితంగా స్తోత్రం చేసి, నమస్కరించాడు.తన చరిత్రను కావ్యరూపంగా రచించిన కాళిదాసుకు, యక్షుడు పాదాభివందనం చేశాడు.చిత్రసేనుడి పక్కన కూర్చున్న దత్తుణ్ని మొదటిగా గోణికాపుత్రుడు గుర్తించాడు. "అదుగో దత్తుడు.." అని కేకపెట్టాడు.అందరూ వచ్చిచూశారు. పెదవి విరిచారు. "ఇతను దత్తుణ్ని పోలి ఉన్నాడు కానీ, దత్తుడు కాదు. మనల్ని గుర్తుపట్టనే లేదు!" అన్నారు. ఆ సందడిలో రుక్మిణి వచ్చింది. "నాకు గర్భాన్ని కలిగించిన వ్యక్తి.. అచ్చంగా ఈ పోలికలోనే ఉన్నాడు. కానీ, ఇతను మాత్రం అతను కాదు" అన్నది.అయితేమరి చిత్రసేనుడితో ఉన్నది ఎవరు? అని సమస్య వచ్చింది.అప్పుడు.. "అల్లుడే కోడలైంది కదా!" అని భోజరాజు సంస్కృత ఛందస్సులో ఒక సమస్యను కాళిదాసు ముందు పెట్టాడు.దానికి కాళిదాసు శ్లోకంలోనే చెప్పిన సమాధానానికి సారాంశం ఇది..

మన్మథుని పోలి ఉన్న దత్తకుడు భోజరాజ పుత్రికకు గర్భం కలగచేసి.. యక్షుని శాపం వల్ల అమ్మాయిగా మారాడు. చిత్రసేనుడికి భార్యగా ఉన్నాడు. అందువల్ల ఓ రాజా! నీకు అల్లుడే కోడలయ్యాడు.కాళిదాసు చేసిన ఆ పూరణ వింటూనే సభాసదులందరూ ముక్కుమీద వేలేసుకున్నారు.సువర్ణనాభుడు మొదలైన ఆరుగురు మిత్రులూ యక్షుణ్ని ఆశ్రయించారు. "ఇతను మా మిత్రుడు. దయచేసి కాపాడండి" అని కోరారు.అప్పుడు యక్షుడిలా పలికాడు. "ఓ కాంతా! అజ్ఞానం కొద్దీ పూర్వం నా రహస్యాన్ని వెల్లడి చేసినందువల్ల నువ్విలా ఉన్నావు. ఇప్పుడు కాళిదాసుగారి అనుగ్రహంతో పురుషునిగా.. దత్తకుడిగా మళ్లీ మారు!".ఈ మాటలు పలకగానే దత్తకుడికి పూర్వరూపం వచ్చింది.భైరవుడికి ఉరిశిక్ష పడింది.చివరికి ఏడుగురు మిత్రులలో..ఇద్దరు రాజులయ్యారు.వారే గోనర్దీయుడు, కుచుమారుడు.మరో ఇద్దరు రాజులకు అల్లుళ్లయ్యారు.వాళ్లే ఘోటకముఖుడు, దత్తకుడు.భోజరాజుకు అల్లుడిగా మారడంతో దత్తకుడు అందరికంటే ఎక్కువ పరపతి కలిగినవాడయ్యాడు.అతనికి వేశ్యాపుత్రిక అయిన చిత్రసేన రెండో భార్య అయింది. అలాగే ఘోటకముఖుడు వరాహపురాన్ని ఏలే చక్రధర నాయకుడికి అల్లుడైన సంగతి విదితమే.ఐదోవాడైన గోణికాపుత్రుడు ఎప్పుడూ భోజరాజ కుమారుడైన చిత్రసేనుడి చెలిమిని విడిచిపెట్టలేదు. ఆరోవాడైన సువర్ణనాభుడు యక్షకన్యను పెళ్లాడాడు.ఏడోవాడైన చారాయణుడు వేదపండితుని కుమార్తెను పెళ్లాడి సుఖించాడు.ఈ ఏడుగురు మిత్రులూ తదనంతర కాలంలో కామశాస్త్ర ప్రవక్తలలో అగ్రగణ్యులుగా కీర్తి గడించారు.

# ఇన్సులిన్ సూది..



గుండెకు చేటుడయాబెటిస్ రోగులు లేని వీధి లేదు. దేశంలో రోజు రోజుకూ చక్కెర వ్యాధిగ్రస్తులు పెరిగిపోతున్నారు. దీని నివారణ కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా చివరికి ఇన్సులిన్‌తో జీవితకాలం నెట్టుకురావాల్సిన దుస్థితే. ఇప్పటికి ఇన్సులిన్‌కి ప్రత్యామ్నాయం లేదు. డయాబెటిస్‌తోపాటు ఎన్నో ఇబ్బందులు పడుతున్న వారికి మరో చేదువార్త చెప్పారు ఫిన్లాండ్‌లోని కువోపి యూనివర్సిటీ హాస్పిటల్ వైద్యులు. ఇన్సులిన్ ప్రభావం వల్ల గుండె కవాటాల పనితీరు తగ్గుతుందని వాళ్లు నిర్వహించిన ఓ అధ్యయనంలో గుర్తించారు.ఇన్సులిన్ ఉపయోగిస్తున్న 45 ఏళ్లు పైబడిన రోగుల గుండె పనితీరుపై వాళ్లు అధ్యయనం చేశారు. ఇన్సులిన్ ప్రభావం వల్ల ధమని కుంచించుకుపోతున్నట్లుగా గమనించారు. ఇలా జరగడం వల్ల ధమని పూర్తిగా తెరుచుకోదు. అప్పుడు గుండె నుంచి శరీరానికి జరిగే రక్త సరఫరాకు ఆటకం కలుగుతుంది. దీంతో గుండె విఫలమవడం (హార్ట్ ఫెయిల్యూర్) జరగుతుందని, చివరికి ప్రాణహానీ ఉంటుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ఈ సమస్య మొదలైనప్పుడు గుండె కొట్టుకోవడం (పంపింగ్) కొంచెం కష్టంగా ఉంటుంది. (అధిక) రక్తపోటు, వికలం చెందిన ధమనులు ఉన్నవాళ్లు డయాబెటిస్ వల్ల ఇన్సులిన్ తీసుకుంటూ ఉంటే ధమని మూసుకుపోయే ప్రమాదం మరింత తీవ్రంగా ఉంటుందని కూడా ఈ పరిశోధకులు చెబుతున్నారు

# స్మార్ట్ వర్కర్‌గా మారిపోండి!



ఇప్పుడంతా స్మార్ట్ యుగం. హార్డ్‌వర్కర్ అన్న పేరుకన్నా స్మార్ట్ వర్కర్ అన్న పదానికే ఇప్పుడు క్రేజ్ ఉంది. తక్కువ శ్రమతో ఎక్కువ ఉత్పత్తిని ఇవ్వడం అన్నది ఇటు పనిచేసేవారికీ హాయిగొలిపే అంశమే. మీరూ స్మార్ట్ వర్కర్‌గా మారిపోవాలనుకుంటే ఇదిగోండి కొన్ని టిప్స్.

పనుల జాబితా: రోజును ప్రారంభించబోయే ముందే ఆ రోజు ఏం చేయాలి అన్నదాని మీద అవగాహన ఉండాలి. స్టాండప్ కాల్స్, రివ్యూ, క్లయింట్ మీటింగ్, ఇంటర్నల్ డిస్కషన్స్ ఇలాంటివన్నీ ఎప్పుడెప్పుడు ఉంటాయి అన్నది ఒకసారి అవలోకించుకుంటే, ఆ సమయానికి మిమ్మల్ని మీరు చక్కగా ప్రెజెంట్ చేసుకోగలుగుతారు. ఏ గ్యాప్ దగ్గర విశ్రాంతి తీసుకోవచ్చు. ఏ సమయంలో పనిచేసుకోవచ్చు అన్నదీతెలుస్తుంది

**.ప్రాధాన్యతా క్రమంలో..**: పనిచేసేప్పుడు కూడా ఏ పని ఎక్కువ ప్రయారిటీ అన్నది చూసుకోవాలి. అంటే 20 శాతం టాస్క్‌లు 80 శాతం పనిని పూర్తిచేస్తాయి. ముందుగా ప్రాధాన్యం ఉన్న అలాంటి వాటిని గుర్తించి, పూర్తి చేసుకుంటే మిగతావి చేయడం సులభం అవుతుంది.

**నో చెప్పండి**: చెప్పిన ప్రతి పనికీ తలూపడం కాకుండా, ముందుగా మీ దగ్గర ఉన్న పనులకు పట్టే సమయాన్నీ వాటి ప్రాధాన్యాన్ని అంచనా వేసుకోండి. అవీ ఇవీ చేయడం కష్టం అనిపిస్తే తప్పకుండా నో చెప్పండి. లేకపోతే లేనిపోని గందరగోళానికి గురై సకాలంలో ఏ పనీ పూర్తిచేయలేరు.ఇంటర్‌వెల్ ఉండాలి: సుదీర్ఘ సమయం పనిచేస్తూ ఉండటం అంటే హార్డ్ వర్క్ చేయడమే. కానీ, క్రమం తప్పకుండా బ్రేక్‌లు తీసుకుంటూ పనులు పూర్తి చేస్తే అది ఒత్తిడిగా అనిపించదు. అధ్యయనాలు చెబుతున్న విషయం ఏమిటంటే ఇలాంటప్పుడు పనులు త్వరగా పూర్తవుతాయట కూడా.

**సత్వర స్పందన**: ఏదైనా ఇష్యూ మీ దగ్గరకి వచ్చినప్పుడు, ఒక మెయిల్‌కు రెస్పాండ్ అవ్వాల్సి వచ్చినప్పుడు వెనువెంటనే దానికి రిట్కుప్లై ఇవ్వండి. అవసరమైన వారి దృష్టికి ఆ సమస్యను తీసుకెళ్లండి. దీని తర్వాతే ఆ టాస్క్‌కు సంబంధించిన పని మొదలుపెట్టండి. వెంటనే స్పందిచడం అన్నది స్మార్ట్ వర్కర్ లక్షణాల్లో ప్రధానమైనది.

## వెనుక నుంచి గ్యాస్ ఎక్కువగా వస్తుందా

# అయితే ఈ చిట్కాలను పాటించండి

వెనుక నుంచి గ్యాస్ రిలీజ్ చేయడం అన్నది సహజంగానే అందరికీ జరుగుతూ ఉంటుంది. అయితే కొన్ని సార్లు పలు కారణాల వల్ల గ్యాస్ ట్రబుల్ సమస్య చాలా ఇబ్బందులకు గురి చేస్తుంది. అపాన వాయువు మరీ అతిగా రిలీజ్ అవుతుంది. దీంతో నలుగురిలో ఉన్నప్పుడు తీవ్ర ఇబ్బందులు పడతారు. అయితే గ్యాస్ సమస్య ఇలా తీవ్రంగా వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. వేళ తప్పించి భోజనం చేయడం, అతిగా ఆహారం తినడం, అజీర్తి, కడుపు ఉబ్బరం, శీతల పానీయాలను లేదా చల్లని పానీయాలను అధికంగా తాగడం, టీ, కాఫీలను అధికంగా తాగడం, పప్పు దినుసులను, నట్స్, డ్రై ఫ్రూట్స్‌ను అతిగా తీసుకోవడం, ఆందోళన, ఒత్తిడి.. వంటి కారణాల వల్ల గ్యాస్ సమస్య వస్తుంటుంది. అయితే ఇందుకు ఇంగ్లిష్ మెడిసిన్లను వాడాల్సిన పనిలేదు. మన ఇంట్లో ఉండే సహజసిద్ధమైన పదార్థాలతోనే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.



### అల్లం..

సాధారణంగా అందరి ఇళ్లలోనూ అల్లం ఉంటుంది. అల్లాన్ని తీసుకోవడం వల్ల గ్యాస్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. జీర్ణ సమస్యలను తగ్గించడంలో అల్లం అద్భుతంగా పనిచేస్తుంది. భోజనం చేసే ముందు ఒక టీస్పూన్ అల్లం రసం సేవిస్తుండాలి. లేదా అల్లాన్ని నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. దీంతో గ్యాస్ ఉత్పత్తి తగ్గుతుంది. పొట్టలో ఉండే అసౌకర్యం తొలగిపోతుంది. తిన్న ఆహారం కూడా సరిగ్గా జీర్ణమవుతుంది. అజీర్తి, మలబద్ధకం, కడుపు ఉబ్బరం, కడుపులో మంట వంటి సమస్యలు ఉండవు. గ్యాస్ ట్రబుల్ సమస్యతో బాధపడుతున్నవారికి పెప్పర్‌మింట్ టీ కూడా అద్భుతమైన ఆప్షన్ అని చెప్పవచ్చు. పెప్పర్‌మింట్ టీని పుదీనా ఆకులతో తయారు చేస్తారు. అందువల్ల ఈ హెర్బల్ టీని తాగితే జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. పుదీనాలో యాంటీ స్పాస్మోడిక్ గుణాలు ఉంటాయి. అందువల్ల పెప్పర్‌మింట్ టీని తాగితే జీర్ణవ్యవస్థలో ఉండే అసౌకర్యం తొలగిపోతుంది. అలాగే జీర్ణవ్యవస్థలో ట్రాప్ అయి ఉన్న గ్యాస్ కూడా బయటకు వస్తుంది. గ్యాస్ ట్రబుల్ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.


### సోంపు గింజలు..

కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యను తగ్గించడంలో సోంపు గింజలు కూడా అద్భుతంగానే పనిచేస్తాయి. సోంపు గింజలను నేరుగా తినవచ్చు లేదా వీటిని నీటిలో మరిగించి ఆ నీళ్లను తాగవచ్చు. ఇక రాత్రిపూట సోంపు గింజలను నీటిలో వేసి నానబెట్టి మరుసటి రోజు ఉదయం ఆ నీళ్లను తాగవచ్చు. ఇలా ఏ చిట్కా పాటించినా కూడా సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. సోంపు గింజలను భోజనం చేసిన అనంతరం నమిలితే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. గ్యాస్ ఉత్పత్తి అవదు. జీర్ణవ్యవస్థలో ఉండే అసౌకర్యం కూడా పోతుంది.

### యాపిల్ సైడర్ వెనిగర్..


యాపిల్ సైడర్ వెనిగర్‌ను తీసుకోవడం వల్ల మనకు ఎన్నో అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ముఖ్యంగా దీని వల్ల జీర్ణ సమస్యల నుంచి బయట పడవచ్చు. ఒక గ్లాస్ నీటిలో పావు టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి భోజనం చేసే ముందు సేవించాలి. ఇలా తీసుకుంటుంటే గ్యాస్ ట్రబుల్ తగ్గిపోతుంది. ఇలా పలు రకాల చిట్కాలను పాటించడం వల్ల గ్యాస్ ట్రబుల్ సమస్య నుంచి సులభంగా విముక్తి పొందవచ్చు. జీర్ణవ్యవస్థ పనితీరు సైతం మెరుగు పడుతుంది.

# మీ కంట్రోల్‌లోనే ఉన్నారా?



ఈ స్మార్ట్ యుగంలో మీరు మీ కంట్రోల్‌లో ఉన్నారని భావిస్తున్నారా! మీరు భ్రమల్లో పరిభ్రమిస్తున్నట్టే!! డిజిటల్ దునియాలో ట్రెండింగ్ ఐటమ్ ఏంటో తెలుసా? మీరే!! కృత్రిమ మేధ వికృత క్రీడలో మీరో సేల్డ్ ప్రొడక్ట్! ఇక్కడ ఇంకో ట్విస్ట్ ఉంది. మిమ్మల్ని అమ్మేసిన విషయం మీక్కూడా తెలియదు! ఇటీవల విడుదలైన '%జు=రా%' సినిమా ఈ విషయాన్ని క్లియర్‌గా చూపించింది. క్షణాల్లో మన పనులు చక్కబెడుతున్న ఏఐ మిమ్మల్ని రింగ్ మాస్టార్‌లా ఆడిస్తుందన్నది నిజం. కావాలంటే చెక్ చేసుకోండి.. గూగుల్ మీ ఆసక్తులకు తగ్గ వస్తువులకు సంబంధించిన నోటిఫికేషన్లు పంపిస్తుంది కదా! ఎప్పుడో ఏడాది కిందట దిగిన ఫొటోలు.. మళ్లీ రీక్యాప్ చేస్తుంది కదా! ఈ ఉదాహరణలు చాలు అరచేతిలో ఒదిగిపోయిన ఫోన్‌లో మీ జీవితమంతా ఇమిడిపోయిందని చెప్పడానికి. 'గోడలకు చెవులుంటాయ్' పాత సామెత! కానీ, ఇప్పుడు జేబులో ఉన్న ఫోనో.. ఒడిలో ఉన్న ల్యాపీనో వింటుందేమోనని సందేహించాల్సిందే! మైక్రోఫోన్, బిల్ట్‌ఇన్ కెమెరా.. ఈ రెండూ దేంట్లో ఉన్నా పరేషానే! ఇవి వాటంతట అవి మీ జీవితంలోకి ప్రవేశించవు. అవగాహనా రాహిత్యంతో మీరిచ్చే పర్మిషన్లు వాటిని యాక్టివేట్ చేస్తాయి. మనం పడుకున్నప్పుడు కూడా అవి మనల్ని గమనిస్తూ ఉంటాయి. మన మాటలు వింటుంటాయి. మన ఇన్‌బాక్స్‌లో మేసేజ్‌లను చదివేస్తాయి. మన టైమ్ బాగోకపోతే.. 'కంట్రోల్' సినిమాలో లాగా మనకు తెలియకుండానే మెసేజ్‌లకు రిట్కుప్లైలు కూడా ఇచ్చేస్తుంటాయి. మన కమాండ్‌తో పనిచేసే గ్యాడ్జెట్ కేవలం యంత్రం అనుకుంటే పొరపాటే! ఏదైనా యాప్ ఇన్‌స్టాల్ చేసినప్పుడు ఏం ఆలోచించకుండా పర్మిషన్స్ ఇచ్చేస్తుంటాం. విశేష అనుమతులు పొందిన ఏఐని ఆసరాగా చేసుకొని హ్యాకర్లు రకరకాల విన్యాసాలకు పాల్పడుతుంటారు. మీ ముఖాన్ని ఫేక్ చేయొచ్చు, మీ మాటల్ని వింటూ కరెక్ట్‌గా మిమిక్రీ చేయొచ్చు! ఈ రెండూ ఫేక్ చేయగలితే మీ పరిస్థితి 'కంట్రోల్' సినిమాలో కథానాయికలా మారిపోతుంది. దీనికి విరుగుడు డిజిటల్ డిటాక్షన్ మాత్రమే! స్మార్ట్‌ఫోన్ వినియోగాన్ని ఎంత తగ్గించుకుంటే మీరు అంత సేఫ్‌గా ఉన్నట్టు. యాప్‌లు ఇన్‌స్టాల్ చేసేటప్పుడు, వెబ్ సర్వీస్‌లు వినియోగించే ముందు టర్మ్స్ అండ్ కండీషన్స్ ఓపికగా చదవాలి! ఆ ఏం చదువుతాంలే అని ఓకే.. ఓకే.. అనుకుంటూ వెళ్లిపోతే, అసలుకే ఎసరొస్తుంది. సదరు యాప్‌లు, వెబ్ సర్వీస్‌లు బ్యాక్‌గ్రౌండ్‌లో రన్ అవుతూ మిమ్మల్ని వాటి కంట్రోల్‌లోకి తీసుకుంటాయి. అలా జరగొద్దంటే.. ఒక యాప్ ఇన్‌స్టాల్ చేసే క్రమంలో 'ఓకే' అనేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కాదని సామాజిక మాధ్యమాల్లో దుమ్మురేపాలన్న ఆలోచన ధోరణిని తగ్గించుకోవాలి. ఏఐ విప్లవాత్మకంగా విస్తరిస్తున్న తరుణంలో ఫోన్‌ను ఎడాపెడా వాడేసే సంస్కృతిని తగ్గించుకోవాలి. డిజిటల్ అక్షరాస్యత తప్పనిసరి. సమస్య ఏదైనా కుటుంబసభ్యులతో పంచుకోవాలి. లేదంటే.. 'కంట్రోల్' సినిమాలోని కథానాయికలా వర్చువల్ వరల్డ్‌కు సరెండర్ అవ్వాల్సి వస్తుందని గుర్తుంచుకోండి.

# నష్టాల్లో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 74వేల పాయింట్లకు పడిపోయింది. ప్రధాన బెంచ్‌మార్క్ సూచీలన్నీ ప్రారంభంలోనే లాభాలను కోల్పోయాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే.. సెన్సెక్స్ 74,392.54 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 74,401.11 గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 73,770.59 పాయింట్లకు చేరింది. చివరకు 200.85 పాయింట్ల నష్టంతో 73,828.91 వద్ద ముగిసింది. నిఫ్టీ 73.30 తగ్గి.. 22,397.20 పాయింట్ల వద్ద స్థిరపడింది. దాదాపు 1,463 షేర్లు పెరగ్గా.. 2,348 షేర్లు పతనమైంది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, టాటా మోటార్స్, హీరో మోటోకార్ప్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హిందాల్కో ఇండస్ట్రీస్ నష్టపోయాయి. భారత్ ఎలక్ట్రానిక్స్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, సిప్లా, ఎన్‌టీపీసీ లాభపడ్డాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కొక్కటి 0.5 శాతం తగ్గాయి. రంగాల వారీగా చూస్తే ఆటో, ఐటీ, మెటల్, మీడియా, రియాల్టీ 0.5శాతం నుంచి ఒకశాతం పతనం కాగా.. పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ 0.5 శాతం పెరిగాయి.

# యూజర్లకు బీఎస్ఎన్ఎల్ హెూలీ ధమాకా ఆఫర్ ఈ ప్లాన్స్ వ్యాలిడిటీని పెంచిన ప్రభుత్వ టెలికాం సంస్థ




ప్రముఖ ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు 9కోట్లకుపైగా మొబైల్ యూజర్లు ఉన్నారు. వినియోగదారులందరికీ కోసం బీఎస్ఎన్ఎల్ హెూలీ ధమాకా ఆఫర్‌ని ప్రకటించింది. ఈ ఆఫర్ కింద భారీగా రీచార్జ్ ప్లాన్ల చెల్లుబాటును పెంచింది. ఇది వినియోగదారులకు ఎంతో ప్రయోజనకరం చేకూరనున్నది. ఈ ఆఫర్‌ను కంపెనీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ ద్వారా ప్రకటించింది. మార్చి నెలలో యూజర్ల కోసం మరింత ఆకర్షణీయమైన ఆఫర్‌లను తీసుకురావాలని బీఎస్ఎన్ఎల్ యోచిస్తున్నది. పండుగ సీజన్‌లో వినియోగదారులకు ఉత్తమ సేవలను అందించనున్నది. ఇటీవల బీఎస్ఎన్ఎల్ సరసమైన రీచార్జ్ ప్లాన్ ద్వారా ప్రైవేట్ టెలికాం కంపెనీలకు గట్టి సవాల్ విసురుతున్నది.

**హెూలీ ధమాకా ఆఫర్..**

బీఎస్ఎన్ఎల్ హెూలీ సందర్భంగా యూజర్లకు రీచార్జ్ ప్లాన్స్ వాలిడిటీని పెంచింది. బీఎస్ఎన్ఎల్ రూ.2399 ప్రీపెయిడ్ ప్లాన్‌కు 30 రోజుల అదనంగా వ్యాలిడిటీని పెంచింది. గతంలో ఈ ప్లాన్ చెల్లుబాటు 395 రోజులు ఉండగా.. ప్రస్తుతం 425 రోజులకు పెంచింది. ఈ ప్లాన్‌లో భారత్ అంతటా అపరిమిత కాలింగ్ సౌకర్యం అందించనున్నది. అలాగే, ఢిల్లీ, ముంబయిలోని ఎంటీఎన్ఎల్ నెట్‌వర్క్‌లో కూడా ఉచిత కాలింగ్ అందుబాటులో ఉంటుంది. ఈ ప్లాన్‌లో వినియోగదారులు ప్రతిరోజూ 2జీబీ హై స్పీడ్ డేటా, వంద ఉచిత ఎస్ఎంఎస్‌లను పొందవచ్చు. ఇది మొత్తం ప్లాన్ వ్యవధిలో మొత్తం 850 జీబీ డేటా అందుతుంది. దాంతో పాటు బీఎస్ఎన్ఎల్ ఈ ప్లాన్ బీటీవీ ఉచిత సబ్‌స్క్రిప్షన్‌తో కొన్ని ఓటీటీ యాప్‌ల యాక్సెస్ సైతం లభించనున్నది. బీఎస్ఎన్ఎల్ సరసమైన ప్లాన్లను అందించడమే కాకుండా దాని నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలను కూడా బలోపేతం చేస్తోంది. 2025 ప్రథమార్థంలో భారతదేశం అంతటా ఒక లక్ష కొత్త 4జీ మొబైల్ టవర్లను ఏర్పాటు చేయాలని కంపెనీ యోచిస్తోంది. గత సంవత్సరం బీఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా 65వేల కంటే ఎక్కువ 4జీ మొబైల్ టవర్లను ఏర్పాటు చేసింది. మిగతా టవర్లు రాబోయే నెలల్లో అందుబాటులోకి రానున్నాయి. దాంతో వినియోగదారులకు మెరుగైన నెట్‌వర్క్ కనెక్టివిటీని అందించనున్నాయి. బీఎస్ఎన్ఎల్ ఈ కొత్త ప్లాన్స్, నెట్‌వర్క్ విస్తరణ ప్రస్తుత కస్టమర్లకు ప్రయోజనకరంగా ఉండడంతో పోటీ యుగంలో ప్రైవేట్ టెలికాం కంపెనీలకు పెద్ద ఇబ్బందికరంగా మారాయి. ప్రభుత్వ టెలికాం రంగ సంస్థ సేవలను మెరుగుపరిచేందుకు వినియోగదారులకు తక్కువ ధరకే.. అధిక నాణ్యత గల టెలికాం సేవలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొంది.

# సిప్‌లకు తగ్గుతున్న ఆదరణ

## ఫిబ్రవరిలో 26వేల కోట్లకే పరిమితం..




ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ల్లోకి పెట్టుబడులు గత నెల ఫిబ్రవరిలో తగ్గుముఖం పట్టాయి. గతంతో పోల్చితే 26 శాతం పడిపోయి రూ.29,303 కోట్లకే పరిమితమయ్యాయి. అంతకుముందు నెల జనవరిలో రూ.39,688 కోట్లుగా, డిసెంబర్‌లో రూ.41,156 కోట్లుగా ఉండటం గమనార్హం. స్టాక్ మార్కెట్ ఒడుదొడుకుల నడుమ స్మాల్, మిడ్‌క్యాప్ స్కీముల్లో పెట్టుబడులు క్రమేణా క్షీణిస్తున్నట్టు మార్కెట్ నిపుణులు చెప్తున్నారు. ఫిబ్రవరిలో స్మాల్‌క్యాప్‌లోకి ఇన్వెస్ట్‌మెంట్లు రూ.3,406 కోట్లుగా, మిడ్‌క్యాప్‌లోకి రూ.3,722 కోట్లుగా ఉన్నాయి. జనవరిలో ఇవి వరుసగా రూ.2,866 కోట్లు, రూ.3,063 కోట్లుగా ఉన్నాయి. ఇక సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ల (సిప్)లోకి గత నెల వచ్చిన పెట్టుబడుల విలువ రూ.25,999 కోట్లుగా ఉన్నది. అయితే ఇది మూడు నెలల కనిష్ఠం. జనవరిలో రూ.26,400 కోట్లు, డిసెంబర్‌లో రూ.26,459 కోట్లుగా ఉన్నాయి. కాగా, థీమ్యాటిక్ ఫండ్స్‌లోకి రూ.5,711 కోట్లు, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్స్‌ల్లోకి రూ.5,104 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఈక్విటీలు కాకుండా గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)ల్లోకి ఫిబ్రవరిలో రూ.1,980 కోట్ల పెట్టుబడులు రాగా, జనవరిలో ఇవి రూ.3,751 కోట్లుగా ఉండటం గమనార్హం. డెట్ మ్యూచువల్ ఫండ్స్ నుంచి మాత్రం ఫిబ్రవరిలో రూ.6,525 కోట్లు తరలిపోయాయి.

# కోరమాండల్ చేతికి ఎన్ఏసీఎల్

Coromandel

ప్రముఖ ఎరువుల తయారీ సంస్థ కోరమాండల్ ఇంటర్నేషనల్.. హైదరాబాద్‌కు చెందిన ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్‌ను హస్తగతం చేసుకోబోతున్నది. రూ.820 కోట్లతో 53 శాతం వాటాను కొనుగోలు చేసిన సంస్థ..మరో 26 శాతం అదనపు వాటాను ఒపెన్ ఆఫర్ ద్వారా కొనుగోలు చేయడానికి సిద్ధమైంది. ఈ విషయాన్ని సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. 53.13 శాతం వాటాకు సమానమైన 10,68,96,146 ఈక్విటీ షేర్లను కొనుగోలు చేయడానికి కంపెనీ బోర్డు అనుమతినిచ్చింది. ఇందుకు సంబంధించి కోరమాండల్ ఇంటర్నేషనల్, ఎన్ఏసీఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, కే లక్ష్మి రాజు(ప్రమోటర్), బ్రైట్ టౌన్ ఇన్వెస్ట్‌మెంట్ అడ్వయిజర్ ప్రైవేట్ లిమిటెడ్‌లు వాటా కొనుగోలు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కొనుగోలు ఒప్పందం వచ్చే కొన్ని నెలల్లో ముగియనున్నదని కోరమాండల్ వర్గాలు వెల్లడించాయి.

# మళ్లీ అమ్మకానికి ఎల్ఐసీ వాటా

## మళ్లీ అమ్మకానికి ఎల్ఐసీ వాటా
## 3 శాతం వరకు విక్రయించే యోచనలో కేంద్రం
## రెండేండ్లలో 10 శాతం సేల్ లక్ష్యం




ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసీ)లో మరింత వాటాలను అమ్మేందుకు మోదీ సర్కారు సిద్ధమవుతున్నది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో మార్కెట్ పరిస్థితులనుబట్టి 2 నుంచి 3 శాతం వాటాలను విక్రయించాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు సమాచారం. అంటే స్టాక్ మార్కెట్లు నష్టాల్లో నడిస్తే తక్కువగా, లాభాల్లో పరుగులు పెడితే ఎక్కువగా ఎల్ఐసీ నుంచి ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణలు ఉంటాయన్నమాట.

**2027కల్లా 10 శాతం..**

రాబోయే ఆర్థిక సంవత్సరంలో ఒకేసారి పెద్దమొత్తంలో కాకుండా కొద్దికొద్దిగానైనా ఎక్కువసార్లు వాటాలను అమ్మకానికి పెట్టి వీలున్నంత గరిష్ఠంగా సొమ్ము చేసుకోవాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తున్నది. ఇక 2027 మే 16కల్లా ఎల్ఐసీలో 10 శాతం వాటాను ఎట్టి పరిస్థితుల్లోనైనా అమ్మేయాలని కేంద్రం భావిస్తున్నది. స్టాక్ మార్కెట్ రెగ్యులేటర్ సెబీ మినిమం పబ్లిక్ షేర్‌హెూల్డింగ్ నిబంధనల్ని అందుకోవాలంటే ఇది తప్పనిసరి. 2022 మే నెలలో ఎల్ఐసీలో 3.5 శాతం వాటాను ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా కేంద్రం అమ్మేసిన విషయం తెలిసిందే. తద్వారా రూ.21,000 కోట్లను ఖజానాకు తరలించగా, దేశీయ స్టాక్ మార్కెట్లలోకి ఎల్ఐసీ అడుగు పెట్టింది. అయితే మినిమం పబ్లిక్ షేర్‌హెూల్డింగ్ రూల్స్‌ను కంపెనీ పాటించలేపోతున్నది. ఈ నేపథ్యంలోనే మూడేండ్ల గడువు లభించింది. ఇది 2027 మే 16తో ముగియనున్నది. ఈలోపు ఎల్ఐసీలో 10 శాతం ప్రభుత్వ వాటాలను అమ్మాలని చూస్తున్నారు. ఇందులో భాగంగానే ఈ ఏప్రిల్‌తో మొదలయ్యే ఏడాదిలో 3 శాతం మేర వాటాలను విక్రయించాలని చూస్తున్నారు.

**మరికొన్నింటిలో..**

వచ్చే మూడేండ్లకుపైగా కాలంలో ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ ప్రణాళికలో భాగంగా ఎల్ఐసీతోపాటు పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లోనూ వాటాలను అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఆయా కంపెనీల జాబితాను కూడా సిద్ధంగా ఉంచినట్టు చెప్తున్నారు. ఈ క్రమంలోనే ఇందుకోసం మర్చంట్ బ్యాంకర్లు, లీగల్ అడ్వైజర్ల సహాయార్థం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ శాఖ (దీపం) దరఖాస్తులను ఆహ్వానించింది.

**నష్టాల్లో ఎల్ఐసీ షేర్లు**

గడిచిన ఏడాదికిపైగా కాలంలో ఎల్ఐసీ షేర్ విలువ 23.29 శాతం క్షీణించడం గమనార్హం. గత ఆరు నెలల్నే తీసుకుంటే 26.66 శాతం పతనం కనిపిస్తున్నది. ఈ నెల రోజుల్లోనే 3.37 శాతం పడిపోయింది. దీంతో ఎల్ఐసీ షేర్లలో పెట్టుబడులు పెట్టిన మదుపరులకు నష్టాలే మిగులుతున్నట్టవుతున్నది. నిజానికి దేశంలోనే అతిపెద్ద సంస్థాగత మదుపరి ఎల్ఐసీ. వందలాది కంపెనీల్లో ఎల్ఐసీకి వాటాలున్నాయి. అయితే స్టాక్ మార్కెట్లు గతకొద్ది నెలలుగా నేలచూపుల్నే చూస్తుండటంతో ఈ వాటాలు కాస్తా ఆవిరైపోతున్నాయి. భారీ ఎత్తునే నష్టాలను మూటగట్టుకోవాల్సి వస్తున్నది. దాంతో స్టాక్ మార్కెట్ల వల్ల అటు బయటి కంపెనీల్లో పెట్టుబడులు, ఇటు సొంతంగా షేర్లు దిగజారిపోతుండటం.. ఎల్ఐసీ పాలసీదారులనూ కలవరపెడుతున్నదిప్పుడు.

# అమెరికాతో అంటకాగొద్దు

## కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశానికి నష్టమే
## ట్రంప్ ఒత్తిళ్లకు మోదీ తలొగ్గడం దురదృష్టకరం
## అగ్రరాజ్యం స్వార్థ ప్రయోజనాలను గుర్తించాలి
## ప్రముఖ రాజకీయ-ఆర్థిక విశ్లేషకులు డీ పాపారావు



ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇప్పుడు అమెరికా భయం పట్టుకుంది. ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలకు దిగుతుండటమే ఇందుకు కారణం. ఇరుగుపొరుగు దేశాలకు ఇప్పటికే సుంకాల సెగను తగిలించిన ట్రంప్.. వచ్చే నెల నుంచి భారత్‌కూ అది తప్పదని ప్రకటించేశారు. ఇక మన పొరుగు దేశం చైనాతో అమెరికా ఎప్పుడూ కాలు దువ్వుతూనే ఉంటుంది. ఇందుకు అనేక సమీకరణాలున్నాయి. ఈ విషయంలో ట్రంప్ రెండాకులు ఎక్కువే చదువుకున్నారు. అందుకే తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడైనా లేక మలిసారి అధ్యక్షుడిగా ఎన్నికై వచ్చినా చైనాపై గుడ్లురిమే చూస్తున్నారు. కానీ ఇక్కడ నొక్కిమరీ చెప్పుకోవాల్సిందేమిటంటే.. అమెరికా, ముఖ్యంగా ట్రంప్ నాకు ప్రాణమిత్రుడంటూ ప్రధాని నరేంద్ర మోదీ తిరుగుతున్నా.. భారత్‌పై సుంకాల సమరానికి తెర లేవడమే. ఇదే అంశంపై ప్రముఖ రాజకీయ-ఆర్థిక విశ్లేషకులు డీ పాపారావు 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా మాట్లాడారు.

**ఇదీ సంగతి..**

అన్ని దేశాలను చూసినట్టుగానే ట్రంప్ భారత్‌నూ చూస్తున్నారు. కానీ ఇది అర్థం కాని మన పాలకులు ట్రంప్ సేవలో తరించిపోతున్నారు. ఆయన అడుగులకు మడుగులొత్తుతూ వంగివంగి దండాలు పెట్టడమే కాదు.. సాష్టాంగపడిపోతుండటం నిజంగా దురదృష్టకరం. అమెరికా-భారత్ రాజకీయాల్లో భావసారూప్యత కలిగిన రిపబ్లికన్ పార్టీ, బీజేపీలకు పెద్దలుగా ఉన్న ట్రంప్, మోదీలు.. అంతర్జాతీయ వేదికలపై చెట్టాపట్టాలేసుకుని తిరిగినా భారత్‌ను ఓ అవసరంగా అగ్రరాజ్యం చూస్తున్నదే తప్ప మరొకటి కాదు. ప్రధానంగా అన్నింటా తమ ఆధిపత్యానికి అడ్డుగా వస్తున్న చైనాను దెబ్బతీయాలంటే ప్రత్యామ్నాయం భారతేనని అమెరికాకు బాగా తెలుసు. అయితే చైనాతో మనకున్న (బీజేపీ భావజాలం) విభేదాల దృష్ట్యా అమెరికాను గుడ్డిగా అనుసరిస్తుండటమే కేంద్ర ప్రభుత్వం చేస్తున్న తప్పు అని చెప్పక తప్పదు. చైనాపై అమెరికాకున్న కసి తీరితే.. అప్పుడు భారతే టార్గెట్ అన్నది మరువద్దు. నిజానికి ట్రంప్ తమ దేశ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారుగానీ భారత్‌కు ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా చేస్తున్న మేలేమీ లేదు. మొదట్నుంచీ ట్రంప్ వైఖరి 'మీ ఇంటికొస్తే ఏం ఇస్తారు.. మా ఇంటికొస్తే ఏం తెస్తారు' అన్నట్టుగానే ఉంటున్నది. తాను చెప్పదల్చుకున్నది ట్రంప్ సూటిగా చెప్తున్నా.. చైనాపై అమెరికా సుంకాలు పెంచితే ఏర్పడే వాణిజ్య యుద్ధం మనకు కలిసొస్తుందేమోనన్న భ్రమలో భారత్ ఉండటం చాలా విచారకరమే. ట్రంప్ టారిఫ్‌లతో భారతీయ ఫార్మా రంగానికి ఎదురుదెబ్బే. ఇక్కడి నుంచి ఎగుమతి అవుతున్న జనరిక్ ఔషధాలతో అమెరికన్ల వైద్య ఖర్చులు గణనీయంగా తగ్గిపోతున్నాయి. అయినప్పటికీ మా దేశంలోకి వచ్చే ఫార్మా దిగుమతులపై సుంకాలు పెంచుతామని ట్రంప్ చెప్పడం.. దానికి బెంబేలెత్తిపోయి అమెరికా నుంచి దిగుమతి అవుతున్న వస్తూత్పత్తులపై సుంకాలను తగ్గించడం, మరికొన్నింటినీ పరిశీలిస్తుండటం మోదీ సర్కారు అపరిపక్వతకు నిదర్శనం. పైగా ట్రంప్ ఒత్తిళ్లకు తలొగ్గి అవసరం లేకున్నా, నష్టమని తెలిసినా.. అమెరికా నుంచి రక్షణ, చమురు దిగుమతుల్ని చేసుకోవాలనుకోవడం భారత ఆర్థిక వ్యవస్థకే ముప్పు. రష్యా, అరబ్ దేశాలతో పోల్చితే అమెరికాలోని శిలాజ ఇంధనం ఖరీదెక్కువ. అయితే 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యం 500 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని అమెరికా-భారత్ భావిస్తున్న నేపథ్యంలో మనపై ఈ భారం తప్పేట్టు లేదు. మన దగ్గర్నుంచి ఏం కొంటామన్నది చెప్పని ట్రంప్ సర్కారు.. మా దగ్గర్నుంచి మాత్రం ఇంత కొనాలని భారత్‌ను ఆదేశిస్తుండటం అమెరికా ఆధిపత్య ధోరణికి నిలువుటద్దమే.

**అన్నింటా వైఫల్యం**

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అమలు, పాత పెద్ద నోట్ల రద్దు నిర్ణయం, కరోనాను ఎదుర్కోవడం, ద్రవ్యోల్బణం అదుపు, నిరుద్యోగం ఇలా చెప్పుకుంటూపోతే గడిచిన దాదాపు పదకొండేండ్లలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అన్నింటా విఫలమైందనే చెప్పవచ్చు. చివరకు 'మేక్ ఇన్ ఇండియా' అంటూ తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రకటించిన పీఎల్ఐ స్కీమ్ కూడా దాదాపు ఉత్తదే అని తేలిపోయింది. ఇప్పుడు ట్రంప్ టారిఫ్‌లను పెంచితే భారత్‌లో తయారై అమెరికాకు ఎగుమతి అవుతున్నవన్నీ ఒక్కసారిగా పిరమైపోతాయి. ముఖ్యంగా దేశంలో తయారవుతున్న స్మార్ట్‌ఫోన్లకు అమెరికాలో ధరలు పెరిగి గిరాకీ తగ్గిపోతుంది. ఇదే జరిగితే ఇక్కడున్న యాపిల్ (ఐఫోన్) తదితర సంస్థలన్నీ వెనక్కిపోవడం ఖాయమే. అల్యూమినియం, ఉక్కు మరికొన్నింటిపైనా సుంకాల భారం తప్పడం లేదు. కాబట్టి స్పష్టంగా చెప్పాలంటే ట్రంప్ టారిఫ్‌లతో భారత్‌కే ఎక్కువ నష్టం. అమెరికా నిర్ణయాలకు చైనా గట్టిగా స్పందిస్తుండటంతో దానికొచ్చే నష్టమేమీ లేదు. ఎటొచ్చి అటు అమెరికాకు, ఇటు చైనాకు దగ్గర కాలేక రెంటికీ చెడ్డ రేవడిలా మిగిలేది భారతే. ఈ ట్రేడ్ వార్‌తో చైనా నుంచి పరిశ్రమలు భారత్‌కు వచ్చినా.. అవే సుంకాలు ఇక్కడా ఉన్నందున కార్పొరేట్లు ఆఖరుకు అమెరికాకే వెళ్లిపోయే వీలున్నది. అయితే వాణిజ్యం విషయంలో కలిసి నడుద్దామంటూ ముందుకొచ్చిన చైనాతో భారత్ జట్టు కడితే లాభదాయకమనే చెప్పవచ్చు. సుంకాల సెగను తప్పించేందుకు ఆగమేఘాలపై అమెరికాకు వెళ్లిన మన వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్‌తో ఒనగూరిందేమీ లేదు మరి. మొత్తానికి ట్రంప్ ధృతరాష్ట్ర కౌగిలి నుంచి మోదీ బయటపడితేనే భారత్‌కు భవిష్యత్తు. దేశ ప్రయోజనాలను ఫణంగా పట్టైనా, పార్టీ ప్రయోజనాలను చూసుకుంటే మాత్రం అంతకన్నా ఘోర తప్పిదం మరొకటి ఉండదు.

**జీటీఆర్ఐదీ ఇదే మాట..**

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులకు మోదీ సర్కారు అనవసరంగా భయపడిపోతున్నదని అంతర్జాతీయ ఆర్థిక విశ్లేషణ సంస్థ గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అభిప్రాయపడుతున్నది. ట్రంప్ టారిఫ్‌లకు బెంబేలెత్తిపోయి చర్చలు జరుపాల్సిన పనిలేదని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాత్సవ అంటున్నారు. చైనా, కెనడా, యూరోపియన్ యూనియన్ దేశాలు స్పందిస్తున్నట్టుగానే ట్రంప్ సుంకాల విషయంలో భారత్ వైఖరి ఉండాలని సూచించారు. అమెరికా మోటర్‌సైకిళ్లు తదితరాలపై సుంకాలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో జీటీఆర్ఐ వ్యాఖ్యలు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి. అమెరికా ప్రయోజనాలు ఎక్కువగా ఉండేలా ట్రంప్ చేస్తున్న ఒత్తిళ్లకు భారత ప్రభుత్వం తలొగ్గితే నష్టమేనంటున్న ఆయన.. తప్పుడు గణాంకాలు, సమాచారంతో ట్రంప్ సర్కారు లేనిపోని విమర్శలకు దిగుతున్నదని మండిపడ్డారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అమెరికా డిమాండ్లను ప్రాధాన్యతాంశంగా పరిగణిస్తుండటం ఇప్పుడు పెద్ద ఎత్తున విమర్శలకు తావిస్తున్నది.

# ఇండస్‌ఇండ్ లెక్కల్లో 2,100 కోట్లు తేడా




## డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో బయటపడ్డ వైనం
## ఒక్కరోజే 27 శాతానికిపైగా పడిపోయిన బ్యాంక్ షేర్ విలువ

దేశంలోని టాప్-5 ప్రైవేట్ రంగ బ్యాంకుల్లో ఒకటైన ఇండస్‌ఇండ్ బ్యాంక్ లెక్కల్లో ఏకంగా రూ.2,100 కోట్ల తేడా బయటపడింది. గత ఏడాది డిసెంబర్ నాటికున్న బ్యాంక్ నికర విలువలో ఇది దాదాపు 2.35 శాతానికి సమానం కావడం గమనార్హం. కాగా, డెరివేటివ్ పోర్ట్‌ఫోలియోలో ఈ వ్యత్యాసాన్ని బ్యాంక్ గుర్తించింది. నిరుడు సెప్టెంబర్, అక్టోబర్ అకౌంటింగ్‌లో తప్పుల్ని కనుగొన్నామని, గత వారమే ఈ విషయాన్ని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)కు ప్రాథమికంగా తెలియపర్చామని బ్యాంక్ సీఈవో, ఎండీ సుమంత్ కత్‌పాలియా తాజాగా తెలిపారు. అయితే బ్యాంక్ లాభాలు, మూలధనం దృష్ట్యా సదరు రూ.2,100 కోట్లను సర్దుబాటు చేసుకునే సామర్థ్యం తమకున్నదని చెప్పినా.. స్టాక్ మార్కెట్లలో మదుపరుల భయాలను అడ్డుకోలేకపోయారు. మంగళవారం ట్రేడింగ్‌లో అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)ల్లో 27 శాతానికిపైగా ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్ విలువ దిగజారింది. బీఎస్ఈలో 27.17 శాతం కోల్పోయి రూ.655.95 వద్ద ముగియగా, ఒకానొక దశలో 52 వారాల కనిష్ఠాన్ని తాకుతూ రూ.649కి పతనమైంది. ఎన్ఎస్ఈలోనూ 27.06 శాతం నష్టపోయి రూ.656.80 వద్ద నిలిచింది. నిజానికి సోమవారమే ఈ సమాచారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలియపర్చగా.. లెక్కల్లో అసలు తేడా ఎంతన్నది వచ్చే నెల్లోగానీ తెలియకుండా ఉన్నది. ఓ బయటి ఏజెన్సీతో బ్యాంక్ విచారణ జరిపిస్తున్నది. ఆ నివేదిక వస్తేగానీ అకౌంటింగ్‌లో కచ్చితమైన వ్యత్యాసం వెలుగుచూడదు.

**అసలేం జరిగింది..**

గడిచిన ఫారెక్స్ లావాదేవీలకు సంబంధించి హెడ్జింగ్ ఖర్చుల్ని బ్యాంక్ తక్కువగా అంచనా వేసినట్టు ఓ అంతర్గత సమీక్షలో తేలింది. దీనివల్ల రూ.2,100 కోట్ల వరకు లెక్కల్లో వ్యత్యాసం వచ్చింది. దీన్ని చక్కదిద్దేంత మూలధనం ఉందని చెప్పినా ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున అమ్మకాలకు తెగబడ్డారు. బ్యాంకులో పాలనాపరమైన లోపాలున్నాయన్న ఆందోళనలు మదుపరుల్లో నెలకొన్నాయి. గత వారం బ్యాంక్ సీఈవో, ఎండీ కత్‌పాలియా పదవీకాలాన్ని మూడేండ్లకు పెంచుతూ ఇండస్‌ఇండ్ బ్యాంక్ బోర్డు ప్రతిపాదించినా, ఆర్బీఐ మాత్రం ఏడాదికే అనుమతిచ్చింది. దీంతో సోమవారం బ్యాంక్ షేర్ 4 శాతం వరకు నష్టపోయింది. ఈ క్రమంలో మంగళవారం ఏడాది కనిష్ఠానికి క్షీణించింది.

## పిడికిళ్లు ఎత్తితే సంకెళ్లు వేస్తారా?



ఒక వైపు అధికార కాంగ్రెస్ 'ప్రజాస్వామ్య పునరుద్ధరణ' తమ 7వ గ్యారెంటీగా నిత్యం ప్రకటిస్తుండగా, మరోవైపు రాష్ట్ర రాజధాని నడిబొడ్డున వందేండ్ల చరిత్ర కలిగిన ఉస్మానియా యూనివర్సిటీలో 'ప్రజాస్వామిక హక్కుల'పై ఆంక్షలు విధించడం తీవ్ర చర్చకు దారితీస్తున్నది. చదువుతూనే పోరాటాలకు ఊపిరులూదిన చరిత్ర ఓయూ విద్యార్థుల సొంతం. నాటి వందేమాతర ఉద్యమం నుంచి మలి తెలంగాణ ఉద్యమం దాకా ఓయూ గడ్డ ముఖ్య భూమిక పోషించింది. ఉమ్మడి ఏపీలో ఇలాంటి నిషేధాజ్ఞలు విధిస్తే మలిదశ తెలంగాణ ఉద్యమం మహోద్యమంగా రూపాంతరం చెందేదా ? ఒక్కసారి ఆలోచించండి. శాంతియుత పద్ధతుల్లో నిరసన తెలపడం ప్రజాస్వామిక హక్కు. ఈ విషయం అధికారులు, పాలకులు గుర్తెరగాలి. సమాజ ప్రగతికి వర్సిటీ విద్య ఎంతగానో దోహదపడుతుంది. ప్రస్తుతం సమస్యల వలయంలో చిక్కుకున్న వర్సిటీలను ప్రక్షాళన చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతించాల్సిందే. కానీ, ఓయూలో విద్యారంగ సమస్యలపై విద్యార్థులు గొంతు ఎత్తవద్దు (నిరసనలు, నినాదాలు, ఆందోళనలు నిషేధం), ఎత్తితే కఠిన చర్యలుంటాయని ఓయూ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గం. ఇది సీఎం రేవంత్‌కు తెలియకుండా జరిగే అవకాశం ఉండకపోవచ్చు. ఎందుకంటే కీలక విద్యాశాఖ ఆయన వద్దే ఉన్నది. ఓయూ ప్రాంగణంలోని కళాశాలలు, వసతిగృహాల్లో సమస్యలు బలంగా తిష్ఠ వేశాయి. ప్రభుత్వం గత, ప్రస్తుత బడ్జెట్‌లో సైతం వర్సిటీలకు అరకొర నిధులు కేటాయించి చేతులు దులుపుకోవడం గమనార్హం. అంతేకాకుండా ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో నూతన విశ్వవిద్యాలయాల ఏర్పాటు అంశం అటకెక్కింది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిబంధనల ప్రకారం ప్రతి డిపార్ట్ మెంట్‌లో నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఒక ప్రొఫెసర్ పోస్టుండాలి. కానీ, ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా మహిళా (వీరనారీ చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం) వర్సిటీతో కలుపుకొని మొత్తం 12 వర్సిటీల్లో 70 శాతం బోధనా సిబ్బందితో పాటు బోధనేతర సిబ్బంది పోస్టులు వేల సంఖ్యలో ఖాళీగా ఉన్నాయి. కాంట్రాక్టు, పార్ట్‌టైం అధ్యాపకులకు ఉద్యోగ భద్రత లేదు, అరకొర వేతనాలతో వారు కుటుంబాలను పోషించుకునే దుర్భర పరిస్థితి ఏర్పడింది. సీనియర్ ఫ్యాకల్టీ లేకపోవడంతో పరిశోధనలు ముందుకు సాగడం లేదు. మౌలిక వసతుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. విద్యార్థులు తినే ఆహారంలో పురుగులు, బ్లేడ్లు దర్శనమిస్తున్నాయి. ఫలితంగా విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఆ సమస్యల ప్రభావం చదువులపై పడుతున్నది. 'పట్టాలు పొందే సంగతేమో గానీ, సురక్షితంగా బయటపడితే చాలన్నట్టుగా' పలు హాస్టళ్లలో పరిస్థితి దాపురించింది. పరీక్షా ఫీజులు అమాంతంగా పెరిగాయి. విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల మంజూరులో కూడా అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ప్రైవేటు వర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను సంపూర్ణంగా అమలుచేయడం లేదు. తక్షణమే వర్సిటీలను ప్రక్షాళన చేయాలని సూచిస్తూ ఇటీవలే రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ ప్రభుత్వానికి తమ నివేదికను సైతం అందించింది. హక్కుల కోసం ఉద్యమిస్తే దివ్యాంగ విద్యార్థులను అరెస్టు చేయించడం బాధాకరం. గ్రంథాలయాల్లో సమస్యలు పేరుకుపోయాయి. పరిసరాల్లో రక్షణ కొరవడింది. పైన పేర్కొన్న సమస్యలను పరిష్కరించాలంటూ.. 'భారత రాజ్యాంగం'లోని ఆర్టికల్-19కు లోబడి శాంతియుత మార్గంలో పలుమార్లు విద్యార్థులు నినదించారు, నిరసన తెలిపారు. ఇదెలా 'ప్రతికూల ప్రభావం' అవుతుంది? చదువుతూ పోరాడటం తప్పా? నినదిస్తే సంకెళ్లు వేస్తారా? ఇటీవల నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)-2024 కింద కేంద్ర ఉన్నత విద్యాశాఖ విడుదల చేసిన ఓవరాల్ విభాగం జాబితాలో వందేండ్ల చరిత్ర కలిగిన ఓయూ 70వ స్థానానికి దిగజారిన విషయం తెలిసిందే. సమస్యలు పరిష్కరించమని వినతులు 'వీసీకిచ్చినా.. ఆ 'మూసీకిచ్చినా ఒక్కటే' అని దివంగత కవి అలిశెట్టి ప్రభాకర్ ఓ సందర్భంలో మినీ కవిత రాశారు. ఇప్పుడు అది అబద్ధమని ప్రస్తుత వీసీ నిరూపించాల్సిన అవసరం ఉన్నది. ఓయూ ప్రాంగణంలోని కళాశాలలు, విభాగాల పరిసరాల్లో ధర్నాలు, ఆందోళనలు, నినాదాలు నిషేధమంటూ జారీచేసిన ఉత్తర్వును తక్షణమే రద్దుచేయాలి. తన ప్రమాణ స్వీకారం రోజునే 'ప్రగతి భవన్' కంచెలు తొలగించి 'ప్రజాపాలన'ను ప్రారంభించామంటూ ప్రగల్భాలు పలుకుతున్న సీఎం రేవంత్ ఈ అంశంపై స్పందించి, ఇలాంటి అప్రజాస్వామిక చర్య పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలి. లేకుంటే న్యాయమైన హక్కుల సాధన కోసం విద్యార్థులు మహోద్యమాలకు శ్రీకారం చుట్టాల్సిన పరిస్థితి అనివార్యం అవుతుంది.

## బీర్‌ను సేవిస్తే లాభమా..? నష్టమా..? ప్రయోజనాలు కలగాలంటే ఎంత తాగాలి..?



వేసవి కాలం వచ్చిందంటే చాలు.. మద్యం ప్రియులు బీర్లను అధికంగా సేవిస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. ఎర్రని ఎండలో చల్లని బీర్ తాగితే వచ్చే మజాయే వేరని చెప్పి మద్యం ప్రియులు బీర్లను తాగుతుంటారు. అయితే ఆరోగ్య పరంగా చూస్తే మోతాదులో బీర్ తాగితే లాభాలే పొందవచ్చని, కానీ అతిగా మాత్రం దీన్ని సేవిస్తే లాభాలు కలగకపోగా, నష్టాలు కలుగుతాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బీర్ ప్రపంచ వ్యాప్తంగా చాలా పాపులర్ అయిన ఆల్కహాలిక్ బేవరేజ్‌గా ప్రసిద్ధి చెందింది. బీర్ తాగడం వల్ల పలు లాభాలు ఉంటాయని కొందరు ఆరోగ్య నిపుణులు చెబుతుంటారు. బీర్‌ను సేవిస్తే శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. శరీరం అంతర్గతంగా క్లీన్ అవుతుంది. అలాగే కిడ్నీ స్టోన్స్ కూడా కరిగిపోతాయి.

### మోతాదు మించకూడదు..

బీర్ వల్ల అందానికి కూడా ప్రయోజనం కలుగుతుంది. బీర్‌ను కొందరు చర్మానికి నేరుగా అప్లై చేస్తారు. దీంతో ముఖంలో కాంతి పెరుగుతుంది. కొందరు జుట్టుకు కూడా అప్లై చేస్తారు. ఇది శిరోజాలను కాంతివంతంగా మారుస్తుంది. బీర్‌ను అధికంగా సేవిస్తే శరీరానికి హాని కలుగుతుంది. ముఖ్యంగా బరువు పెరుగుతారు. లివర్ చెడిపోతుంది. కాబట్టి మితంగా తీసుకోవాలని సూచిస్తున్నారు. వారానికి రెండు సార్లు ఒక గ్లాస్ చొప్పున బీర్ తాగవచ్చని ఆరోగ్య నిపుణుల అభిప్రాయం. ఇంతకు మించితే దుష్పరిణామాలు ఎదురవుతాయని చెబుతున్నారు. కొందరు మాంసాన్ని మారినేట్ చేసేందుకు బీర్‌ను కూడా ఉపయోగిస్తారు. దీంతో ముక్కలు టేస్టీగా ఉండడమే కాదు, మెత్తగా కూడా ఉడుకుతాయి.

### పొట్టలోని అసౌకర్యానికి..

కడుపు నొప్పిగా ఉన్నప్పుడు ఒక బీర్ తాగితే పోతుందట. బీర్ సహజంగానే కార్బొనేటెడ్ డ్రింక్. కనుక పొట్టలో ఏర్పడే అసౌకర్యాన్ని ఇది తగ్గిస్తుంది. గ్యాస్, అల్సర్ ఉన్నవారు మాత్రం ఈ చిట్కా ప్రయోగించకూడదు. ఒక శుభ్రమైన వస్త్రాన్ని బీర్‌లో ముంచి ఆ వస్త్రంతో బంగారు నగలను తుడిస్తే అవి తళతళా మెరిసిపోతాయి. చర్మాన్ని మృదువుగా ఉంచడంలోనూ బీర్ పనిచేస్తుంది. బీర్‌ను స్నానం చేసే నీటిలో కాస్త పోసి స్నానం చేస్తే చర్మం మంచి నిగారింపును సొంతం చేసుకుంటుంది. రొయ్యల్ని వండేటప్పుడు కాస్త బీర్ చల్లితే కూర రుచిగా ఉంటుంది. అయితే బీర్ చల్లిన తరువాత ఏ కూరను అయినా సరే అతిగా ఉడికించకూడదు. లేదంటే చిదురు అయ్యే అవకాశాలు ఉంటాయి.

### శిరోజాలు, చర్మానికి..

బీర్ వల్ల శిరోజాలకు కూడా ఎంతో మేలు జరుగుతుంది. దీన్ని జుట్టుకు అప్లై చేస్తే మంచి కండిషనర్‌గా పనిచేస్తుంది. బీర్ తాగితే చర్మం తేమగా మారుతుంది. మృదువుగా ఉంటుంది. చర్మ కాంతి పెరుగుతుంది. అధిక వేడి వల్ల చర్మం రక్షించబడుతుంది. కొన్ని దేశాలకు చెందిన వారు తరచూ బీర్ బాత్ చేస్తుంటారు. బీర్‌తో స్నానం చేయడం వల్ల చర్మం ఆరోగ్యంగా ఉంటుందని నమ్ముతారు. బీర్‌ను సేవిస్తే చర్మం పీహెచ్ విలువ సరైన స్థితిలో ఉంటుంది. దీంతో చర్మం నిగారింపును సొంతం చేసుకుంటుంది. బీర్ వల్ల వయస్సు మీద పడడం కనబడదు. వృద్ధాప్య చాయలను బీర్ కనిపించనివ్వదు. బీర్‌లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్య ముడతలను తగ్గిస్తాయి. చర్మం వాపులకు గురి కాకుండా కాపాడుతాయి. ఇలా బీర్‌తో పలు ప్రయోజనాలను పొందవచ్చు. కానీ మోతాదులో సేవిస్తేనే ఈ లాభాలు ఉంటాయి.

# దక్షిణాది గొంతు నులుముతున్న డీ లిమిటేషన్



ఈస్టిండియా పాలకులు భారతదేశాన్ని నాడు తమ వలస (బానిస) దేశంగా రూపొందించుకున్నారు. అంటే పాలిచ్చే పాడి ఆవుగా తమ గాటన కట్టేసుకున్నారు. భారతీయులనే లేగదూడల గొంతు తడుపుతూ కడవల కొద్దీ పాలు పితికి తమ దేశానికి కబళించుకువెళ్లారు. నేడు దక్షిణ భారతాన్ని తమ పాడి పశువుగా రూపొందించుకొని 'ఒక దేశం -ఒకే భాష -ఒకే జీఎస్టీ -ఒకే ఎన్నిక -ఒకే జాతీయ విద్యా విధానం -డీ లిమిటేషన్' అనే లింకుల గొలుసుతో నార్త్ ఇండియా పాలకులు తమ గాటన కట్టేసుకోబోతున్నారని వాపోతున్నారు దక్షిణ భారతీయులు. 'జనాభాను నియంత్రించండి! దేశాభివృద్ధికి తోడ్పడండి!' అన్న నాటి కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం, కుటుంబ నియంత్రణను పాటించటమే కాదు, గణనీయ ఆర్థికాభివృద్ధినీ సాధించాయి దక్షిణ భారత రాష్ట్రాలు. కానీ, అవిద్య, అంధ విశ్వాసాలలో కూరుకుపోయి, జనాభా నియంత్రణను పాటించని కారణంగా అత్యధిక జనాభాకు, పేదరికానికి నిలయాలయ్యాయి ఉత్తర భారత రాష్ట్రాలు. నేడు 'ఆదాయం కొద్దీ జీఎస్టీ- జనాభా కొద్దీ ఆదాయం పంపిణీ' అంటూ%ొ% 1.రూపాయి జీఎస్టీని అందిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు అందులోనుంచి సగటున 0-30 పైసలు విదిల్చుతున్నారు. అదే రూపాయినందిస్తున్న ఉత్తరాది రా ష్ట్రాలకు వారిచ్చిన రూపాయికి అదనంగా 3 రూపాయలు కలిపి, సగటున 4 రూపాయలు కట్టబెడుతున్నారు నార్తిండియా పాలకులు. నాటి కేంద్ర ప్రభుత్వ ఆదేశాన్ని పాటించినందుకు, దక్షిణాది రాష్ట్రాలకు వారు విధిస్తున్న కఠి న శిక్ష అని వాపోతున్నాయి దక్షిణ భారత రాష్ట్రా లు. 2.ఒకే జాతీయ విద్యావిధానం పేరిట, హిందీ భాషా సంస్కృతులతో దక్షిణాది భాషా సంస్కృతులపై దాడి పూనుకోవటం మరో శిక్ష. 3.తమ చేతి రిమోట్ లాంటి గవర్నర్ల నియామకం ద్వారా దక్షిణ భారత రాష్ట్ర ప్రభుత్వాలను శాసించటం, ఇంకో శిక్ష. 4.రేపో, మాపో 'డీ లిమిటేషన్' అంటే, జనాభా ప్రాతిపదికన 'ఎంపీ' సీట్ల పెంపు పేరిట, అధిక జనాభా గల ఉత్తరాది హిందీ రాష్ట్రాలలో భారీగా ఎంపీ సీట్లను పెంచుకొని, తద్వారా ఎ.దక్షిణ భారత ఎంపీలతో పనిలేకుండానే అధికారాన్ని చేయటం. బీ.దక్షిణ భారత గొంతును పార్లమెంట్‌లో వినపడకుండా చేయటం. సీ.దక్షిణ భారతాన్ని అణచివేసే చట్టాలను, సంఖ్యాబలం, లేమితో వాటిని అడ్డుకోలేని బలహీన రాష్ట్రాలుగా రూపొందించి, దక్షిణ భారతాన్ని తమ పాడి పశువుగా రూపొందించుకోవాలనుకోవటం అతి పెద్ద శిక్ష. ఇప్పటికే 1.కడివెడు జీఎస్టీని ఇస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు ముంతెడు విదిల్చటమే కాదు, 2.దక్షిణ భారత జల వనరులు, ఖనిజాల మీద వారి అజమాయిషీయే. 3.దక్షిణ భారత సాగర తీర భూములను ఖనిజాలను నార్తిండియా పాలకులు తెగనమ్ముకునే చట్టాలూ చేశారు. 4.ఇంకా దయనీయమేమంటే, గంపెడు ఆదాయాన్నిస్తున్న దక్షిణ భారత రైల్వే జోన్‌కు బుట్టెడు నిధులు విదిల్చి %-% బుట్టెడు ఆదాయాన్నిస్తున్న ఉత్తర భారత రైల్వే జోన్‌కు గంపెడు నిధులు కుమ్మరించటం. 5.అంతేకాదు, 'నవరత్న' హోదాను, ప్రపంచఖ్యాతిని పొంది, వేలాది ఎకరాలలో విశాఖ సాగరతీరాన విస్తరించి ఉన్న అతిపెద్ద ప్రభుత్వరంగ సంస్థ విశాఖ ఉక్కు కర్మాగారం, దానికి గనులు కేటాయించకుండా, ఉద్దేశపూర్వకంగా అప్పుల్లోకి నెట్టి, దాన్ని ఆశ్రిత కార్పొరేట్లకు కట్టబెట్టజూస్తున్న అడ్డుకోలేని, కనీసం ప్రశ్నించలేని అసహాయులను చేశారు దక్షిణ భారతీయులను. దేశ ఆర్థికాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, జనాభా నియంత్రణ వల్ల ఎంపీ సీట్లు తగ్గి నార్తిండియా పాలకులను కనీసం ప్రశ్నించలేని, బలహీన స్థితిలో ఉన్నయి దక్షిణాది రాష్ట్రాలు. డీ లిమిటేషన్‌తో ఉనికినే కోల్పోయే ప్రమాదం ముంచుకొస్తుందన్న వాస్తవాన్ని గుర్తించి, దక్షిణాది రాష్ట్ర ప్రభుత్వాలను, ప్రజలను ముందుగానే హెచ్చరించిన దీర్ఘదర్శి తమిళనాడు సీఎం స్టాలిన్. డీలిమిటేషన్ ప్రమాదం స్టాలిన్ ఊహ కాదు, ఈపాటికే నార్తిండియా పాలకులు రూపొందించుకున్న ప్రణాళిక అది! ఇప్పుడున్న 543 ఎంపీలకు అదనంగా 300 ఎంపీలను, ఉత్తరాది హిందీ రాష్ట్రాలలోనే పెంచుకోవాలన్నది వారి ప్రణాళిక. 'దక్షిణాది రాష్ట్రాల ఎంపీ సీట్లు తగ్గవు' అన్న అమిత్ షా ప్రకటనకు అర్థం పెరగవు అనే కదా! 888 ఎంపీలు కూర్చునేంత సువిశాల పార్లమెంట్ భవన నిర్మాణం, వారి ముందస్తు ప్రణాళికకు నిలువెత్తు నిదర్శనం అంటున్నారు రాజకీయ పరిశీలకులు. దక్షిణ భారతాన్ని కాంగ్రెస్ వాళ్లు రబ్బరు సుత్తితో మోదితే బీజేపీ వారు ఇనుప సుత్తితో మోదుతున్నారు. ఈ విషయంలో రెండు పార్టీలకు గల తేడా అంతే. ఇప్పటి నార్తిండియా పాలకుల ఎత్తుగడలు, ఒకప్పటి ఈస్టిండియా వారి ఎత్తుగడలను గుర్తుకుతెస్తున్నాయంటూ వాపోతున్నారు దక్షిణ భారతీయులు. ఈస్టిండియా పాలకుల ఎత్తుగడలు: 1.హిందూ, ముస్లిం రాజ్యాల మధ్య మత విద్వేష వ్యాప్తి ద్వారా, మెజారిటీ హిందూ రాజుల సమీకరణతో ముస్లిం రాజులను హతమార్చి వారి రాజ్యాలనాక్రమించారు. 2.హిందూ రాజులలో ఒకరికి మద్దతిస్తూ మరొకరిని హతమార్చుతూ అంతిమంగా హిందూ రాజ్యాలనూ దురాక్రమించారు. 3.ఆంగ్లభాష నేర్చినవారికీ ప్రభుత్వోద్యోగాలనూ - పదవులనూ కట్టబెడుతూ తమ భాషా, సంస్కృతులను విస్తరింపజేసుకున్నారు. 4.భారతదేశ ఖనిజ సంపదను తమ కార్పొరేట్లకు కట్టబెట్టుకున్నారు. 5.తమను ప్రశ్నించే పత్రికలను నిషేధించి, తాము చెప్పింది రాసే మీడియాను ప్రోత్సహించారు. ఆ ఎత్తుగడలతోనే భారతదేశాన్ని 200 ఏండ్ల పాటు తమ పాడి పశువుగా వాడుకున్నారు. నేటి నార్తిండియా పాలకులు గూడ 1.'హిందూత్వ' నినాదంతో మెజారిటీ హిందూ ఓటర్ల సమీకరణతో అధికారాన్ని దక్కించుకున్నారు. 2.'కాంగ్రెస్ ముక్త భారత్' నినాదంతో ప్రాంతీయ పార్టీలతో చేతులు కలిపి, మరో ప్రాంతీయ పార్టీని నిర్వీర్యం చేయటం ద్వారా 'ప్రాంతీయ పార్టీల ముక్త భారత్' లక్ష్యంతో దూసుకువెళ్తున్నారు. 4.హిందీ నేర్చిన వారికి ప్రవేశ పరీక్షల ద్వారా కేంద్ర ప్రభుత్వోద్యోగాలు ఇస్తూ తమ భాషా సంస్కృతులను విస్తరింపజేసుకుంటున్నారు. 5.తమను నిలదీసే మీడియాను, జర్నలిస్టులను అణచివేస్తూ, తమను ఆకాశానికెత్తే మీడియాను ప్రోత్సహిస్తున్నారు. అందుకే, నాటి ఈస్టిండియా పాలకుల లాగే నేటి నార్తిండియా పాలకులు గూడ దక్షిణ భారతాన్ని తమ పాడి పశువుగా చేసుకుంటారన్న భయాందోళనలో మునిగి తేలుతున్నారు దక్షిణ భారతీయులు. అందుకే కాంగ్రెస్, బీజేపీల నార్తిండియా పాలకులారా.. ఇప్పటికైనా దయచేసి మీ విధానాలను మార్చుకొని, దక్షిణ భారతీయుల భయాన్ని తొలగించండి. ముఖ్యంగా 'డీ లిమిటేషన్ ప్రక్రియను' జనాభా ప్రాతిపదికన కాకుండా, ప్రతి రాష్ట్రానికి మినిమం 20 ఎంపీలు మాగ్జిమమ్ 50 ఎంపీలుండేలా, అఖిల పక్షాల ఆమోదంతో రాజ్యాంగాన్ని సవరించండి. తద్వారా, ప్రతి రాష్ట్రానికీ మేము భారతదేశ భాగస్వాములమేనన్న భరోసాను కల్పించండి. అలా జాతీయ సమైక్యతను కాపాడండి, లేకుంటే.. పాక్ పాలకుల నిరంకుశ, అణచివేత, దోపిడీ విధానాలకు విసిగి నాడు బంగ్లాదేశ్ విడిపోయింది. ఐనా సరే, పాక్ పాలకులు తమ విధానాలను మార్చుకోని కారణంగా నేడు 'బలూచిస్థాన్' విడిపోయేందుకు ఉద్యమించింది. పాక్ పరిణామాలను చూసైనా నార్తిండియా పాలకులు, తమ విధానాలను మార్చుకుంటారని, ఇటు దక్షిణ భారత, అటు ఈశాన్య రాష్ట్రాల ఉద్యమాలకు బీజాలు పడకుండా, భారత జాతీయ సమైక్యతను కాపాడుతారని దేశ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# మాదిగ బిడ్డలపై మనసులేని సర్కార్



ఎస్సీల సంక్షేమ రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు ఏడాదిన్నర పాలనా కాలంలో ఎస్సీల సంక్షోభ రాష్ట్రంగా మార్చింది. తరతరాలుగా వెంటాడుతున్న వివక్ష, అణచివేత, అసమానత, అందుబాటులో లేని విద్య వెరసి సామాజిక, రాజకీయ, ఆర్థికరంగాల్లో ఎస్సీలు వెనుకబాటుతనానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి, సంక్షేమం కోసం బడ్జెట్‌లో ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని ఉమ్మడి రాష్ట్రంలో దశాబ్దాలుగా పోరాటాలు సాగాయి. ఉమ్మడి ఏపీలో ఎస్సీ సబ్‌ప్లాన్ అడుగు ముందుకు పడని దుస్థితి. పేరుకే బడ్జెట్‌లో కొండంత నిధుల కేటాయింపులున్నా, ఆచరణలో అవి రవ్వంతైనా ఖర్చుకాకపోయేటివి. పైగా ఆ నిధులను పక్కదారి పట్టించేవాళ్లు. ఖర్చంతా కేవలం కాగితాలపైనే. దళితులపై ప్రేమంతా మాటల్లోనే. ఇదీ%ొ% ఎస్సీలను నాటి పాలకులు వంచిస్తూ వచ్చిన తీరు! అదే ఆనవాయితీని ఇప్పుడున్న రేవంత్ సర్కార్ కొనసాగిస్తున్నది! 2023 నవంబర్‌లో ఎస్సీల గురించి చేవెళ్ల డిక్లరేషన్ పేరుతో ఎస్సీల అభివృద్ధికి చేపట్టబోయే కార్యక్రమాలపై హామీ ఇచ్చారు. పాలనలోకి వచ్చి సుమారు ఏడాదిన్నర పూర్తవుతున్నా నేటికీ ఎస్సీ అభివృద్ధి శాఖకు కనీసం మంత్రిని కూడా నియమించని దుస్థితి రాష్ట్రంలో నెలకొన్నది. ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధుల చట్టం 2017 పూర్తిగా విస్మరించిన ముఖ్యమంత్రి ఆ శాఖలను తన దగ్గరే పెట్టుకొని ఈ ఏడాది కాలంలో ఏ ఒక్కరోజు కూడా సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించలేదు. ఎస్సీల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్‌కు ఉన్న ప్రేమను తెలియజేస్తున్నది. ఇది ప్రజా ప్రభుత్వమని గొప్పలకు పోతున్న ముఖ్యమంత్రి అటు అధికారులతో, ఇటు ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలతో సమీక్షించడం పూర్తిగా మర్చిపోయి సంక్షేమాన్ని సంక్షోభంగా మార్చివేసిండు. 2024-25 బడ్జెట్‌లో ఎస్సీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద కాంగ్రెస్ ప్రభుత్వం రూ.33,127 కోట్లు కేటాయించింది. డిసెంబర్ నెలాఖరు నాటికి రూ.9,824 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. ఇంకా రూ.23,303 కోట్లు మిగిలిపోయాయి. ఎస్టీ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్‌కు రూ.17,056 కోట్లు కేటాయించగా, డిసెంబర్ నెలాఖరు నాటికి రూ.6,766 కోట్లు ఖర్చుచేసింది. రూ.10,299 కోట్లు మిగిలిపోయాయి. ఆ మిగిలిన నిధుల సంగతిని మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో వెల్లడించలేదు. ఖర్చు చేయంగా మిగిలిన నిధుల సంగతేమిటని ఎస్సీ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. 2025-26 బడ్జెట్‌లో రూ.40,232 కోట్లు కేటాయించినట్టు గొప్పలు చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి సర్కార్ అసలు కేటాయించిన నిధులు రూ.26,615 కోట్లు మాత్రమే. కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులపై నిజాలు దాచి దళితులను మోసం చేసింది. 2024-25 బడ్జెట్‌లో దళిత బంధు పథకానికి కేవలం 2 కోట్లు కేటాయించి, దళిత డిక్లరేషన్‌లో బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు మీద 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభయ హస్తం' ద్వారా ప్రతి దళిత కుటుంబానికి ఇస్తామన్న రూ.12 లక్షలు ఏ విధంగా ఇస్తారో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పాలి. 2025-26 బడ్జెట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అభయహస్తం ఊసే లేదు! 15 నెలల నుంచి కార్పొరేషన్‌లో ఎలాంటి నిధులు లేవు. రాష్ట్రంలో అన్ని విభాగాల నుంచి ఎన్ని నిధులు ఖర్చయ్యాయి. మరి ఎందుకు ఎస్సీల నిధులు మిగతా శాఖల నిధుల కంటే ఎందుకు తక్కువనో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి రుణాల పథకం ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉన్నదో తెలుస్తుంది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 15 నెలల నుంచి పాలనలో మా ఎస్సీ వర్గాల ప్రజలు గుర్తుకురాలేదా? తెలంగాణ ఏర్పాటు అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించారు. ఎస్సీ, ఎస్టీలకు ఉద్దేశించిన నిధులు ఇతర పథకాలకు మళ్లించకుండా రక్షణ కల్పించారు. ఏదైనా ఆర్థిక సంవత్సరంలో ఆ నిధులు పూర్తిగా ఖర్చుగాని పక్షంలో ఈ చట్టం ప్రకారం వాటిని తర్వాతి సంవత్సరానికి కచ్చితంగా బదలాయింపు చేసేలా నిబంధనలు తీసుకువచ్చారు. ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా, విద్యాపరంగా, సామాజికంగా సత్వర అభివృద్ధిని సాధించేందుకు తనదైనరీతిలో పాలన కొనసాగించారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు భద్రత పొందడమే లక్ష్యంగా, గత చట్టానికి భిన్నంగా తెలంగాణ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రత్యేక అభివృద్ధి (ప్రణాళిక, కేటాయింపు, ఆర్థిక వనరుల వినియోగం) చట్టం 2017ను పకడ్బందీగా రూపకల్పన చేశారు. ప్రభుత్వం ప్రతి ఆర్థిక సంవత్సరం రాష్ట్రం మొత్తం ప్రగతి పద్దు వ్యయంలో జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు నిధులను కేటాయిస్తున్నది. నిధుల ఖర్చుకు గత చట్టంలో 10 ఏండ్ల కాల పరిమితి ఉండగా, తెలంగాణ చట్టంలో దానిని తొలగించారు. తెలంగాణ ప్రభుత్వం రూ.1,08,754.54 కోట్లను ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు కేటాయించడం మరో విశేషం. అక్షరాలా లక్ష కోట్లు.. ఎస్సీల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ఖర్చు చేసింది! చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలోని దళిత కుటుంబానికి రూ.10 లక్షల సహాయం నూరు శాతం గ్రాంట్‌గా అందించింది. దీనిని లబ్ధిదారులు తిరిగి చెల్లించనవసరం లేదు. ఈ గ్రాంట్ దళితులు తమకు నచ్చిన, ఇష్టం వచ్చిన ఉపాధిని ఎంచుకొని, ఆత్మగౌరవంతో జీవించడానికి ప్రభుత్వం అండదండగా నిలిచింది. ఈ క్రమంలో వేలాది కుటుంబాలకు దళితబంధును మంజూరు చేసింది. మరో 1.30 లక్షల మందికి ప్రొసీడింగ్స్ ఇచ్చింది. కాంగ్రెస్ పార్టీ కూడా ఎన్నికల హామీల్లో భాగంగా దళితబంధును రూ.12 లక్షలకు పెంచి అమలు చేస్తామని ప్రకటించింది. కానీ, గత బడ్జెట్‌లో కాని, ఈ బడ్జెట్‌లో కాని దళిత బంధుకు నిధులు కేటాయించకపోవటంతో దళిత సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దళిత బంధు పథకం కింద కేసీఆర్ ప్రభుత్వం ఇప్పటివరకూ 50 వేల మంది లబ్దిదారులకు 5 వేల కోట్ల రూపాయలను అందించింది. బడ్జెట్‌లో ఈ పథకానికి 17,700 కోట్లు కేటాయించింది. రెండవ విడత లక్షా 30 వేల మందికి దళిత బంధు పథకం అందించింది. హుజూరాబాద్ నియోజకవర్గంలో నూటికి నూరు శాతం దళితబంధు పథకాన్ని అమలుచేసింది. ప్రభుత్వం ఇచ్చే లైసెన్సలలో దళితులకు 15 శాతం రిజర్వేషన్లు కూడా అమలుచేసింది. ఫర్టిలైజర్ షాపుల కేటాయింపులో, హాస్పిటల్ హాస్టల్ కాంట్రాక్టుల కేటాయింపుల్లో, మెడికల్ షాపుల కేటాయింపుల్లో రిజర్వేషన్ అమలుచేసింది. రాష్ట్రంలో కేటాయించిన 2,616 వైన్ షాపుల్లో 261 షాపులు దళితులకు కేటాయించింది. కేసీఆర్ ప్రభుత్వం రూ. 147 కోట్లు ఖర్చు చేసి ప్రపంచంలోనే అతి పెద్దదైన 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని' నెలకొల్పింది. దళిత విద్యార్థులు విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించడానికి అంబేద్కర్ ఓవర్సీస్ స్కాలర్ షిప్ కింద రూ.20 లక్షల ఆర్థికసాయం అందించింది. దళితుల గృహావసరాల కోసం 101 యూనిట్ల వరకూ విద్యుత్తును ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసింది. షెడ్యూల్డ్ కులాలు, తెగల అభివృద్ధికి ప్రత్యేక ప్రగతినిధి చట్టాన్ని కేసీఆర్ ప్రభుత్వం అమలుపరిచింది. కేసీఆర్ పదేండ్ల పాలనలో అన్ని వర్గాలు సుభిక్షంగా వర్ధిల్లాయి. కానీ, నేడు ఆ పరిస్థితి కనుమరుగైంది.



## చైనా దురాక్రమణను భారత్ ఎన్నటికీ అంగీకరించబోదు: కేంద్రం స్పష్టీకరణ

సరిహద్దుల్లో చైనా దుందుడుకు వ్యవహారశైలిపై భారత్ మరోసారి మండిపడింది. తమ భూభాగాన్ని చైనా ఆక్రమించడాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించబోదని స్పష్టం చేసింది. కాగా, సరిహద్దు వివాదం పరిష్కారానికి చర్చల దిశగా ప్రయత్నాలు జరుగుతుంటే.. చైనా మాత్రం కవ్వింపులకు పాల్పడుతోంది. లఢఖ్ భూభాగంలోని కొన్ని ప్రాంతాల్లో కౌంటీల ను ఏర్పాటు చేస్తోంది. ఈ విషయంపై ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చైనా కౌంటీల నిర్మాణంపై కేంద్రానికి సమాచారం ఉందా..? అంటూ అడిగారు. ఈ ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. కౌంటీలతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో చైనా చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కూడా తమకు సమాచారం ఉందని వెల్లడించారు. భారత భూభాగాన్ని చైనా అక్రమంగా ఆక్రమించడాన్ని భారత ప్రభుత్వం ఎన్నటికీ అంగీకరించబోదని స్పష్టం చేశారు. చైనా పాల్పడుతున్న చట్టవిరుద్ధమైన, బలవంతపు ఆక్రమణను భారత్ చట్టబద్ధం చేయబోదన్నారు.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,